


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★


మాగంటి గోపినాథ్ మృతిపై అనుమానాలు

03

స్వీయ అవగాహనతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట

సంపుటి 08, సంచిక: 339 | సోమవారం | 10-11-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# సెంటిమెంటా.. డెవలప్‌మెంటా?

'కెటిఆర్ జాతకంలో అధికార యోగం అనే రేఖే లేదు. ఆయన దశ బాగోలేనప్పుడు తండ్రి కెసిఆర్ ఎన్ని దిశలు మార్చినా ప్రయోజనం ఉండదు. పుత్ర వాత్సల్యంతో కెసిఆర్ ధృతరాష్ట్రుడిలా మారారు. కెటిఆర్ ఎన్నికల ప్రచారం చూస్తుంటే 'పుష్ప' సినిమాలోని శ్రీలీల ఐటమ్ సాంగ్ గుర్తుకొస్తోంది.

'ఎవరిది అగ్రికల్చరో, ఎవరిది డ్రగ్స్ కల్చరో ప్రజలు ఆలోచించుకోవాలి. గల్లీ గల్లీలో గంజాయి కల్చర్ తీసుకొచ్చింది ఎవరో ఆలోచించాలి. ఉపఎన్నికల్లో పోటీ పెట్టే విషసంస్కృతిని తీసుకొచ్చిందే కెసిఆర్ గతంలో పిజెఆర్ చనిపోయినప్పుడు కెసిఆర్ అభ్యర్థిని నిలబెట్టి ఎన్నికలు తెచ్చారు. రాంరెడ్డి వెంకటరెడ్డి విషయంలోనూ అదే విష సంస్కృతి అవలంబించారు.'

## 2034 వరకు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పాలన

- హైదరాబాద్‌ను అభివృద్ధి చేసే బాధ్యత నాదే
- జిహెచ్‌ఎంసిలో కంటోన్మెంట్ విలీనం అయ్యే ప్రక్రియ కొనసాగుతుంది
- ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణం ప్రారంభమైంది
- జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయం
- బిఆర్‌ఎస్ కూలిపోతుంటే.. మౌనంగా కుమిలిపోతున్న కెసిఆర్
- కెటిఆర్ తన భాష, అలవాట్లు మార్చుకోవాలి
- 'మీట్ ది ప్రెస్'లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి






ప్రజాపక్షం/హైదరాబాద్

'రాసి పెట్టుకోండి... వచ్చే 2034 జూన్ వరకూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పాలనే' ఉంటుంది అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. రాబోయే 10 సంవత్సరాలు ప్రజా ప్రభుత్వం కొనసాగుతుందన్నారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసే బాధ్యత తనపై ఉందన్నారు. సెంటిమెంటా, డెవలప్ మెంటా, జూబ్లీహిల్స్ ప్రజలు తేల్చుకోవాలన్నారు. మాజీ సిఎం కెసిఆర్ పథకాలను కొనసాగిస్తూ అదనంగా అనేక కొత్త పథకాలు తెచ్చానని తెలిపారు. హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణాలో ఆదివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో 'మీట్ ది ప్రెస్' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ హాజరవ్వగా, సీనియర్ తరువాయి 2లో

### కిషన్ రెడ్డి గుజరాత్‌కు గులాం, కెటిఆర్‌తో సావాసం..

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకుంటున్నారు. కిషన్ రెడ్డి గుజరాత్ గులాం అయ్యాడన్నారు. కెటిఆర్‌తో చేతులు కలిపాడని విమర్శించారు. బిజెపి, బిఆర్‌ఎస్ ఫెవికాల్ బంధంతో ఉన్నాయని, ఇద్దరూ కలసి అభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. బిఆర్‌ఎస్‌ను తీవ్రంగా వ్యతిరేకించే ఎంపిలు విశ్వేశ్వర్ రెడ్డి, అరవింద్, ఈటల రాజేందర్‌లను జూబ్లీ హిల్స్ ప్రచారంలో ఎందుకు దూరంగా ఉంచారని ప్రశ్నించారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌ని చివరి నిమిషంలో ప్రచారంలో దించారన్నారు. కేవలం బిఆర్ ఎస్‌ను గెలిపించేందుకే కిషన్ రెడ్డి లోపాయికారిగా మద్దతిస్తున్నారన్నారు.

# గప్‌చుప్...



## ఎన్నికల ప్రచారానికి తెర : మూగబోయిన మైకులు

### జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్, బిజెపి, బిఆర్‌ఎస్ హోరాహోరీ ప్రచారం

ప్రజాపక్షం/హైదరాబాద్




జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో ప్రధాన పార్టీల ప్రచారం ముగిసింది. బరిలో ఉన్న అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్దేశించేందుకు ఇక ఓటరు తీర్పే మిగిలి ఉంది. ముగ్గురు ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు మొత్తం 58 మంది పోటీ పడుతున్న ఈ ఉపఎన్నికల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా అధికారులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. కాగా సరిగ్గా ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు మైకులు మూగబోయాయి. దాదాపు 17 రోజుల పాటు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం కొనసాగింది. ర్యాలీలు, రోడ్ షోలు, ఇంటింటి ప్రచారాలతో ప్రధాన పార్టీల నాయకులు హోరెత్తించారు. గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగిన ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపి చివరిరోజు భారీ ర్యాలీలు, రోడ్ షోలతో ప్రచారాన్ని ముగించాయి. ఎన్నికల ప్రచారంలో ప్రధాన పార్టీల నాయకులతో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం సాయంత్రం 5 గంటల తర్వాత జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పలు జిల్లాల నుంచి వచ్చిన పార్టీల నాయకులందరూ తిరిగి వెళ్లిపోవాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఇప్పటికే తెలిపారు. జూబ్లీ హిల్స్‌లో గెలుపు ప్రతిష్టాత్మకంగా మారడంతో అధికార పార్టీ కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీలైన బిఆర్‌ఎస్, బిజెపి జోరుగా ప్రచారం చేశారు. ఇప్పుడు ప్రచార గడువు ముగియడంతో చివరి అస్త్రంగా పోల్ మేనేజ్‌మెంట్‌పై పార్టీలు దృష్టి సారించాయి. జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గంలో చివరిరోజైన ఆదివారం కూడా కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం నిర్వహించింది. ఇందుకోసం మంత్రుల ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి, రెండేండ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించి ఓట్లు అభ్యర్థించారు. ఈ ఉప ఎన్నికలో గెలవడం ద్వారా ప్రతిపక్షాల విమర్శలకు జవాబు చెప్పాలని కాంగ్రెస్ పట్టుదలగా ఉంది. సిఎం తరువాయి 2లో

### బిహార్‌లో ముగిసిన మాటల యుద్ధం

**పాట్నా :** బిహార్‌లో హోరాహోరీగా జరిగిన రెండవ, చివరి దశ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఆదివారం సాయంత్రం ముగిసింది. రాష్ట్రంలో అధికారం కోసం పోటీ పడుతున్న ప్రత్యర్థుల మధ్య దాదాపు నెలరోజుల పాటు తీవ్రమైన మాటల యుద్ధం కొనసాగింది. నరాలు తెగే ఉత్కంఠతో ప్రచారం కొనసాగింది. రికార్డు స్థాయిలో 65 శాతం పోలింగ్ నమోదు చేసిన మొదటి దశ ఎన్నికలు నవంబర్ 6న జరగగా, రెండవ దశకు పోలింగ్ 11న జరుగుతుంది. 14న ఓట్ల లెక్కింపు చేయనున్నారు. రెండవ దశలో 122 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మొదటి రౌండ్‌లో 121 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ జరిగింది. అయితే రెండవ విడతలో ఎన్నికలు జరగనున్న ముఖ్యమైన స్థానాల్లో చకైలో జెడి(యు) మంత్రి సుమిత్ కుమార్ సింగ్, జముయిలో బిజెపి ఎమ్మెల్యే శ్రేయసి సింగ్, ధమ్‌దహాలో జెడి (యు) మంత్రి లేషి సింగ్, ఛతాపూర్‌లో బిజెపి మంత్రి నీరజ్ కుమార్ సింగ్ బరిలో ఉన్నారు. కాగా, ప్రచారం ముగింపు రోజున కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ముమ్మరంగా మాటల యుద్ధం సాగగింది సీమాంచల్ ప్రాంతంలోని కిషన్‌గంజ్, పూర్నియా జిల్లాల్లో జరిగిన ర్యాలీలలో కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ప్రసంగించారు. ఇక్కడ ముస్లింలు గణనీయమైన జనాభా ఉన్నారు. వీరి మద్దతు ప్రతిపక్ష భారత కూటమికి చాలా ముఖ్యమైనది. ఆయన మొత్తం 15 ఎన్నికల సమావేశాలలో ప్రసంగించారు. రెండు నెలల క్రితం ఆయన పక్షం రోజుల పాటు జరిగిన ఓటరు అధికార్ యాత్రకు నాయకత్వం వహించారు. ఎన్నికలు జరగనున్న రాష్ట్రంలో రోజుల తరబడి ఉంటూ, ఏ జాతీయ నాయకుడికీ లేని అత్యంత తీవ్రమైన ప్రచారాన్ని నిర్వహిస్తున్న షా, బిజెపి సాపేక్షంగా తరువాయి 2లో



# వేలకోట్ల రూపాయలతో మురికివాడల అభివృద్ధి

- జూబ్లీహిల్స్‌లో నవీన్‌ను గెలిపిస్తేనే సాధ్యం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి
- పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో హైదరాబాద్ అభివృద్ధిని గాలికొదిలేశారని విమర్శ
- డబుల్ బెడ్‌రూమ్‌లపై గులాబీ పార్టీ భ్రమలు కల్పించిందని మండిపాటు



ప్రజాపక్షం/హైదరాబాద్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించుకుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా మంత్రుల సమన్వయంతో నియోజకవర్గంలో వేలకోట్ల రూపాయల నిధులతో మురికివాడలను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలన్న తపన, సత్తా, సంకల్పం ఉన్న నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే, రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి వసతి, రేషన్ కార్డులు వంటి పనులు వేగంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని, జూబ్లీహిల్స్ ప్రజలు నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని యూసుఫ్ గూడలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణా రావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి డిప్యూటీ సిఎం భట్టి మాట్లాడుతూ నవీన్ యాదవ్ స్థానికుడని, మంచి సేవకుడని, పదవి ఉన్నా, లేకున్నా స్థానికంగా సాంఘిక సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టిన వ్యక్తి అని అన్నారు. పదేళ్ల తరువాయి 2లో




# పాటలు, నాటికల ద్వారా సిపిఐ వందేళ్ల చరిత్ర ప్రచారం

- ప్రజలను చైతన్యపర్చాలి
- సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి పిలుపు
- వందేళ్ల పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించేలా అందరిని కలిపే అభ్యుదయ గీతాలాపన చేయాలి : చాడ

ప్రజాపక్షం/హైదరాబాద్

వందేళ్ల 'భారత కమ్యూనిస్టు పార్టీ' (సిపిఐ) చరిత్రను పాటలు, నాటికల ద్వారా ప్రజలకు తెలియజేస్తూ, చైతన్యపర్చాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో 'అరసం, తెలంగాణ ప్రజానాట్య మండలి' సంయుక్త ఆధ్వర్యం లో సిపిఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా ఆదివారం రాష్ట్ర స్థాయి కవులు, కళాకారుల శిక్షణ తరగతుల ముగింపు సభలో పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడారు. దేశంలో భారత కమ్యూనిస్టు పార్టీకి ఎనలేని చరిత్ర ఉందన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటం, తెలంగాణ సాయుధ పోరాటం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర పోరాటం, రావి నారాయణ రెడ్డి, మఖ్దూం మొయినుద్దీన్ , బద్దం ఎల్లారెడ్డి వంటి అనేకమంది నిజాంకు వ్యతిరేకంగా చేసిన భూపోరాటాలు, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు, ప్రజల హక్కుల కోసం, కార్మికులు, విద్యార్థుల ఇలా తరువాయి 2లో

# ఓటు దొంగతనం కప్పిపుచ్చుకునేందుకే 'సర్'

- ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణను సంస్థాగతీకరించేందుకు యత్నం
- ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శ



**పచ్‌మరి :** ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్), ఓటు దొంగతనంపై లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మరోసారి మండిపడ్డారు. ఓటు దొంగతనాన్ని కప్పిపుచ్చుకునేందుకే సర్‌ను చేపడుతున్నారని విమర్శించారు. సర్‌ను సంస్థాగతీకరించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. మధ్యప్రదేశ్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణా శిబిరంలో పాల్గొనడానికి రాహుల్‌గాంధీ శనివారం మధ్యప్రదేశ్ నర్మదాపురంలోని కొండ ప్రాంత పట్టమైన పచ్‌మరికి విచ్చేశారు. అయితే ఆదివారం ఆయన మధ్యప్రదేశ్‌లోని పచ్‌మరిలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. హర్యానా మాదిరిగానే, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ లలో కూడా ఓటు దొంగతనం జరిగిందని తాను చాలా దృఢంగా విశ్వసిస్తున్నానన్నారు. ఓటు దొంగతనమే ఒక సమస్య అనుకుంటే దానికి తోడు ఇప్పుడు సర్‌కు దాపురించిందన్నారు. ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)ను ఈనెల 4న ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ ప్రక్రియ తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాలలోని 321 జిల్లాలు , 1,843 అసెంబ్లీ నియోజకవర్గాలలో దాదాపు 51 కోట్ల మంది ఓటర్లను కవర్ చేస్తుంది. కాగా, 'కొన్ని రోజుల క్రితం నేను హర్యానాపై ఒక ప్రజెంటేషన్ ఇచ్చాను, ఓట్ల దొంగతనం జరుగుతున్నట్లు నేను స్పష్టంగా చూశాను... 25 లక్షల ఓట్లు దొంగిలించబడ్డాయి, 8 ఓట్లలో ఒకటి నకిలీ ఓటుగా తేలింది' అని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ గణాంకాలను చూసిన తర్వాత మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లో కూడా అదే జరిగినట్లు దాను బలంగా నమ్ముతున్నానన్నారు. ఇదీ బిజెపి, ఎన్నికల కమిషన్ (ఎన్నికల కమిషన్) వ్యవస్థ అని ఆయన ఆరోపించారు. తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని చెప్పారు. వాటిని తరువాయి 12లో

## మోహన్ భాగవత్ వ్యాఖ్యలు

# సంఘ్ రక్షణకోసం చెప్పే వక్రభాష్యం

### సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శ



**న్యూఢిల్లీ:** ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్‌కు ఆర్‌ఎస్‌ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ చెబుతున్న సమాధానం వారికి అలవాటైన,సంఘ్ రక్షణకోసం ఆడే సరికొత్త నాటకమని భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి డి. రాజా విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను, దాని కార్యకలాపాలను రక్షించుకోవడంకోసం ఆత్మరక్షణకోఐసం తప్పుతోవ పట్టించేవిధంగా మోహన్ భాగవత్ వక్రభాష్యం చెబుతున్నారని విమర్శించారు.దేశంలో తరచు శాంతి భద్రతల సమస్య తలెత్తడానికి కారణమైన ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించాలని ప్రతిపక్షాలు కోరడంపై భాగవత్ స్పందిస్తూ, ఆర్‌ఎస్‌ఎస్‌ను ప్రతిపక్షాలు గుర్తింపు లేని సంస్థగా పేర్కొంటున్నాయని, అసలు గుర్తింపేలేని సంస్థను గతంలో ఏ విధంగా మూడుసార్లు నిషేధించారని, ఈ విధంగా నిషేధించడం అంటే ఆర్‌ఎస్‌ఎస్‌కు తరువాయి 12లో

# భారీ ఉగ్రదాడులకు కుట్ర

హైదరాబాద్ వ్యక్తి సహా ముగ్గురు ఉగ్రవాదుల అరెస్ట్



**అహ్మదాబాద్ /హైదరాబాద్:** దేశవ్యాప్తంగా ఉగ్రదాడులకు కుట్ర పన్నుతున్న ముగ్గురు ఉగ్రవాదులను అహ్మదాబాద్‌లో గుజరాత్ యాంటీటెర్రరిజం స్క్వాడ్ (ఎటిఎస్) అరెస్టు చేసింది. గత ఏడాది నుంచి నిందితులపై నిఘా పెట్టిన గుజరాత్ ఎటిఎస్, ఆయుధాలు సరఫరా చేస్తుండగా ముగ్గురిని అదుపులోకి తీసుకుంది. విచారణ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉగ్రదాడులకు వీరు ప్రణాళిక చేస్తున్నట్టు గుర్తించింది. నిందితుల వద్ద నుంచి రెండు గ్లోక్ పిస్టల్స్, ఒక బెరెట్టా పిస్టల్, 30 బుల్లెట్లు, 4 లీటర్ల ఆముదం తరువాయి 12లో

## ఐదు రాష్ట్రాల్లో టిజిసిఎస్‌బి ఆపరేషన్.. 81 మంది సైబర్ నేరగాళ్ల అరెస్టు

నిందితుల్లో బ్యాంక్ అధికారులు కూడా...



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) అధికారులు ఐదు రాష్ట్రాల్లో 25 రోజుల పాటు సైబర్ నేరగాళ్లను పట్టుకునేందుకు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా 81 మంది నేరగాళ్లను అరెస్టు చేశారు. వీళ్లు దేశవ్యాప్తంగా 754 నేరాలకు పాల్పడగా తెలంగాణలో 128 నేరాలకు పాల్పడినట్లు దర్యాప్తులో తరువాయి 12లో

### అణచివేత ప్రతిపాదిత చట్టాలను ప్రతిఘటిస్తూ

# కార్మికుల భారీ ప్రదర్శన

పోర్చుగల్ రాజధాని లిస్బన్‌లో వీధుల్లోకి వచ్చిన లక్షలాది మంది కార్మికులు




**లిస్బన్:** కార్మికులను అణచివేసేందుకు ఉద్దేశించిన ప్రతిపాదిత చట్టాన్ని ప్రతిఘటిస్తూ పోర్చుగల్ రాజధాని లిస్బన్‌లో కార్మికులు భారీ ప్రదర్శన జరిపారు. పోర్చుగల్‌లో అతిపెద్ద యూనియన్ సిజిటిపి నాయకత్వంలో ఈ ప్రదర్శనలు జరిగాయి. యాజమాన్యాలు చాలా సులభంగా కార్మికులను ఎలాంటి కారణం చెప్పకుండా ఉద్యోగాల నుండి తొలగించేందుకు వీలు కల్పించేందుకు చట్టాలను సవరించి కొత్త క్లాజులు చేర్చేందుకు చేసిన ప్రతిపాదనలను తీవ్రంగా ప్రతిఘటిస్తూ కార్మికులు వీధుల్లోకి వచ్చారు. తమ హక్కులను కాపాడుకుంటామని నినాదాలు చేశారు. కార్మిక సంఘాలన్నీ మంగళవారంనాడు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపు ఇచ్చాయి. లిస్బన్‌లో ఆదివారం నాడు 1,00,000 మందితో భారీ ప్రదర్శన జరిగిందని రాయిటర్స్ వార్తాసంస్థ ప్రకటించింది. మెడికల్ డెవైజ్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికుడు మిరైజ్ అల్వెస్ (31) మాట్లాడుతూ, కార్మికుల పని పరిస్థితులను అనేక సంవత్సరాలు వెనక్కు నెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. దీనివల్ల ఎవ్వరికీ ఉద్యోగ భద్రత ఉండదన్నారు. టెక్నీషియన్ మడలెనా తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## జపాన్‌లో భూకంపం : సునామీ హెచ్చరిక

### రిక్టర్ స్కేలుపై 6.7 తీవ్రత

**టోక్యో:** జపాన్ ఉత్తర ప్రాంతంలో ఆదివారం సాయంత్రం తీవ్ర భూకంపం సంభవించింది. దీంతో సునామీ హెచ్చరిక కూడా జారీ చేశారు. ఇవాటే తీర ప్రాంతంలో సముద్ర ఉపరితలానికి 10 కి.మీ లోతున 6.7 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు జపాన్ భూభౌతిక, వాతావరణ విభాగం ప్రాథమికంగా అంచనా వేసింది. ఈ భూకంపంవల్ల ఎంత నష్టం జరిగిందనే విషయం వెంటనే తెలియరాలేదు. భూకంపం వచ్చిన ప్రాంతాల్లో రెండు అణు కర్మాగారాలు కూడా ఉన్నాయి. తీర ప్రాంతాలకు ప్రజలు దూరంగా ఉండాలని, సునామీ ప్రమాదం ఉందని జపాన్ న్యూస్ ఛానల్ ఎన్‌హెచ్‌కె ద్వారా హెచ్చరిక వెలువడింది.

## చైనా–భారత్ విమాన సేవలు పునఃప్రారంభం



**షాంఘై:** చైనా నుండి భారతదేశానికి విమాన సేవలు తిరిగి ప్రారంభమయ్యాయి. అదేవిధంగా భారత్‌కు చెందిన ఇండిగో విమాన సంస్థ కూడా నవంబరు 10వ తేదీ సోమవారం నుండి చైనాకు రోజువారీ ప్రాతిపదికపై ఎ 320 విమాన సర్వీసులను ప్రారంభిస్తుంది. చైనా మెయిన్ లాండ్‌లో విమాన రాకపోకల సేవలు నిర్వహించే ఈస్ట్రన్ ఎయిర్‌లైన్స్ నేరుగా షాంఘై నుండి ఢిల్లీకి విమాన రాకపోకలను ఆదివారం ప్రారంభించింది. షాంఘైలోని పుడోంగ్ ఇంటర్నేషనల్ విమానాశ్రయం నుండి ఎంయు 563 ఫ్లయిట్ 248 మంది ప్రయాణికులతో ఆదివారం మధ్యాహ్నం 1.02 గంటలకు ఢిల్లీకి బయలుదేరింది. భారత్–చైనా మధ్య ఈ ఏడాదిలో మొదటిసారి విమానాల రాకపోకలను ప్రారంభించిన మొట్టమొదటి ఎయిర్ లైన్స్ ఇదే.

షాంఘై–ఢిల్లీ మార్గంలో ఎయిర్ బస్ ఎ 330 వైడ్ బాడీ విమానం రాకపోకలు నిర్వహిస్తుంది. వారంలో మూడురోజులు అంటే బుధవారం, శనివారం, ఆదివారాలలో మూడుసార్లు ఈస్ట్రన్ ఎయిర్‌లైన్స్ ఈ రెండు ప్రధాన నగరాల మధ్యా నేరుగా విమానాలు నడుపుతుంది. మార్కెట్ సర్వే ద్వారా లభించిన సమాచారం మేరకు క్రమంగా ఈ సేవలను విస్తృతం చేయాలని భావిస్తున్నట్లు ఒక ప్రకటనలో ఈస్ట్రన్ ఎయిర్‌లైన్స్ పేర్కొంది. కున్మింగ్–కోల్‌కతా మార్గం, పుడోంగ్ షాంఘై–ముంబై మార్గాలలో కూడా విమాన సేవలను పునరుద్ధరించాలని ఈస్ట్రన్ ఎయిర్‌లైన్స్ లక్ష్యనిర్దేశం చేసుకుంది. భారత్‌లో ఢిల్లీ, ముంబై, కోల్‌కతా నగరాలను కీలకమైన ఆర్థిక నగరాలుగా, సాంస్కృతికంగా, ఇతర రంగాలలో కూడా ఎక్కువ ప్రోత్సాహం లభించేందుకు అవకాశాలు పెరుగుతాయని ఈ సంస్థ గట్టిగా భావిస్తోంది.

భారత్–చైనా మధ్య ఇటీవలి సంవత్సరాలలో ఉద్రిక్తతలు మెల్లిగా సడలిన తర్వాత ఈ ఏడాది అక్టోబరు 26వ తేదీన ఇండిగో విమాన సంస్థ కోల్‌కతా నుండి చైనాలోని గ్వాంగ్‌డాంగ్ రాష్ట్రంలో ఉన్న గ్వాంగ్‌జౌకు మొదటి విమానాన్ని నడిపింది. కరోనా మహమ్మారి తర్వాత భారత్ విమానం తిరిగి అక్కడ దిగడంతో రెండు దేశాల మధ్యా గగనతల రాకపోకలు పునరుద్ధరించినట్లయింది. సోమవారం నుండీ ఇక రోజువారీగా ఇండిగో సంస్థ సర్వీసులు నడుపుతుంది. కరోనా వచ్చిన తర్వాత ఈ సేవలు నిలిచిపోయాయి. ఆ తర్వాత రెండు దేశాలమధ్యా సైనిక సంఘర్షణ జరగడంతో ఈ సేవలకు సుదీర్ఘ అంతరాయం కలిగింది. 2020 జూన్‌లో గాల్వన్ లోయలో ఇరు దేశాల సైన్యాలమధ్యా ఘర్షణ జరగడంతో 1962 తర్వాత ఎన్నడూలేనంత క్షీణదశకు ఈ సంబంధాలు దిగజారాయి.

## ఫిలిప్పీన్స్‌కు మరో సూపర్ పవర్ తుఫాన్

### 10 లక్షల మంది ప్రజల తరలింపు



**మనీలా:** ఫిలిప్పీన్స్ దేశానికి కష్టాలమీద కష్టాలు ఎదురవుతున్నాయి. నిన్నమొన్నటిదాకా భారీ తుఫాను ఎదుర్కొన్న ఆ దేశం ఆ కష్ట నష్టాల నుండి బయట పడకముందే వారం రోజుల వ్యవధిలోనే మరో సూపర్ పవర్ తుఫానును ఎదుర్కోవలసి వస్తోంది. ఆదివారం ఉదయమే తూర్పు ఫిలిప్పీన్స్ ఈస్ట్రన్ బైకోల్ ప్రాంతాన్ని కబళించింది. ఫంగ్–వాంగ్ అని పిలిచే ఈ సూపర్ పవర్ తుఫాను ఉద్ధృతవేగంతో దూసుకువచ్చింది. దీనికి ముందుగానే దాదాపు 10,00,0000 మంది ప్రజలను ఉత్తర ఫిలిప్పీన్స్ ప్రాంతం నుండి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మూడు రోజులక్రితం కల్మెగీ తుఫాను ఫిలిప్పీన్స్‌ను గడగడలాడించింది. అపారమైన నష్టాన్ని కలగజేసింది. ఈ తుఫానులో చిక్కుకుని 200 మంది ప్రజలు మరణించారు. వందల మంది గాయపడ్డారు. ఎక్కడపడితే అక్కడ ఇళ్ళు కూలిపోయాయి. అనేక నగరాలను, పట్టణాలను వరదలు ముంచెత్తియి. వాహనాలు కొట్టుకుపోయాయి. విరిగిన చెట్లు, ధ్వంసమైన ఇళ్ల అలాగే ఉన్న పరిస్థితుల్లో ఇంకా కూడదీసుకోకముందే మరో సూపర్ పవర్ తుఫాను చుట్టుముట్టింది. ఫిలిప్పీన్స్ ఈ ఏడాదిలో ఇప్పటివరకూ 20కి పైగా భారీ తుఫానులను ఎదుర్కొంది. ప్రతి సంవత్సరం 20కి తక్కువ కాకుండా తుఫానులు ఆ దేశాన్ని పట్టి కుదిపివేస్తాయి. వాతావరణ మార్పుల కారణంగా ఫిలిప్పీన్స్ తీవ్రంగా నష్టపోతోంది. అందుకే దేశంలో ఎక్కువమంది ఇంకా పేదరికంలోనే జీవనం సాగిస్తున్నారు. దేశాధ్యక్షుడు ఒక ప్రకటన చేస్తూ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గంటకు 230 కి.మీ వేగంతో భీకరమైన గాలులు వీచే ప్రమాదం ఉందని, ప్రజలు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని కోరారు. ఒక ప్రకృతి వైపరీత్యాల నిధిని కూడా ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు అధ్యక్షుడు ప్రకటించారు. తక్షణ సహాయాన్ని యుద్ధ ప్రాతిపదికపై సరఫరాలు చేసేందుకు అధికారులకు మరిన్ని అధికారాలను సమకూర్చారు. ఇదిలా ఉండగా, బ్రెజిల్‌ను కూడా మరో తుఫాను అతలాకుతలం చేసింది. ఈ తుఫానువల్ల ఆరుగురు మరణించారు. మరో 750 మంది గాయపడ్డారు.

## బంగ్లాదేశ్‌లో టీచర్ల నిరసన

### స్తంభించిన 65 వేల పాఠశాలలు



**ఢాకా:** టీచర్లపై షాబాగ్‌లో లాఠీచార్జిని వ్యతిరేకిస్తూ బంగ్లాదేశ్‌లో దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. వేలాదిమంది టీచర్లు వీధుల్లోకి రావడంతో 65,000 ప్రాథమిక పాఠశాలలు తెరుచుకోలేదు. విద్యాపరమైన కార్యకలాపాలన్నీ స్తంభించిపోయాయి. దేశ రాజధాని సెంట్రల్ షాహీద్ మినార్ వద్ద వేలాదిమంది టీచర్లు ఆదివారం ఉదయం నుండి బైఠాయించారు. వేతనాలు పెంచాలని, పదోన్నతులు ఇవ్వడంలో పాటిస్తున్న వివక్ష విధానాలకు స్వస్తి చెప్పాలని, సెకండరీ గ్రేడ్ టీచర్లతో సమానంగా తమకు కూడా సమాన ప్రతిపత్తి ఇవ్వాలని కోరుతూ వారు దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలకు దిగారు. హోమ్ మంత్రిత్వశాఖ సలహాదారులు, ప్రాథమిక, విద్యామంత్రిత్వశాఖ అధికారులు తక్షణం రాజీనామాలు సమర్పించాలని ప్రదర్శకులు నినాదాలు చేశారు. షాబాగ్‌లో శనివారం మధ్యాహ్నం టీచర్ల నిరసన ప్రదర్శన సందర్భంగా పోలీసులు దురుసుగా ప్రవర్తించి వాటన్ కేనన్స్ ప్రయోగించడంతోపాటు లాఠీచార్జి చేయడాన్ని ఖండిస్తూ ప్రధానంగా ఈ నిరసన ప్రదర్శన జరిగింది. ఈ లాఠీచార్జిలో 100 మంది పైగా టీచర్లు గాయపడ్డారు. టీచర్లకు సంబంధించిన మూడు డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ వేలాదిమంది వీధుల్లోకి రావడంతో పోలీసులు ఇష్టానుసారంగా లాఠీచార్జిచేశారు. దీంతో ప్రాథమిక ఉపాధ్యాయుల డిమాండ్ల అమలు మండలి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుండే దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి.

## బొలీవియాలో మళ్ళీ పెట్టుబడిదారీ పరిపాలన

## అధ్యక్షుడుగా రోడ్రిగో ప్రమాణస్వీకారం



**లాపాజ్:** దక్షిణ అమెరికా దేశం బొలీవియా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ అనుకూల రోడ్రిగో పాజ్ పెరీరా (58) శనివారం (నవంబరు 8)న పదవీ బాధ్యతలు తీసుకున్నారు. ఐదేళ్ళపాటు ఆయన అధికారంలో కొనసాగుతారు. ఈ ఏడాది ఆగస్టు 17వ తేదీన అధ్యక్ష పదవికి తొలి విడత ఎన్నికలు జరిగాయి. గత నెలలో రన్నాఫ్ ఎన్నికలు జరిగాయి. రన్నాఫ్‌లో రోడ్రిగోకు 54.89 శాతం ఓట్లు లభించాయి. దేశ 68వ అధ్యక్షుడుగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో పెట్టుబడిదారీ తరహా మార్కెట్ ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరిస్తానని ప్రకటించారు. విదేశీ సంబంధాలను కూడా తిరగరాస్తామన్నారు. వ్యాపార వర్గాలకు అనుకూలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తానని చెప్పారు. ఇంధన రంగం జాతీయాకరణతో పాటు ఆర్థిక విధానాలను పునఃసమీక్షిస్తామని, విదేశాలతో దౌత్యస్థాయి సంబంధాలను సమీక్షించి కొత్త నిర్ణయాలు తీసుకుంటామని రోడ్రిగో ప్రకటించారు.

బొలీవియా మాజీ అధ్యక్షుడు జైమ్ పాజ్ జమోరా పెద్ద కుమారుడు రోడ్రిగో. బొలీవియా క్రిస్టియన్ డెమోక్రటిక్‌పార్టీ (పిడిసి)కి చెందిన రోడ్రిగో 2020 నుండి 2025 వరకూ తరిజా నియోజకవర్గం నుండి సెనేటర్‌గా పనిచేశారు. 2015 నుండి 2020 వరకూ తరిజా మేయర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2002 నుండి 2010 వరకూ ఛాంబర్ ఆఫ్ డిప్యూటీస్‌కు ప్రాతినిధ్యం వహించారు. కాగా 2005 డిసెంబరులో జరిగిన ఎన్నికల్లో అధికారం తీసుకున్న ఎంఎఎస్–ఐపిఎస్‌పి (మూమెంట్ ఫర్ సోషలిజం) కి చెందిన కమ్యూనిస్టు ప్రభుత్వం నాలుగుసార్లు సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి పూర్తి మెజారిటీతో బొలీవియాను పరిపాలించింది. రాజకీయాలలో బహుళపార్టీ వ్యవస్థను ప్రోత్సహించింది. ఎవో మోరెల్స్ 2019లో పదవి నుండి వైదొలగిన తర్వాత మహిళా అధ్యక్షురాలు జీనిన్ అనెజ్ ఛావెజ్, ఆ తర్వాత లూయిస్ ఆర్స్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహించారు. 2025 ఎన్నికల్లో అధ్యక్ష పదవి అభ్యర్థిత్వం విషయంలో ఎవో మోరెల్స్‌కు, లూయిస్ ఆర్స్‌కు మధ్య తీవ్ర పోటీ ఏర్పడింది. తర్వాత మోరెల్స్ పోటీ నుండి తప్పుకున్నారు. కానీ ఆరోపణలకు గురైన ఆర్స్ ప్రజాభిమానం కోల్పోయి ఎన్నికల్లో ఓటమి చెందడంతో కమ్యూనిస్టుపాలన ముగిసింది.

## రాజ్యాంగ సవరణపై ఆందోళనకు ఇమ్రాన్‌ఖాన్ పార్టీ పిలుపు

**ఇస్లామాబాద్:** పాకిస్థాన్ చట్టసభలో శనివారం ప్రవేశపెట్టిన 27వ రాజ్యాంగ సవరణ, రాజ్యాంగంలోని 243వ నిబంధనకు సవరణలపై ప్రతిపక్ష నాయకుడు ఇమ్రాన్‌ఖాన్‌కు చెందిన పిటిఐపార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రధానంగా ఐదు అంశాలను తెరమీదకు తెచ్చి చర్చకు పెట్టింది. దేశవ్యాప్తంగా ఆందోళనకు అన్ని రాజకీయపార్టీలు సమాయత్తం కావాలని పిలుపు ఇచ్చింది. అదేవిధంగా ఇతర ప్రతిపక్షాలు కూడా ఆర్మీ జనరల్ ఆసిఫ్ మునీర్‌కు అపారమైన అధికారాలు కట్టబెట్టే ఆలోచనను తీవ్రంగా ఖండిస్తున్నాయి. దేశంలో ప్రజాస్వామ్యం ఇక అంతమైపోయే పరిస్థితి వచ్చిందని చట్టసభలో ఇమ్రామాన్‌ఖాన్ పార్టీకి చెందిన నాయకుడు, సెనేటర్ అలీ జాఫర్ విమర్శించారు. 1973 నాటి రాజ్యాంగంలోని మౌలిక స్ఫూర్తికి ప్రభుత్వం 27వ సవరణ ప్రతిపాదన ద్వారా తూట్లు పొడిచిందని విమర్శించారు. ఆదివారంనాడు అసాధారణ పద్ధతిలో సెనేట్ సమావేశం రెండోరోజు కూడా నిర్వహించారు. ఈ సమావేశంలో జాఫర్ మాట్లాడుతూ.. ఐదు ముఖ్యాంశాలను ప్రస్తావించారు. స్వయంప్రతిపత్తిగల రాష్ట్రాలతో కూడిన ఫెడరల్ పాకిస్థాన్, ప్రజలు ఎన్నుకున్న పార్లమెంటరీ వ్యవస్థ రెండింటినీ కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజల హక్కులకు హామీ ఇచ్చే స్వతంత్ర న్యాయవ్యవస్థను, ప్రజాస్వామ్యానికి న్యాయవ్యవస్థ ద్వారా లభించే హామీని, న్యాయ వ్యవస్థ స్వయంప్రతిపతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ విషయాల్లో ప్రభుత్వం రాజ్యాంగ సవరణల ద్వారా తప్పు చేస్తే యావత్ ప్రజాస్వామ్య సౌధం కుప్పకూలిపోతుందని ఆయన హెచ్చరించారు.

## డెవలప్‌మెంటా?

(మొదటి పేజీ తరువాయి)

జర్నలిస్ట్ రవికాంత్ రెడ్డి మీడియేటర్‌గా వ్యవహరించారు. మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పారు. కంటోన్మెంట్ జిహెచ్‌ఎంసిలో విలీనం అయ్యే ప్రక్రియ కొనసాగుతుందని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కంటోన్మెంట్‌లో తాగునీటి సమస్య పరిష్కారించామని చెప్పారు. ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణం ప్రారంభమైందన్నారు.

**జూబ్లీహిల్స్ ఎన్నికలో కాంగ్రెస్ గెలుపు ఖాయం**

హైదరాబాద్‌ను అభివృద్ధి చేసే బాధ్యత తమపై ఉందన్నారు. జూబ్లీహిల్స్ గెలవాల్సిందే, అభివృద్ధి జరగాల్సిందేనని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని సిఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం కాంగ్రెస్‌నే కృషి చేస్తుందని, జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ముగ్గురు మంత్రులను ఇన్‌చార్జ్‌లుగా నియమించి, రూ.500 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. బిజెపికి డిపాజిట్ గల్లంతవుతుంది, కిషన్ రెడ్డి దోస్తు ఓడిపోవడం ఖాయమన్నారు.

**బిఆర్‌ఎస్ కూలిపోతుంటే మౌనంగా కుమిలిపోతున్న కెసిఆర్**

జూబ్లీహిల్స్‌లో గెలిపించాలని కెసిఆర్ ఇప్పటివరకు విజ్ఞప్తి ఎందుకు చేయలేదని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తన కళ్లముందే బిఆర్‌ఎస్ కూలిపోతుంటే కెసిఆర్ మౌనంగా కుమిలిపోతున్నారని అన్నారు. కెసిఆర్ రాజకీయంగా ముగిసిపోయారన్నారు. కెసిఆర్ బిఆర్‌ఎస్ పని అయిపోయిందని ఎద్దేవా చేశారు. బిఆర్‌ఎస్ ఆత్మహత్య చేసుకుని బిజెపికి అవయవదానం చేసిందన్నారు. కెసిఆర్‌కు గతం ఉంది, భవిష్యత్ లేదన్నారు. కెసిఆర్‌ను ప్రత్యర్థిగా కాకుండా తాము ఇప్పుడు బాధితునిగా చూస్తున్నామని వ్యాఖ్యానించారు. కెటిఆర్ తన భాష, అలవాట్లు మార్చుకోవాలన్నారు. జూబ్లీహిల్స్‌లో ఎంత మెజారిటీతో గెలుస్తామో చెప్పలేమన్నారు. జూబ్లీహిల్స్‌లో బిజెపి డిపాజిట్ కోల్పోవడం ఖాయమన్నారు. బిజెపి, బిఆర్‌ఎస్ విలీనాన్ని తాను అడ్డుకున్నానని కవితే చెప్పారు కదా నని రేవంత్ గుర్తుచేశారు. ఎన్నికల విషయంలో తనది లీడర్ మైండ్ కాదని, క్యాడర్ మైండ్ సెట్ అన్నారు.

**కెసిఆర్ – అప్పులు, అవినీతి, అహంకారం..**

బిఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ వెనకబడిపోయిందని సిఎం తీవ్ర విమర్శలు గుప్పించారు. 60 వేల కోట్ల మిగులుతో రాష్ట్రాన్ని అప్పగించగా, 8 లక్షల కోట్ల అప్పుతో దివాళా స్థితికి నెట్టేశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు 1.87 లక్షల కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ఎకరాకు నీరు ఇవ్వలేకపోయారు. పాఠశాలలు మూసేశారు, ఆసుపత్రులు కట్టలేదు, పథకాలు పూర్తి కాలేదు అని మండిపడ్డారు. రైతులను అప్పుల్లో ముంచేశారు అని ఆరోపించారు. ప్రగతి భవన్, కమాండ్ కంట్రోల్, సచివాలయం, కాంక్రీట్ షోలు మాత్రమే, ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదు అని విమర్శించారు.

**గల్లీ గల్లీలో గంజాయి కల్చర్ తీసుకొచ్చింది ఎవరో ఆలోచించాలి..**

ఎవరిది అగ్రికల్చర్, ఎవరిది డ్రగ్స్ కల్చరో ప్రజలు ఆలోచించుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. గల్లీ గల్లీలో గంజాయి కల్చర్ తీసుకొచ్చింది ఎవరో ఆలోచించాలని కోరారు. ఉపఎన్నికల్లో పోటీ పెట్టే విషసంస్కృతిని తీసుకొచ్చిందే కెసిఆర్ అని విమర్శించారు. గతంలో పిజెఆర్ చనిపోయినప్పుడు కెసిఆర్ అభ్యర్థిని నిలబెట్టి ఎన్నికలు తెచ్చారని అన్నారు. రాంరెడ్డి వెంకటరెడ్డి విషయంలోనూ కెసిఆర్ అదే విష సంస్కృతి తెచ్చారని విమర్శించారు. మాగంటి గోపీనాథ్ తనకు మిత్రుడే, కానీ నియోజకవర్గం అభివృద్ధి జరగాలి కదా అని అన్నారు. ఫేక్ సర్వేలకు మీడియా దయచేసి ప్రాధాన్యం ఇవ్వొద్దని సిఎం కోరారు.

**నష్టపోయిన ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సోనియా గాంధీ..**

తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని ఇచ్చిన మాటను సోనియా గాంధీ నెరవేర్చిందని, అందుకే కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా నష్టపోయినా వెనక్కి తగ్గలేదని సిఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. 1994–2004 మధ్య టిడిపి, 2004–2014 మధ్య కాంగ్రెస్ పాలించాయని, అలాగే 2014–2023 మధ్య బిఆర్‌ఎస్ పాలించిందని తెలిపారు. ఇప్పుడు 2023 నుంచి పదేళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని సిఎం స్పష్టం చేశారు.

**కాంగ్రెస్ పాలనలోనే రైతుకు వెలుగు**

2004లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉచిత విద్యుత్, రుణమాఫీతో రైతులకు ఊరట కల్పించారని, మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం 73 వేల కోట్ల రుణ మాఫీ అమలు చేసిందని అన్నారు. జలయజ్ఞం ద్వారా సాగునీటి ప్రాజెక్టులు ప్రారంభించి, కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, ఆర్‌డిఎస్, ప్రాణహితచేవెళ్ల వంటి ప్రాజెక్టులు కాంగ్రెస్ చేతిలోనే మొదలయ్యాయని తెలిపారు.

**హైదరాబాద్ ఐటి, నాలెడ్జ్ సిటీగా మారింది కాంగ్రెస్ వల్లే..**

హైదరాబాద్ గ్రోత్ కారిడార్‌గా మారడం వెనుక కాంగ్రెస్ కృషి ఉందన్నారు. తెలంగాణ ఆదాయంలో 65 శాతం నగరం నుంచే వస్తోందన్నారు. హైదరాబాద్‌లో ఐటి రంగానికి పునాది కాంగ్రెస్ పాలనలో పడిందని, జైపాల్ రెడ్డి కృషితోనే నగరానికి మెట్రో వచ్చినదని సిఎం గుర్తు చేశారు. దేశంలో ఉత్పత్తి అయ్యే బల్క్ డ్రగ్స్‌లో 40 శాతం హైదరాబాద్ నుంచే వస్తున్నాయని, ఇటీవల ఎలీ లిల్లీ కంపెనీ 1 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతోందని వివరించారు.

**మా ప్రభుత్వంలో సంక్షేమం –అభివృద్ధి సమపాళ్లలో..**

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సబ్సిడీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంపు, రేషన్ కార్డుల పంపిణీ వంటి పథకాలు అమలవుతున్నాయని చెప్పారు. హైదరాబాద్‌లో గోదావరి జలాలు తేవడంపై ప్రణాళికలు సిద్ధం చేశామని, నగర అభివృద్ధికి రూ.500 కోట్లు కేటాయించామని తెలిపారు.

## భవనాలతో ఉద్యోగాలు వస్తాయా?

### పిచ్చిగా మాట్లాడుతున్న రేవంత్ : మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కెసిఆర్ నిర్మించిన భవనాలతో ఉద్యోగాలు వచ్చాయా అని సిఎం రేవంత్ రెడ్డి పిచ్చిగా మాట్లాడుతన్నారని, భవనాలు నిర్మిస్తే ఉద్యోగాలు వస్తాయా? అని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి జి.జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. కెసిఆర్, కెటిఆర్ వల్లనే హైదరాబాద్ ఇమేజ్ పెరిగిందని, ఈ రెండేళ్లలో హైదరాబాద్‌కు ఐదు పైసలైనా సిఎం రేవంత్ రెడ్డి ఇచ్చారా? అని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2004–14 సంవత్సర పాలన దేనికి స్వర్ణయుగమని, స్మశానాలకు స్వర్గ యుగం కాదా అని అన్నారు. ఆ సమయంలో పారిశ్రామిక వేత్తలు విద్యుత్ కోసం ధర్నా చేస్తే, ఆ ధర్నాలో రేవంత్ రెడ్డి మాట్లాడలేదా అని అన్నారు. కెసిఆర్ సిఎం అయ్యే నాటికే తెలంగాణ రాష్ట్ర మిగులు బడ్జెట్ రూ.300 కోట్లు అని, కెసిఆర్ దిగిపోయే నాటికి రూ.5 వేల కోట్లు మిగులు బడ్జెట్ తో రాష్ట్రాన్ని కాంగ్రెస్‌కు అప్పగించామని వివరించారు. మానసిక రోగికి మించిన రోగి రేవంత్ రెడ్డి అని, అసలు రేవంత్ రోగం ఏందో అంతు పట్టడం లేదని ఎద్దేవా చేశారు. కవిత ,మాగంటి తల్లి గురించి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని, సిఎం సొంత అన్న కూతురి పెళ్ళికి రేవంత్ భార్య, కుటుంబ సభ్యులు ఎందుకు పోలేదని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ పని అయిపోయిందనడం రేవంత్ మూర్ఖత్వమన్నారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సి కోటి రెడ్డి, మాజీ ఎంఎల్‌ఏలు రవీంద్ర కుమార్, చిరుమర్తి లింగయ్య ,బూడిద భిక్షమయ్య గౌడ్ ,కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ,పైళ్ల శేఖర్ రెడ్డి ,నాయకులు రామచంద్ర నాయక్ ,పల్లె రవి కుమార్ తుంగ బాలు పాల్గొన్నారు.

## వందేళ్ల చరిత్ర ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

సబ్బండ వర్గాల పక్షాన చేసిన పోరాటాలు కేవలం సిపిఐ పార్టీకే సొంతమని పల్లా వెంకట రెడ్డి అన్నారు. దేశంలో సుద్దాల హనుమంతు, బండి యాదగిరి వంటి కవులు, కళాకారుల తమ చైతన్య గీతాల ద్వారా సిపిఐ అనుబంధ సంఘాలైన ప్రజా నాట్య మండలి,అరసం ప్రజలను చైతన్యవంతులను చేసిందని, ఇలాంటి ఎంతో మంది గొప్ప నాయకులను, కళాకారులను తయారు చేసిన సంస్థ ప్రజానాట్య మండలి అని అన్నారు. ఒక గొప్ప బహిరంగ సభ పెట్టాలంటే నాయకులకంటే కళాకారుల పాత్రనే అతి ముఖ్యమని, మహాసభలను విజయవంతం చేయడానికి ప్రజానాట్య మండలి కృషి చేయాలని కోరారు. సిపిఐ 'వందేళ్ల చరిత్ర' ను తెలియజేసేందుకు ఆదిలాబాద్ జోడె ఘాట్, నిర్మల్ బాసర, గద్వాల నుండి ఇలా మూడు జాతలను నిర్వహిస్తుందన్నారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ 'సిపిఐ వందేళ్ల పండగను అంగరంగా వైభవంగా నిర్వహించేలా ప్రతి కార్మికుడు, కర్షకులు, విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, అందరిని కలిపే అభ్యుదయ గీతాలాపన చేయాలన్నారు. ప్రజల లో మార్పు, చైతన్యం దిశగా పాటలు ముందుకు నడవాలని సూచించారు. గతంలో, సాయుధ పోరాటం, పోరుబాట, సామాజిక తెలంగాణ, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో ప్రజానాట్య మండలి పాత్ర అమోఘమన్నారు. రాజ్యాంగ హక్కులపైన, సామాజిక న్యాయం కోసం విద్యా,పేదరిక నిర్మూలన, కార్మికులు, రైతు, బీడీ కార్మికుల సమస్యలు, భూపోరటాల పట్ల నూతన ఉత్సాహాన్ని నింపే విధంగా, ప్రజలను ఆకట్టుకునే రీతిలో వీధీ నాటకాలను, పాటలను రూపొందించాలని చాడ కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, ప్రజా నాట్య మండలి ఇన్‌చార్జ్ కలవేని శంకర్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగిన శిక్షణా తరగతులు ప్రజలను పోరాట దిశగా నడిపించాలన్నారు. కళా జాత లో కళాకారులే ప్రాముఖ్యమని, దేశంలో అన్ని సమస్యలపైన ఉపన్యాసాలకంటే పాటానే ప్రజలను కదిలిస్తుందని, ఆ దిశలో ప్రజా నాట్య మండలి ఉండాలని కోరారు. ముగింపు సభలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి నరసింహ, తెలంగాణ ప్రజా నాట్యమండలి ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ,అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు ఉప్పలయ్య, లక్ష్మీ నారాయణ, దామెర కృష్ణ, నళిని, రవి, జగన్, చంద్రశేఖర్, సైదులు, రాములు, దుద్దేల సమ్మయ్య, కూన సుధాకర్, కాటూరి రాము, సతీష్ నాగేశ్వర్ రావు, ప్రవీణ్ చారి, రాజేశ్వర్ రావు, వట్టేపాక రవి పాల్గొన్నారు.

## మాటల యుద్ధం (మొదటి పేజీ తరువాయి)

బలహీనంగా ఉన్న, పార్టీ ప్రధాన వ్యూహకర్త దృష్టిలో ఉన్న ససారాం, అర్వాల్‌లలో ర్యాలీలను ప్రసంగించారు. బిజెపి మాజీ అధ్యక్షుడైన రాజ్‌నాథ్ సింగ్, తన సొంత రాష్ట్రం ఉత్తరప్రదేశ్ సరిహద్దులోని ఔరంగాబాద్, కైమూర్ జిల్లాల్లో ర్యాలీలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా తొలిసారి బిహార్‌లో ప్రచారం చేశారు. ఆమె 10 ర్యాలీలు, ఒక రోడ్ షోతో చాలా ఉధృతంగా ప్రచారం నిర్వహించారు. అయితే ప్రతికూల వాతావరణం కారణంగా ఆమె హెలికాప్టర్ ఎక్కలేకపోయినందున ఒక చోట ప్రచారాన్ని రద్దు చేయవలసి వచ్చింది. బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా, కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, శివరాజ్ సింగ్ చౌహాన్, యుపి, అసోం, ఎంపి సిఎంలు యోగి ఆదిత్యనాథ్, హిమంత బిశ్వ శర్మ, మోహన్ యాదవ్ వంటి ప్రాంతీయ నాయకులు పాల్గొన్నారు. ఐదోసారి పదవీకాలం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న జెడి(యు) అధినేత, సిఎం నితీష్ కుమార్ నిశ్శబ్దంగా కానీ దృఢనిశ్చయంతో ప్రచారం చేయడం పెద్దగా వెలుగులోకి రాలేదు. దీంతో ఆయన ఆరోగ్యంపై పలు ఊహాగానాలకు దారితీస్తున్నాయి. మాజీ డిప్యూటీ ప్రస్తుత ప్రత్యర్థి తేజస్వి యాదవ్ కూడా ఉత్సాహభరితమైన ప్రచారానికి నాయకత్వం వహించారు. ఆయనను సిఎం అభ్యర్థిగా ప్రకటించిన ఇండియా కూటమి తనపై చూపిన విశ్వాసంతో ఆయన అన్ని విధాలా ఉత్సాహంగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో 'ఎక్స్ ఫ్యాక్టర్'గా పరిగణించబడే జన్ సురాజ్ పార్టీ ప్రచారం అంతా దాని వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ గురించే. దేశవ్యాప్తంగా రాజకీయ ప్రముఖుల అనేక అద్భుతమైన ప్రచారాలను నిర్వహించిన ప్రశాంత్ కిషోర్, తన సొంత రాష్ట్రంలో ఇంటింటికీ తిరిగి సాంప్రదాయిక ప్రచార శైలితో శ్రమించాలని ఎంచుకున్నాడు.

## హోరాహోరీ ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రచారంలోకి దిగారు. వరుసగా రోడ్ షోలు, కార్నర్ మీటింగ్స్‌లో పాల్గొన్నారు. మంత్రులు కూడా ప్రచారంలో భాగస్వాములయ్యారు. వారిలో 13 మందికి నియోజకవర్గంలోని ఒక్కో డివిజన్ బాధ్యతలు అప్పగించగా, ప్రభుత్వ సంక్షేమ పథకాలైన మహాలక్ష్మి, గృహలక్ష్మి వంటి ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లారు. కాంగ్రెస్ ప్రధానంగా మహిళలు, మైనారిటీలు, బిసిలు, యువత ఓట్లపై ఆశలు పెట్టుకుంది. బిసి నాయకుడైన నవీన్ యాదవ్‌ను గెలిపించుకోవడం ద్వారా బిసి వర్గాలలో పట్టు సాధించాలని కాంగ్రెస్ భావిస్తుంది. బిఆర్‌ఎస్, బిజెపిలు కూడా చివరి రోజు జోరుగా ప్రచారం నిర్వహించాయి.



## మురికివాడల అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ నాయకులు హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేయకుండా గాలికి వదిలేశారని ఆరోపించారు. అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం, డబుల్ బెడ్ రూమ్, దళితులకు మూడు ఎకరాలు వంటి గొప్ప గొప్ప కార్యక్రమాలు చేపడతామని బిఆర్‌ఎస్ అనేక భ్రమలను కల్పించిందని మండిపడ్డారు. పదేళ్ల కాలంలో ఆ పార్టీ ఏ ఒక్క హామీని పూర్తి చేయలేదని ఆరోపించారు. అధికారం కోల్పోయి బిఆర్‌ఎస్ నాయకులకు మతిభ్రమించి అవాకులు చవాకులు పేలుతున్నారన్నారు. పేద, మధ్యతరగతి వర్గాలకు మేలు జరగకుండా బిఆర్‌ఎస్ నాయకులు కుట్రలకు పాల్పడుతున్నారని, పదేళ్ల మంత్రిగా పనిచేసిన హరీష్ రావు కూడా బ్యాలెన్స్ కోల్పోయి మాట్లాడుతున్నారన్నారు. ఢిల్లీలో తనకు ఇల్లు ఉందో లేదో అందరికీ తెలుసని, ఐటి రైడ్స్ అధికారికంగా జరుగుతాయనేది అందరికీ తెలిసే జరుగుతాయన్న విషయం హరీశ్‌కు తెలియదా అని ఎద్దేవా చేశారు. కేవలం రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలకు కాంగ్రె స్ ప్రభుత్వం ఏడాదికి లక్ష కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేస్తుందని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం, 96 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేశామని తెలిపారు. బిఆర్‌ఎస్ నాయకులు పదేళ్ల కాలంలో ఇవ్వని రేషన్ కార్డులను కేవలం రెండు సంవత్సరాల కాలంలోనే తమ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో ఉన్న పేద బిడ్డల కోసం ఇంటర్‌నేషనల్ స్టాండర్డ్స్‌తో ఉచితంగా చదువుకునేందుకు యంగ్ ఇండియా ఇంటర్‌నేషనల్ స్కూల్స్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. డ్వాక్రా సంఘాలకు వడ్డీలేని రుణాలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని తాము తిరిగి ప్రారంభించామని, కానీ గత ప్రభుత్వం మహిళా సంక్షేమాన్ని విస్మరించిందని మండిపడ్డారు.

**జూబ్లీహిల్స్‌లో 15 వేల మంది స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే 15 వేల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలను పంపిణీ చేశామని, ఓవర్సీస్ స్కాలర్‌షిప్, ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు 40 శాతం డైట్ చార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు 200 శాతం పెంచామని, పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని రూ 10 లక్షలకు పెంచామని, రూ 5 లక్షలతో ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నామని భట్టి వివరించారు. రాష్ట్రంలో మొదటి దశలో 4.5 లక్షల ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చి శరవేగంగా నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో కనీసం గ్రూప్ 1 పరీక్షలను కూడా నిర్వహించలేకపోయిందని, కానీ తమ ప్రభుత్వం రెండు సంవత్సరాల లోపే విజయవంతంగా గ్రూప్ 1 పరీక్షను నిర్వహించామని, పైగా అడ్డంకులను అధిగమించి నియామక పత్రాలను కూడా అందజేశామని తెలిపారు. రెండేళ్ల కాలంలోనే గ్రూప్ 2 పరీక్షలు నిర్వహించి నియామక పత్రాలు కూడా అందించామన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS



మెడ్‌హోప్ చిల్డ్రన్-జనరల్ క్లినిక్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నల్లకుంటలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి అజీజ్‌పాషా, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జాతీయ నాయకురాలు పశ్యపద్మతో పాటు పలువురు నేతలు, డాక్టర్లు పాల్గొన్నారు.

## ఎర్రజెండా పార్టీలన్నీ ఒకే వేదికపైకి రావాలి

డిసెంబర్ 26న సిపిఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** నవంబర్ 20, 21న మహబూబాబాద్ జిల్లాలో బస్సు జాతాను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఐ మహబూబాద్ జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశం స్థానిక వీరభవన్‌లో పెరుగు కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఖమ్మంలో డిసెంబర్ 26న సిపిఐ 100 ఏళ్ల పండుగ సిపిఐ శతాబ్ది ఉత్సవాల సభ ఘనంగా 5లక్షల మందితో ఖమ్మం జిల్లా కేంద్రంలో డిసెంబర్ 26న పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని, ఈ శతాబ్ది సభకు 40 దేశాల నుండి ప్రతినిధులు హాజరవుతున్నారన్నారని, డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది సభ జయప్రదానికై మూడు బస్సు జాతాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రచారంలో పాల్గొంటున్నాయని, మహబూబాబాద్ జిల్లాలో ఈ జాత నవంబర్ 21న గూడూరు మండలంలోకి ప్రవేశిస్తుందని, సాయంత్రం మానుకోటలో భారీ ఎత్తున ప్రదర్శనతో సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం 22న గార్ల మండలంలో ప్రచారంలో పాల్గొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రవేశిస్తుందని తెలిపారు. ఈ దేశంలో సమ సమాజ నిర్మాణం కోసం గత వందేళ్ళుగా సిపిఐ పోరాడుతూనేన్నారు. దేశంలో ఒక్క సిపిఐకి మాత్రమే వందేళ్ల చరిత్ర ఉందని ఆయన తెలిపారు.

**దేశంలో కమ్యూనిస్టు పార్టీలు ఒకే పార్టీగా కలిసి రావాలి**

సిపిఐ వంద సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా భారతదేశంలో కూడా అన్ని వామపక్ష ఎర్రజండా పార్టీలు అన్నీ కలిసి ఒక వేదికపైకి వచ్చి ఒక్కపార్టీగా రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నేపాల్‌లోని 10కమ్యూనిస్టుపార్టీలు అన్నీ కలిసి ఒక్కటైన ఒక జండా క్రిందకి వచ్చిన నేపథ్యంలో మన దేశంలో కూడా కలిసి రావాలని ఆయన కోరారు. ఈ దేశంలో మతోన్మాదం పెరిగిపోతోందంటే, పెట్టుబడి వర్గాలు ఈ దేశంలో దోపిడి చేస్తున్నాయంటే కమ్యూనిస్టులు బలంగా లేకపోవడం, కమ్యూనిస్టులు చీలిపోవడంతో శక్తి లేదనే అభిప్రాయంతోనే దేశంలో మతోన్మాదం పేట్రేగిపోతోందన్నారు. మావోయిస్టులు కూడా కొంతమంది బయటకు వచ్చారని, మరికొంత మంది సాయుధ పోరాటంలోనే ఉన్నారని, ఈ దేశంలో పెరిగిన టెక్నాలజీకి, మారిన పరిస్థితులకు అనుగుణంగా మనం కూడా మారాలని, సాయుధ పోరాటం వదిలేయాలని, మావోయిస్టులు కూడా కలిసి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీపై ప్రజలు అశలు పెట్టుకున్నారని, ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని ఆయన కాంగ్రెస్ పార్టీని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి అజయ్ సారధి రెడ్డి, నల్లు సుధాకర్ రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, దేశ పల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబ లక్ష్మి పాల్గొన్నారు.

## బ్యాంకింగ్ రంగంలో రామరాజుది కీలకపాత్ర

సంస్మరణ సభలో కొనియాడిన పలువురు వక్తలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు,అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూరి రామరాజు శాంతి సంఘంలో చురుకైన పాత్రను పోషించారని, బ్యాంక్ ఉద్యోగుల సమస్య పరిష్కారానికి కృషి చేశారని పలువురు కొనియాడారు. ఆయన లేని లోటు తీర్చనిదని, రామరాజు కుటంబ సభ్యులకు సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. ఐప్సో ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఆర్‌టిసి కల్యాణ మండపంలో ఆదివారం 'అమర్లపూరి రామరాజు' సంస్మారణ సభ జరిగింది. ఈ సభకు ఐప్సో సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు అమర్లపూరి రామరాజు చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ బ్యాంక్ రంగంలో రామరాజు క్రియాశీలక పాత్రను పోషించారన్నారు. ఐప్సో, కమ్యూనిస్టు కార్యక్రమాలలో ఆయన చురుగ్గా పాల్గొనేవారని గుర్తు చేశారు. ఒక మంచి మనసు ఉన్న కార్యకర్తను కోల్పోయామన్నారు.

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ మాట్లాడుతూ రామరాజు మరణం బాధాకరమన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రామరాజు అందరితో కలిసిమెలిసి ఉండేవారని, స్నేహశీలి అని అన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఆదర్శ వివాహానికి రామారాజు మార్గదర్శకులన్నారు. ఆయన ఆకస్మిక మరణం బాధకరమన్నారు.

సిపిఐ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ రామారాజు మరణం ప్రజా సంఘాలకు తీరని నష్టమన్నారు. ఐప్సో రాష్ట్ర అధ్యక్షుడు, ఐఎఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూతూ రామారాజు మరణం తీరని లోటు అని అన్నారు. ఐప్సో నాయకులు యాదవరెడ్డి మాట్లాడుతూ శాంతి సంఘాన్ని రామారాజు చురుగ్గా నడిపించారన్నారు. ఎఐబిఇఎ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు మాట్లాడుతూ రిటైర్డ్ అయిన తర్వాత కూడా రామారాజు బ్యాంక్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పనిచేశారన్నారు. ఐప్సో నాయకులు, టిపిసిసి ఉపాధ్యక్షుడు ఎం.ఆర్.వినోద్ రెడ్డి మాట్లాడుతూ రామారాజు మరణం దురదృష్టకరమన్నారు.

సినీ నటులు ప్రీతంనిగమ్, నగేష్, హైకోర్ట్ న్యాయవాది దామోదరరెడ్డి, ఐప్సో నాయకులు డాక్టర్ డి.సుధాకర్, జిహెచ్ఎంసి జాయింట్ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, ఐప్సో నాయకులు నాగేశ్వర్, బొమ్మగాని నాభూషణం, సి.ఆర్.ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవరావు తదితరులు రామారాజు చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. సంస్మరణసభలో రామారాజు తల్లి అనసూయ, రామారాజు భార్య రాధారాణి, కుమారులు ఉత్తమ్ రాజ్, ఉదయ్‌రాజ్ తదితర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## టెలివిజన్ కార్మికులకు అండగా ఉంటాం

మంత్రి శ్రీధర్ బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టెలివిజన్ కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామని, సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. బేగంపేట్‌లోని హరిత ప్లాజా హోటల్ లో ఆదివారం 'తెలంగాణ టెలివిజన్ డెవలప్‌మెంట్ ఫోరం' ఆధ్వర్యంలో నిర్వహించిన 'కార్తీక మాస ఆత్మీయ సమ్మేళనం'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు 'ఎంటర్‌టైన్‌మెంట్ రంగం' కీలక చోదక శక్తిగా మారిందని, ప్రేక్షకులకు నిరంతరం వినోదాన్ని అందించేందుకు టెలివిజన్ కార్మికులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ రంగంలో పనిచేసే ప్రతి ఒక్కరూ సమయం, సందర్భం లేకుండా ఎంతో కష్టపడతారని, వారి త్యాగం వెలకట్టలేనిదని కొనియాడారు. రాష్ట్రంలో టెలివిజన్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, ముఖ్యంగా కార్మికుల ఆర్థిక, సామాజిక భద్రతా సమస్యలపై తమ ప్రభుత్వానికి పూర్తి అవగాహన ఉందన్నారు. ఈ విషయంలో ఎలాంటి ఆందోళనకు గురికావొద్దని, వారి పట్ల సిఎం రేవంత్ రెడ్డి అత్యంత సానుకూలంగా ఉన్నారని వివరించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నాయకత్వంలో త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ సంఘం ప్రతినిధులు సురేష్, కవిత తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిపక్షాలకు భంగపాటు తప్పదు

మా వైపే జూబ్లీహిల్స్ ఓటర్లు : మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రతిపక్షాలకు భంగపాటు తప్పదని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పోయే అందరీ పార్టీ కాంగ్రెస్ వైపే నియోజకవర్గ ఓటర్లంతా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం సోమాజిగూడ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలు, బస్తీల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా ఆయన ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. అపార్ట్ మెంట్లు, గ్రేటెడ్ కమ్యూనిటీల అసోసియేషన్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. హైదరాబాద్ మహా నగరాభివృద్ధికి గత కాంగ్రెస్ ప్రభుత్వాలు తీసుకున్న చర్యలు, చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టుల గురించి ఓటర్లకు వివరించారు. నగరాభివృద్ధికి, స్థానిక సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన భవిష్యత్తు కార్యాచరణపై సలహాలు సూచనలు స్వీకరించారు. తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ పాలకులు నగరాన్ని గాలికొదిలేశారని విమర్శించారు. కొన్ని ప్రాంతాల్లో ఫ్లైఓవర్లు, అండర్ పాస్ లను నిర్మించి మొత్తం నగరాన్ని అభివృద్ధి చేశామంటూ గొప్పలు చెప్పుకున్నారన్నారు. కానీ... క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి వేరని, ఇప్పటికీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని చాలా కాలనీలు, బస్తీల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు లేవన్నారు. రెండేళ్లలో ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారన్నారు. అయినా... తమ ఉనికిని కాపాడుకునేందుకు బిఆర్ఎస్,బిజెపి బురద జల్లే రాజకీయాలకు పాల్పడుతున్నాయన్నారు. పదే పదే మా ప్రభుత్వంపై అవాస్తవాలను ప్రచారం చేస్తూ ఈ ఉప ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. నగరంలో ప్రజా రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడేలా నిపుణుల మార్గనిర్దేశనంలో పకడ్బందీ ప్రణాళికలను రూపొందిస్తున్నామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని పునరుద్ఘాటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించే చిత్తశుద్ధి కాంగ్రెస్ అభ్యర్థికి మాత్రమే ఉందన్నారు. పది మందికి మంచి చేయాలనుకునే నవీన్ యాదవ్ గెలిస్తే ఈ నియోజవర్గానికి మంచి జరుగుతుందన్నారు. బిఆర్ఎస్, బిజెపి నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని జూబ్లీహిల్స్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సంక్షేమం, అభివృద్ధి అజెండాగా ముందుకు సాగుతున్న ఈ ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్, ఇతర కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## నవీన్ యాదవ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నికల ప్రచార చివరి రోజున నియోజకవర్గంలోని ఏడు డివిజన్లలో మంత్రులతో కలిసి డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క ఆదివారం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మంత్రి జూపల్లి కృష్ణారావుతో ఎర్రగడ్డ డివిజన్‌లోని మోతీ నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.అనంతరం స్థానిక డివిజన్‌లో పరిస్థితిపైన మంత్రి జూపల్లితో భట్టి ప్రత్యేకంగా సమావేశమై, సమన్వయం చేశారు. ఆ తర్వాత మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి భట్టి యూసఫ్‌గూడ డివిజన్‌లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం స్థానిక పరిస్థితులపైన పొన్నంతో పాటు కాంగ్రెస్ నాయకులతో భట్టి సమావేశమయ్యారు.ఆ తర్వాత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,వాకిటి శ్రీహరితో వెంగళరావు డివిజన్‌లో సమావేశమయ్యారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి రహమత్ నగర్ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రి దనసరి అనసూయ సీతక్కతో కలిసి బోరబండ డివిజన్‌లో భట్టి సమీక్ష నిర్వహించారు. అనంతరం టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి భట్టి విక్రమార్క మీడియా సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత యూసఫ్ గూడలోని కాంగ్రెస్ కార్యాలయంలో అందుబాటులో ఉన్న మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో భట్టి విక్రమార్క ప్రత్యేకంగా సమావేశమై, ఎన్నికల ప్రచార పర్వం, తాజా పరిస్థితిని సమీక్షించారు. అందరూ కష్టపడి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని సూచించారు. ఉప ఎన్నిక రోజు తప్పని సరిగా ప్రతి ఓటరు.. తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు

## బిజెపితో కుమ్మక్కైన బిఆర్ఎస్‌ను ఓడిద్దాం

నవీన్ గెలుపునకు అందరం ఒకటై కృషి చేద్దాం

సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో బాగంగా సిపిఐ శ్రేణులు ఆదివారం వెంగళరావు నగర్ , యూసుఫ్ గూడ , లో కూటమి పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కొరకు సిపిఐ ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ తిరిగి పంచటం జరిగింది. నవీన్ యాదవ్ గెలుపు లక్ష్యంగా ముందుకు సాగారు. ప్రచారం నిర్వహిస్తున్న క్రమంలో పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్ ల వద్ద ఇటి నరసింహ మాట్లాడారు.ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని. ఈ సారి నవీన్ యాదవ్ ను తప్పకుండా గెలిపించుకుంటామని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీలైన బిజెపి,బిఆర్ఎస్ కుట్రలను తిప్పి కొడుతున్నారు. బిఆర్ఎస్, బిజెపితో కుమ్మక్కై ప్రభుత్వాన్ని అస్థిర పరిచే చర్యలను స్వస్తి పలకాలంటే ఈ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నీ గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజల పైన ఉందని తెలిపారు. మతోన్మాద వ్యాఖ్యలు చేస్తున్న బండి సంజయ్ కి జూబ్లీహిల్స్ ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు విఎస్ బోస్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అభివృద్ధి గురించి కానీ, గత 11 సంవత్సరాలుగా మోడీ చేసిన పాలన గురించి మాట్లాడకుండా ప్రజల మధ్యల మత విద్వేషాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలనుకుంటున్నబీజేపీ దివాలు కోరుతనాన్ని తిప్పి కొట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ ఛాయా దేవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్,జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆరుట్ల రాజ్ కుమార్, బాలకృష్ణ, మహమూద్,ఇమ్రాన్,చైతన్య,అనిల్,దశరథం, ఉప్పల ఉదయ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## కోటగుళ్ళ సందర్శన కొత్త అనుభూతిని మిగిల్చింది

సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారుల బృందం



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** కాకతీయులు నిర్మించిన కోటగుళ్ళ సందర్శన కొత్త అనుభూతిని మిగిల్చిందని సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారులు తెలిపారు. భూపాలపల్లి జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారుల బృందం 12 మంది అనురాగ్ రంజన్, వటాస్ రాజ్, కృష్ణ ఝా విపశయన తన్వర్ కృష్ణ, సి.విశేష్ సింగ్, తుషార్ సింగ్, ఆదిత్య సింగ్, మయాంక్ ఖండేల్వాల్, మణిమాల ఎన్.విశాల్ సింగ్, పవార్ అక్షయ్ విలాస్, రితికా రాత్ కోటగుళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు, పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో సాంప్రదాయబద్ధంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు నాగరాజు, శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. వారి వెంట గణపురం ఎస్ఐ రేఖ అశోక్, మహా ముత్తారం డీటీ సందీప్, గణపురం ఆర్ఐ చెక్క దేవేందర్, గుడాల తిరుపతి రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాగంటి గోపీనాథ్ మృతిపై అనుమానాలు

మీడియాతో ఆయన తల్లి మహానంద కుమారి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణం మిస్టరీగా అనిపిస్తున్నదని, తనకు అనేక అనుమానాలున్నాయని ఆయన తల్లి మహానంద కుమారి అన్నారు. ఆయన చనిపోయిన వార్త తల్లిగా తనకు తెలియదన్నారు. జూన్ 6న చనిపోయారా? 8న చనిపోయారా? అన్నది సందేహంగానే ఉన్నదన్నారు. ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాగంటి మొదటి భార్య మాలిని, ఆమె కుమారుడు తారక్‌తో కలిసి మహానంద కుమారి మీడియాతో మాట్లాడారు. కెటిఆర్ వచ్చిన తర్వాత గోపీనాథ్ మరణవార్తను బయటకు చెప్పారన్నారు. ''లీగల్ హెయిర్ సర్టిఫికెట్‌లో మొదటి భార్య, బిడ్డలు, నా పేరు కూడా లేదు. మొదటి భార్యతో విడాకులు కూడా కాలేదు. నేను గోపీనాథ్‌తో సునీత పెళ్లి చేయలేదు. ఫ్యామిలీ సర్టిఫికెట్‌లో మా పేరు లేదు. కేటీఆర్ వెంట పరుగెత్తి నాకు జరిగిన అన్యాయం గురించి చెప్పాలనుకొంటే ఆయన కూడా వినలేదు. ఇది డబ్బు సమస్య కాదు. మాకు గుర్తింపు లేదు. అందుకే మీడియా ముందుకొచ్చాం'' అంటూ ఆమె చెప్పారు. గోపీనాథ్ తల్లిగా కేటీఆర్ తనను కనీసం కలవలేదన్నారు. సునీతకు టికెట్ ఇచ్చేటప్పుడు కేటీఆర్ మాకు కనీసం సమాచారం కూడా ఇవ్వలేదని, తమకు ఏ పార్టీతో సంబంధం లేదు'' అని ఆమె స్పష్టంచేశారు. మాలినిని గోపీనాథ్ వద్దనుకొంటే ఎప్పుడో విడాకులు తీసుకునేవాడని, అలా జరగలేదన్నారు. తారక్ ప్రద్యుమ్న మాట్లాడుతూ తన పాస్‌పోర్ట్, ఇతర పత్రాల్లో తండ్రిగా గోపీనాథ్ పేరే ఉన్నదని, చట్ట పరంగా కూడా అన్ని సక్రమంగానే ఉన్నాయని తెలిపారు. తారక్ అంటే ఎవరో తెలియదన్న మాగంటి సునీత.. జూన్ 6న తనకు మొదటిసారి ఫోన్ చేశారని, ఎవరో తెలియకపోతే ఎందుకు ఫోన్ చేసినట్టు అని ఆయన ప్రశ్నించారు. మా అమ్మ, నాన్నమ్మ, నా పేర్లను లీగల్ హెయిర్ సర్టిఫికెట్‌లో పెట్టాలని ఆయన కోరారు.

## స్వీయ అవగాహనతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట

సైబర్ నేరాల నివారణకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమంలా ప్రచారం- డిజిపి శివధర్ రెడ్డి

సైబర్ సింబా వలంటీర్ లోగో ఆవిష్కరణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్వీయ అవగాహనతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయొచ్చని డిజిపి బి.శివధర్ రెడ్డి అన్నారు. గత పదేళ్లుగా సైబర్ నేరాల సంఖ్య క్రమేణా పెరుగుతుందని, వాటి నివారణకు తెలంగాణ వ్యాప్తంగా ఒక ఉద్యమంలాగా ప్రచారం నిర్వహించాలని నిర్ణయించామని ఆయన తెలిపారు. హైదరాబాద్ కవాడిగూడలోని జలవాయు విహార్ కమ్యూనిటీ హాల్‌లో ''జాగృత్ హైదరాబాద్ – సురక్షిత్ హైదరాబాద్'' నినాదంతో తలపెట్టిన సైబర్ క్రైమ్స్ అవగాహన కార్యక్రమాన్ని హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి సజ్జనర్‌తో కలిసి ఆదివారం డిజిపి బి. శివధర్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. సైబర్ సింబా లోగో, క్యూఆర్ కోడ్‌ను వారు ఆవిష్కరించి.. బ్యాడ్జీలను వలంటీర్లకు అందజేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో శివధర్ రెడ్డి మాట్లాడుతూ సైబర్ క్రైమ్స్ సాధారణ సమస్య కాదని.. ఒక తీవ్రమైన సామాజిక సమస్యగా మారిందని అన్నారు. ఫోన్ కాల్, సోషల్ మీడియా, ఆన్‌లైన్ ఇంటరాక్షన్‌తోనే నేరాలు చేస్తున్నారని, ఎవరు ధనవంతులు, ఏ లొకేషన్ లో ఎవరు ఉంటారు, వయస్సు వంటి వివరాలు అన్నీ తెలుసుకొని సులువుగా టార్గెట్ చేస్తున్నారని చెప్పారు. ఇంట్లో ఉన్న మహిళలు, వృద్ధులు, గృహిణులు ప్రధాన లక్ష్యంగా మారుతున్నారని, ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు ఫోన్లు చేసి భయపెట్టి మోసం చేస్తున్నారని వివరించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం సైబర్ బాధితులు తగ్గేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. నేరాల నివారణకు సైబర్ పెట్రోలింగ్ చేస్తున్నామని వివరించారు. సైబర్ నేరాలకు వ్యతిరేకంగా జరిగే కార్యక్రమంలో యువకులు, రిటైర్డ్ వ్యక్తులు, ప్రముఖులు అందరూ భాగం కావాలని, ఒకరు పది మందికి, పది మంది ఇరవై మందికి చెబితే ఇది ఒక పెద్ద ఉద్యమంలాగా మారుతుందని అన్నారు.

ప్రతి ఇంటిలోనూ కనీసం ఒకరు ఈ మోసాల గురించి అవగాహన కలిగిన ఒక సైబర్ సింబా ఉంటే.. సమాజంతా సురక్షితంగా ఉంటుందన్నారు. సజ్జనర్ మాట్లాడుతూ సైబర్ నేరాల బారిన పడి హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ప్రతి రోజు సగటున రూ.కోటి వరకు పోగొట్టుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆశ, భయాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్నారని ఆయన అన్నారు. సైబర్ మోసానికి గురైన వారు తక్షణమే 1930 కాల్ చేసి.. సమచారం ఇవ్వాలని, జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ www. cybercrime. gov.in ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నవారితో సైబర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో క్రైమ్స్ అదనపు పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాస్ ,ట్రాఫిక్ జాయింట్ సిపి డి. జోయల్ డేవిస్, సైబర్ క్రైమ్ డిసిపి ధార కవిత, మరియు అన్ని జోనల్ డిసిపిలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## బంగ్లాదేశ్‌లో బియ్యం నిల్వల కొరత

భారత్ నుండి 50 వేల టన్నులు కొనుగోలు

**ఢాకా:** భారత్ నుండి బంగ్లాదేశ్ 50,000 టన్నుల బియ్యం దిగుమతి చేసుకోనున్నది. బంగ్లాదేశ్ ప్రభుత్వం వద్ద బియ్యం నిల్వలు తరిగిపోవడంతో బాసుమతి యేతర బియ్యాన్ని దిగుమతి చేసుకోవాలని మహ్మద్ యూనుస్ నాయకత్వానగల తాత్కాలిక ప్రభుత్వం ఆదివారం నిర్ణయించింది. మధ్యప్రదేశ్‌లోని గురుడియో ఎక్స్‌పోర్ట్స్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా ఒక టన్నుకు 356.78 డాలర్లు చెల్లించి ఈ బియ్యాన్ని దిగుమతి చేసుకోవాలని తాత్కాలిక ప్రభుత్వ సలహా కమిటీ నిర్ణయించింది. ఈ దిగుమతులకు మొత్తం 217.68 కోట్ల టాకాలు చెల్లిస్తున్నట్లు బంగ్లాదేశ్ ఆహార మంత్రిత్వశాఖ ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే బంగ్లాదేశ్ 50,000 టన్నుల బియ్యాన్ని భారత్ నుండి దిగుమతి చేసుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో కూడా 835,000 టన్నుల బియ్యాన్ని దిగుమతి చేసుకుంది.

## బెట్టింగ్ వ్యసనంతో భవిష్యత్తు అంధకారం

'స్లేట్ స్మార్ట్ స్టార్ట్' 5కె రన్‌లో గుత్తా అమిత్‌రెడ్డి



**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** బెట్టింగ్ (జూదం) సరదాగా ప్రారంభమై, ఇది క్రమంగా వ్యసనంగా మారి కుటుంబాల శాంతి, ఆర్థిక స్థితి, ఆశాలను నాశనం చేస్తుందని, వేగంగా, సులభంగా సంపాదించాలనే ఆశతో చాలా మంది తమ భవిష్యత్తును కోల్పోతున్నారని తెలంగాణ రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. కష్టపడి పనిచేయడమే నిజమైన విజయానికి మార్గమని సూచించారు. ఆదివారం ఉదయం 7 గంటలకు హైదరాబాద్‌లోని జలవిహార్ నుంచి పీపుల్స్ ప్లాజా వరకు తిరిగి జలవిహార్ వరకు స్లేట్ ది స్కూల్ ఆధ్వర్యంలో 'స్లేట్ స్మార్ట్ స్టార్ట్' అనే 5కె రన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదు ప్రధాన ప్రమాదాలకు వ్యతిరేకంగా నినాదిస్తూ అవగాహన కల్పించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న గుత్తా అమిత్‌రెడ్డి మాట్లాడుతూ లోన్‌యాప్స్‌తో కుటుంబాలు అధిక వడ్డీ, వేధింపుల భారంతో కృంగిపోతున్నాయన్నారు. జంక్ ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్ మన సంస్కృతి, ఆరోగ్యకరమైన అలవాట్లను నాశనం చేస్తుందన్నారు. మొబైల్ వ్యసనంతో ఆందోళన, ఒంటరితనం, ఏకాగ్రత కోల్పోవడానికి కారణమవుతుందన్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలలు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచనాత్మకను పెంపొందింపజేయాలని సూచించారు. కార్యక్రమంలో సుమారు 4వేల మంది తల్లిండ్రులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్‌టిఐతో అవినీతి అంతం

ఆర్‌టిఐ రాష్ట్ర కమిషనర్ దేశాల భూపాల్



**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** ప్రతి పౌరుడు సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ సమాచార హక్కు చట్టం కమిషనర్ దేశాల భూపాల్ కోరారు. అప్పుడే ప్రజాస్వామ్యంలో అవినీతి అంతానికి బీజం పడుతుందన్నారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ప్రథమ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. జాతీయ అధ్యక్షులు డా.చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు భూపాల్ ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. గత ప్రభుత్వం ఆర్టీఏ కమిషనర్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల 18 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, తాము వచ్చి, ఆరు నెలల్లోనే 7వేలకుపైగా దరఖాస్తులు పరిష్కరించామన్నారు. సమాచార హక్కు చట్టంపై పాఠ్యాంశాలలో చేర్చే అంశంపై కమిటీ చర్చించినట్టు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఆర్‌టిఐని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సినీనటుడు సూర్య కిరణ్ మాట్లాడుతూ ఆర్‌టిఐ చట్టం వజ్ర ఆయుధంలాంటిదన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సినీ హీరో ఆవల కిరణ్‌కుమార్, కమిటీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతల రాఘవేందర్, రాష్ట్ర అధికార ప్రతినిధి కాశీ సతీష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి కడమంచి అజయ్ కుమార్, ప్రకాష్ పటేల్, కడమంచి రాజశేఖర్, రామకృష్ణ,ముచ్చర్ల మల్లేష్,రమశ్రీ, సౌజన్య, ప్రియ, ప్రవీణ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## అమెరికాలో షట్‌డౌన్ కష్టాలు

వందల విమానాలు రద్దు : ఆహార సమస్యలు




**వాషింగ్టన్:** అమెరికాలో షట్‌డౌన్ వల్ల ప్రజలు తీవ్ర కష్టాలకు గురవుతున్నారు. లక్షలమంది ప్రజలు ఆహార కష్టాల బారిన పడుతున్నారు. ఉద్యోగులు వేతనాలు లేకుండా సెలవుపై ఇళ్ళల్లో కూర్చున్నారు. అత్యవసర సేవల విభాగం ఉద్యోగులు వేతనాలు లేకుండా ఉద్యోగాల్లో కొనసాగుతున్నారు. విమాన సర్వీసులలో విపరీతమైన కోతలు మొదలయ్యాయి. శనివారం ప్రారంభమైన విమాన సేవల కోతలు ఆదివారంనాటికి బాగా పెరిగాయి. వచ్చేవారం ముగిసేనాటికి విమానాల రాకపోకలు భారీగా నిలిచిపోయే పరిస్థితి వస్తుంది. విమానసేవల్లో కోతలు ప్రారంభమైన రెండోరోజు ఆదివారం 1400 విమానాలు రద్దయ్యాయి. 2,500 వీకెండ్ విమానాలను సంబంధిత మంత్రిత్వశాఖ రద్దుచేయడంతో ప్రయాణికులు ఎక్కడివారు అక్కడే నిలిచిపోయారు. విమానాల రద్దుతోపాటు సుమారు 3,300 విమానాలు విపరీతమైన ఆలస్యంగా నడుస్తున్నాయి. అమెరికా చరిత్రలో ఎన్నడూలేనివిధంగా షట్‌డౌన్ ఆదివారంనాటికి 40వ రోజుకు చేరుకుంది. శనివారం రాత్రి జరిగిన ప్రత్యేక సమావేశంలో కూడా సెనేటర్ల మధ్య ఆర్థిక బిల్లుల ఆమోదానికి సంబంధించి కొన్ని పురోగతి సంకేతాలను చూపించినప్పటికీ ఎలాంటి సానుకూలమైన ఒప్పందం కుదరలేదు. అధికార–ప్రతిపక్ష రిపబ్లికన్లు, డెమోక్రాట్లు తప్పు మీదంటే మీదే అంటూ పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నారు. ఒకవైపు దేశం షట్‌డౌన్ కారణంగా అతలాకుతలం అవుతుంటే అధ్యక్షుడు ట్రంప్ గోల్ఫ్ ఆడుకుంటున్నారని డెమోక్రాట్ సభ్యులు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఐతే జనవరి నాటికి ఆర్థిక కష్టాల నుండి గట్టెక్కించి ప్రభుత్వాన్ని పూర్తిస్థాయిలో పనిచేయడంతో పాటు సంవత్సరానికి సరిపడ అన్ని విభాగాలకు పూర్తిస్థాయి నిధులు సమకూరేవిధంగా బిల్లుల కొత్త ప్యాకేజీపై ఓటింగ్ నిర్వహించాలని రిపబ్లికన్లు ఆశిస్తున్నారు. కానీ ఆ ప్రయత్నాలకు అనుగుణంగా ప్రతిపక్ష డెమోక్రాట్ల నుండి ఎలాంటి హామీ లభించలేదు. ఇదిలా ఉండగా, ప్రభుత్వాన్ని సమర్ధవంతంగా పనిచేయించడానికి వీలుగా మేం కొన్ని ఓట్ల దూరంలో మాత్రమే ఉన్నామని, ఇక ప్రభుత్వాన్ని తెరవడంలో సమస్యలు తొలగిపోతాయని సెనేట్ మెజారిటీ నాయకులు జాన్ థూన్ శనివారం చెప్పారు.



# ఉప ఎన్నికలో మొత్తం 4 బ్యాలెట్ యూనిట్లు

విధులలో 2,060 మంది పోలింగ్ సిబ్బంది

ఈనెల 11న పోలింగ్‌కు అధికారుల ఏర్పాట్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రచారం ఆదివారం సాయంత్రంతో ముగిసింది. ఈనెల 11న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. 6 గంటల తర్వాత స్థానికేతరులు నియోజకవర్గం వదిలి వెళ్లాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. జూబ్లీహిల్స్ పరిధిలో వైన్స్, పబ్బులు మూసివేయాలని ఆదేశించింది. ఎన్నికల ప్రచారం ముగిసిన అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఉప ఎన్నిక కోసం చేసిన ఏర్పాట్ల వివరాలు తెలిపారు. జూబ్లీహిల్స్ ఎన్నికల బరిలో 58 మంది అభ్యర్థులు ఉన్నారన్నారు. ఉప ఎన్నికలో మొత్తం 4 బ్యాలెట్ యూనిట్లు ఉంటాయని చెప్పారు. సోమవారం కోట్ల విజయ్ భాస్కర్ రెడ్డి స్టేడియంలో ఎన్నికల సామగ్రి పంపిణీ చేస్తామన్నారు. పోలింగ్‌ను డ్రోన్‌ల ద్వారా పరిశీలిస్తామని చెప్పారు. 2,060 మంది పోలింగ్ సిబ్బంది విధులలో ఉండనున్నారని తెలిపారు. 561 కంట్రోల్ యూనిట్లు, 595 వివిప్యాట్స్, 2,394 బ్యాలెట్ యూనిట్లు అందుబాటులో




ఉన్నాయన్నారు. పోలింగ్ స్టేషన్స్ నుంచి వెబ్ కాస్టింగ్ లైవ్ స్ట్రీమింగ్ ఉంటుందన్నారు. అన్ని పోలింగ్ స్టేషన్స్ దగ్గర హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం 407 పోలింగ్‌స్టేషన్లు ఉన్నాయన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీటిలో 226 పోలింగ్ స్టేషన్‌లు సున్నితమైనవిగా గుర్తించామని చెప్పారు. ముఖ్యంగా 139 సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్‌లతో నిరంతర నిఘా ఏర్పాటు చేశామన్నారు. అన్ని పోలింగ్ స్టేషన్‌లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని, వెబ్ క్యాస్టింగ్ ఉంటుందన్నారు. ఈసారి కొత్తగా డ్రోన్‌ల ద్వారా పర్యవేక్షణ, నిఘా పెడుతున్నామని తెలిపారు. బల్క్ మెసేజ్‌లు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం నిషేధమన్నారు. 11వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామని వెల్లడించారు. ఈసారి ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్‌కు భారీ భద్రత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు ఎన్నికల కోసం మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ విధులకు 45 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 45 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ భద్రత చర్యల్లో పాల్గొంటాయన్నారు. ఇప్పటివరకు రూ.3.50 కోట్ల నగదు సీజ్ చేశామని చెప్పారు. నవంబరు 11న పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం, ఈ నెల 14న ఓట్ల లెక్కింపు చేపడుతామన్నారు. పోలింగ్ స్టేషన్‌ల దగ్గర పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తామని నగర జాయింట్ పోలీస్ కమిషనర్ ఇక్బాల్ తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఎలక్షన్ కమిషన్ నిబంధనల ప్రకారం బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు.సిఐఎస్‌ఎఫ్ నుంచి 8 కంపెనీల బలగాలు వచ్చాయన్నారు. అందరూ ఓటు హక్కు వినియోగించుకుని ఓటు పండుగలో పాల్గొనాలని సూచించారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా మొత్తం 27 రకాల కేసులు నమోదయ్యాయన్నారు. నమోదైన 27 కేసులను దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్, బిఆర్‌ఎస్ అభ్యర్థిగా మాగంటి సునీత, బిజెపి లంకల దీపక్ రెడ్డి తలపడుతున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో కనీసం 986 మంది ఓటర్లున్నారు. 1200 మంది ఓటర్లకు పైగా 11 పోలింగ్ కేంద్రాలుండగా అత్యల్పంగా 263 పోలింగ్ స్టేషన్‌లలో 540 మంది ఓటర్లు, అత్యధికంగా 9వ నెంబర్ పోలింగ్ స్టేషన్‌లో 1233 మంది ఓటర్లు ఉన్నారు. ఇక్కడ ప్రతి ఎన్నికల్లోనూ యాభై శాతానికి కొంచం అటు ఇటుగా పోలింగ్ నమోదవుతోంది. ఈ సారి పోలింగ్ శాతాన్ని పెంచేందుకు అటు రాజకీయ పార్టీలు, ఇటు అధికారులు కృషి చేస్తున్నారు. ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రానికి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు.

# 'ఇప్పపువ్వు లడ్డూల ఉత్పత్తి'తో రూ 1.27 కోట్ల వార్షిక టర్నోవర్





ఆర్థికాభివృద్ధిలో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న 'భీమ్ భాయి ఆదివాసీ మహిళా సహకార సంఘం'

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్థిక అభివృద్ధిలో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న 'భీమ్ భాయి ఆదివాసి మహిళా సహకార సంఘం' ఇప్పపువ్వు లడ్డూల ఉత్పత్తితో వార్షికంగా రూ 1' 27 కోట్ల టర్నోవర్ సాధిస్తున్నది. మహిళల ఆర్థిక అభ్యున్నతికి ప్రభుత్వం చేయూత నందించడంతో ఇప్పపువ్వు అడ్డూల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఈ యూనిట్ ద్వారా వార్షికంగా రూ. 1 కోటి 27 లక్షలు టర్నో వర్ సాధించినట్లు భీంభాయి ఆదివాసీ మహిళా సహకార సంఘం నిర్వాహకురాలు భగూ భాయి తెలిపారు. తద్వారా తమ సంఘానికి ప్రతి నెలా రూ 3 లక్షలు లబ్ది చేకూరుతున్నట్లు వివరించారు. ఆదివాసీ గిరిజన మహిళల సంపూర్ణ ఆర్థిక చేకూర్పునకు ఉట్నూర్ ఐటిడిఎ నైపుణ్యభివృద్ధి విభాగం ద్వారా కృషి చేస్తున్నది. ఆరోగ్య సంరక్షణలో ప్రకృతి సిద్ధంగా లభించే ఆహార పదార్థాలకు ప్రాధాన్యత పెరుగుతున్నది. స్వయం సహాయక సంఘాలతో ఆదివాసీ గిరిజన మహిళలు ఆర్థిక అక్షరాస్యత సాధించారు. వీరికి ప్రకృతి సిద్ధంగా లభిస్తున్న ఇప్పపువ్వుతో లడ్డూల తయారిపై మహారాష్ట్ర లోని యవత్మాల్ జిల్లాకు 12 మందిని పంపి, శిక్షణ ఇప్పించారు. ఉట్నూర్‌లో రూ.40 లక్షల వ్యయంతో నెలకొల్పిన ఇప్పపువ్వు లడ్డు తయారీ యూనిట్ కు ట్రైకార్ నుండి సబ్సిడీగా 60 శాతం నిధులను, మరో 30శాతం బ్యాంకు రుణం మంజూరు చేయగా, మహిళల తమ వాటాగా 10 శాతం భరించారు. ఇప్పపువ్వు లడ్డుల తయారిలో జాతీయ పోషకాహార సంస్థ (ఎన్‌ఐఎన్) నిపుణులు నిర్దేశించిన ప్రమాణాలు ప్రకారం ఇప్పపువ్వుకు పల్లీలు, నువ్వులు,బెల్లం, కాజు, ఎండు ద్రాక్షలను కలిపి,సన్ ఫ్లవర్ ఆయిల్‌తో రుచి నాణ్యత, పోషక విలువలుండే లడ్డూలు తయారు చేస్తున్నారు. ఈ పదార్థాలను స్థానికంగా హోల్ సేల్ షాప్స్ నుండి తీసుకుంటున్నారు. ప్రతి సంవత్సరం మార్చి నెలలో లభించే ఇప్పపువ్వు ను ఉమ్మడి ఆదిలాబాద్ ముఖ్యంగా కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా నుండి ఆదివాసీ గిరిజనుల నుండి దాదాపు 150 క్వింటాళ్ళను సేకరించి, ఐటిడి ఎ గోడౌన్‌లో నిల్వ చేస్తున్నారు.వందకు టుంబాలు ఇప్పపువ్వు సేకరణతో లబ్ధిపొందుతున్నాయి.

పోషక విలువలతో ఇప్పపువ్వు లడ్డు

పోషక విలువలున్న ఇప్పపువ్వు లడ్డులను ఉట్నూర్ ఐటిడిఎ పరిధిలోని 77 ఆశ్రమ పాఠశాలలకు ప్రతి నెలా 2,300 కిలోలను సరఫరా చేస్తున్నారు. ఓపెన్ మార్కెట్‌లో ప్రతి నెలా 900 కిలోల లడ్డూలు విక్రయిస్తున్నారు. ఆశ్రమ పాఠశాలలకు కిలో రూ.320ల చొప్పున, ఓపెన్ మార్కెట్ లో కిలో రూ360ల చొప్పున విక్రయిస్తున్నారు. హైదరాబాద్ శిల్పరామంలోని ఇందిరా మహిళా శక్తి కేంద్రంలో ఒకటి, బాలాపూర్ లో ఒక ఇప్పపువ్వు లడ్డు విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శిల్పారామం లో వారానికి 15 కిలోలు, బాలాపూర్ లో వారానికి 25 కిలోల ఇప్పపువ్వు లడ్డులు విక్రయం అవుతున్నాయి.

ఆదివాసీ గిరిజనులే ఇక్కడ ఇప్పపువ్వు లడ్డులు అమ్ముతున్నారు. అలాగే ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా దర్బార్ సందర్భంగా ఐటిడిఎ ప్రాంగణంలో ఒక స్టాల్‌పే ఏ ర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఉట్నూర్ లో పర్యటించిన పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్కను ఆదివాసీ మహిళలను అభిందించారు. కాగా మహిళల కృషిని, ఆర్థిక స్వావలంబన గురించి మన్ కీ బాత్ లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా ప్రస్తావించారు.



## ప్రభుత్వ భూముల వేలం వద్దు

ఆ స్థలాల్లో హాస్టళ్లు, గురుకులాలకు స్వంత భవనాలు నిర్మించాలి


రాష్ట్ర ప్రభుత్వానికి ఎంపి ఆర్.కృష్ణయ్య డిమాండ్

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ప్రభుత్వ భూములను వేలం వేయకుండా.. ఆ స్థలాల్లో పేదలకు ఇళ్ల నిర్మాణం, హాస్టళ్లు, గురుకులాలకు స్వంత భవనాలను నిర్మించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. అదేవిధంగా, హాస్టళ్ల మెస్ బిల్లులు, అద్దె బకాయిలు చెల్లించాలని, అదనంగా 150 బిసి కాలేజీ హాస్టళ్లు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్ ఇందిపార్కు వద్ద తెలంగాణ రాష్ట్ర బిసి యువజన సంఘం అధ్యక్షులు జిల్లపల్లి అంజి, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్ సంయుక్త ఆధ్వర్యంలో వేలాది మంది విద్యార్థులతో భారీ ధర్నా జరిగింది. ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ గురుకులాలు, హాస్టళ్లకు స్వంత భవనాలు లేకపోవడం వలన అద్దె భవనాలలో నిర్వహిస్తుండటంతో వసతుల లేమితో విద్యార్థుల ఆరోగ్యం, చదువు దెబ్బతింటుందన్నారు. పైగా ఏటా అద్దె కింద కోట్ల రూపాయలు ఖర్చవుతుందని, అన్ని వసతులతో స్వంత భవనాలు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదన్నారు. అయితే భవన నిర్మాణాలకు 80 శాతం గ్రాంటు కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని, అలాగే మల్టీ నేషనల్ కంపెనీల నుంచి సిఎస్‌ఆర్ ఫండ్స్ తీసుకొని భవనాల నిర్మించాలని, దీనికి పార్లమెంట్ సభ్యులుగా కృషి చేస్తానని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. కార్యక్రమంలో సంఘం నేతలు ర్యాగ అరుణ్ కుమార్, జి. అనంతయ్య,సి. రాజేందర్, పగిళ్ల సతీష్, శివ యాదవ్, అజయ్, భీం రాజు, బోయ గోపి, రాంగోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద మృతుల నుండి అవయవ, కణదానాలకు చర్యలు

రాష్ట్రాలకు విజ్ఞప్తి చేసిన కేంద్రం

**న్యూఢిల్లీ:** రోడ్డు ప్రమాదాలలో మరణించిన వారి అవయవాలు, కణాలను దానం చేసేవిధంగా బంధువులను ప్రోత్సహించేవిధంగా తగిన చర్యలు తీసుకోవాలని దేశంలోని అన్ని రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. అదేవిధంగా ఆసుపత్రులలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, ట్రామా సెంటర్ల స్థాయిని పెంచాలని, ఈ సెంటర్లను అవయవ దానాలు తీసుకోవడానికి వీలుగా రిజిస్ట్రేషన్ చేయాలని, ఈ అవయవ దానాలను ప్రోత్సహించడానికి మొదటివరసలో ఉండి ఉపయోగపడే ఉద్యోగులకు లేదా వ్యక్తులకు శిక్షణ ఇవ్వాలని కేంద్రం సూచనలు చేసింది. ఈ విధంగా చేయడంవల్ల పదిలక్షలమందిలో కనీసం ఒక్క రోగికి ఈ అవయవాల దానం వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొంది. ఎమర్జెన్సీ సేవలు అందించేందుకు మొదటిశ్రేణిలో ఉండి స్పందించేవారికి జిల్లాస్థాయిలో రాష్ట్రస్థాయిలో ఈ అవయవదానంకోసం బాధిత కుటుంబాలవారిని తగిన పద్ధతులలో ప్రోత్సహించేందుకు వీలుగా శిక్షణలు ఇవ్వాలని కేంద్రం కోరింది. భారతదేశంలో అవయవాలను మార్పిడి చేయడానికి స్టోరేజీ అవసరమని, కానీ స్టోరేజీ చేయడానికి అవయవాల కొరత విపరీతంగా ఉందని, సరైన సమయంలో అవసరమైన రోగులకు అవయవాలు మార్పిడి చేయడానికి అవయవ భాగాలు లభ్యం కావడంలేదని, వివిధ రకాల అవయవాలకోసం వేలాదిమంది రోజులు ఆసుపత్రులలో ఎదురుచూస్తున్నారని కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖకు చెందిన నేషనల్ ఆర్గాన్–టిష్యూ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆర్గనైజేషన్ (నోట్టో) డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్ ఒక లేఖలో రాష్ట్రాలకు తెలియజేయశారు.రహదారులపై ప్రతిరోజూ పెద్దసంఖ్యలో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ప్రత్యేకించి యువకులు ఈ ప్రమాదాల్లో ఉంటున్నారని, అలాకాకపోతే ఆరోగ్య సమస్యలవల్ల కూడా మరణిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. 2023లో దేశఃలోని జాతీయ రహదారులపై 1.70 లక్షలమంది మరణించారు. వీరందరినీ ఉపయోగించుకుంటే వేలాదిమందికి అవయవాలు సమకూర్చి వారికి ప్రాణం చేయడానికి వీలు కలుగుతుందని ఆ లేఖలో పేర్కొన్నారు.




## ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వ సాహసోపేత చర్యలు 'భేష్'

- ప్రధాని మోదీ కితాబు
- ఇతర రాష్ట్రాలూ అనుకరించాలని ఉద్బోధ
- రాష్ట్ర ఏర్పాటు రజతోత్సవ కార్యక్రమంలో ప్రసంగం





**డెహ్రాడూన్:** జనాభా మార్పు, ఏకరీతి పౌర నియమావళి, చట్ట విరుద్ధమైన మత సంభాషణలను నిరోధించడం మరియు అల్లర్ల నియంత్రణ చర్యలపై ఉత్తరాఖండ్ ప్రభుత్వం తీసుకున్న సాహసోపేతమైన చర్యలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ప్రశంసించారు. ఇతర రాష్ట్రాలు కూడా వాటిని అనుకరించాలని సూచించారు. ధామీ ప్రభుత్వం యుసిసి(యూనిఫామ్ సివిల్ కోడ్)ను అమలు చేసిన గంభీరత ఇతర రాష్ట్రాలకు ఒక ఉదాహరణ. మతమార్పిడి నిరోధక చట్టం, అల్లర్ల నియంత్రణ చట్టం వంటి జాతీయ ప్రయోజనాల అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ధైర్యమైన విధానాలను అవలంభించింది అని రాష్ట్ర ఏర్పాటు రజతోత్సవం సందర్భంగా జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఉత్తరాఖండ్‌లోని బిజెపి ప్రభుత్వం భూ ఆక్రమణ, జనాభా మార్పు వంటి సున్నితమైన అంశాలపై కూడా కఠిన చర్యలు తీసుకుంటోందని ప్రధాని ప్రశంసల్లో ముంచెత్తారు. డెహ్రాడూన్‌లోని అటవీ పరిశోధనా సంస్థ యొక్క విశాలమైన మైదానంలో జరిగిన ఈ కార్యక్రమంలో హిల్ స్టేట్‌లో రూ.8260.72 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్ట్‌లను రిమోట్‌గా మోదీ ప్రారంభించారు.పలు ప్రాజెక్ట్‌లకు శంకుస్థాపనలు చేశారు. ఉత్తరాఖండ్ అభివృద్ధిలో ఉన్న అడ్డంకులను తొలగించినందుకు ప్రధానమంత్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశంసించారు. రాబోయే కొన్ని సంవత్సరాలలో ఉత్తరాఖండ్ రాష్ట్రం ప్రపంచ ఆధ్యాత్మిక రాజధానిగా తనను తాను స్థాపించుకుంటుందని కితాబు ఇచ్చారు.ఉత్తరాఖండ్ అభివృద్ధి ప్రయాణం అనేక అడ్డంకులను ఎదుర్కొందని, కానీ బిజెపి ప్రభుత్వం ప్రతీసారి వాటిని అధిగమించి అభివృద్ధి వేగం మారకుండా చూసుకుందని మోదీ తెలిపారు. భవిష్యత్తులో ఉత్తరాఖండ్ అభివృద్ధిలో కొత్త శిఖరాలను చేరుకుంటుందని ప్రధానమంత్రి విశ్వాసాన్ని వ్యక్తంచేశారు. దాని భవిష్యత్తు ప్రయాణానికి కేంద్రం అన్ని విధాలుగా సహాయం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఉత్తరాఖండ్ సామర్థ్యాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లడానికి డబుల్ ఇంజన్ బిజెపి ప్రభుత్వం కృషి చేస్తోందని మోదీ అన్నారు. ఉత్తరాఖండ్‌తో తనకు ఎంత అనుబంధం ఉందనేది మీ అందరికీ తెలుసన్నారు. తాను ఆధ్యాత్మిక ప్రయాణాల కోసం ఇక్కడకు వచ్చినప్పుడల్లా పర్వతాలలో నివసించే ప్రజల పోరాటం తనకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తోందన్నారు. ఉత్తరాఖండ్‌లో నిజమైన సారాంశం దాని స్ఫూర్తిలోనే ఉందని, ఉత్తరాఖండ్ సంకల్పిస్తే రాబోయే కొన్ని సంవత్సరాలలో అది తనను తాను ప్రపంచ రాజధానిగా స్థాపించుకోగలదని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. వివిధ రంగాలలో ఉత్తరాఖండ్ పురోగతిని ప్రధానమంత్రి ప్రశంసించారు. 25ఏళ్ల క్రితం ఉత్తరాఖండ్ బడ్జెట్ కేవలం 4,000కోట్లు మాత్రమే ఉండేదని, ఇప్పుడు ఉత్తరాఖండ్ బడ్జెట్ రూ.ఒక లక్ష కోట్లకు చేరిందన్నారు. ఈ 25ఏళ్లలో ఉత్తరాఖండ్‌లో విద్యుత్ ఉ త్పత్తి నాలుగురెట్లు పెరిగిందని, రోడ్ల పొడవు కూ డా రెట్టింపు అయ్యిందని ప్రధాన మంత్రి తెలియజేశారు. ఒకప్పుడు ప్రతీ ఆరు నెలలకు విమానాలలో ప్రయాణికులు ఇక్కడకు 40,000మంది చే రుకునేవారని, ఇప్పుడు ఆ సంఖ్య రోజుకు 4,000 మందికి పైగా వస్తున్నారని ఆయన చె ప్పారు. ఈ 25ఏళ్లలో ఇంజనీరింగ్ కాలేజీల సం ఖ్య 10రెట్లకు పైగా పెరిగిందని, ఇంతకు పూర్వం ఉత్తరాఖండ్‌లో ఒకే ఒక్క మెడికల్ కాలే జీ ఉంటే ఇప్పుడు ఆ సంఖ్య 10కి చేరుకుందన్నారు. ఈ మార్పు ప్రతీ ఉత్తరాఖండి వ్యక్తి యొ క్క సమ్మిళిత సంకల్పం, విధానం ఫలితంగా ఉం దని ప్రధాని చెప్పారు. 20సంవత్సరాల నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి ఉత్తరాఖండ్ పూర్తిగా సిద్ధం అవుతోందని ప్రధానమంత్రి చెప్పారు. రాష్ట్రంలో రూ.2లక్షల కోట్ల విలువైన మౌలిక సదుపాయాల ప్రాజెక్ట్‌లు జరుగుతున్నాయన్నారు. వాటిలో రుషికేష్‌కర్ణ్ ప్ర యాగ్ రైల్ ప్రాజెక్ట్, ఢిల్లీడెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్ వే ఉన్నాయని ప్రధాని మోదీ వెల్లడించారు. ఈ సం దర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పలు కీలకమైన తాగునీరు సహా నీటిపారుదల, సాంకేతిక విద్య, ఎనర్జీ, అర్బన్ డెవలప్‌మెంట్, స్పోర్ట్స్, నై పుణ్యాల అభివృద్ధి తదితర ప్రాజెక్ట్‌లను ప్రారంభించారు .ఈ కార్యక్రమంలో ఉత్తరాఖండ్ ము ఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ, రాష్ట్రానికి చెందిన ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## అండమాన్ నికోబార్ దీవుల్లో భారీ భూకంపం



**పోర్ట్ బ్లెయిర్ :** అండమాన్ నికోబార్ దీవుల్లో భారీ భూకంపం సంభవించింది. ఆదివారం మధ్యాహ్నం సమయంలో భూమి ఒక్కసారిగా కంపించింది. రిక్టర్ స్కేలుపై భూకంపం తీవ్రత 5.4గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భూమికి 90 కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించినట్లు తెలిపింది. అయితే, జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ ప్రకారం.. దీని తీవ్రత 6.07గా నమోదైంది. భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రాన్ని గుర్తించినట్లు తెలిపింది. ఈ భూకంపం ధాటిని ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించి ఇప్పటి వరకూ ఎలాంటి సమాచారం లేదు.

## బిహార్‌లో మార్పు పవనాలు

### రాష్ట్రం యువ, శక్తివంతమైన సిఎంను చూడబోతోంది : అఖిలేశ్



**రాయ్‌పూర్ :** బిహార్ అంతటా మార్పు పవనాలు వీస్తున్నాయని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ చెప్పారు. ఆ రాష్ట్రంలో జరుగుతన్న అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం దిశగా దూసుకుపోతోందన్నారు. ఒడిశాకు బయలుదేరే ముందు ఛత్తీస్‌గఢ్‌లో రాయ్‌పూర్‌లోని స్వామి వివేకానంద విమానాశ్రయంలో కొద్దిసేపు విలేకరులతో మాట్లాటారు. బిహార్ ప్రజల మానసిక స్థితి 36 ఏళ్లు నిండిన ఆర్‌జెడికి చెందిన యువ, శక్తివంతమైన ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ పట్ల ఉన్న కోరికను స్పష్టంగా సూచిస్తుందని యాదవ్ అన్నారు. 'మీ కెమెరా చూపించే దానికంటే నేను చెప్పేది చాలా తక్కువ. నిజమైన ప్రజా మద్దతు ఎక్కడ ఉందో కెమెరా సంగ్రహిస్తోంది' అని మాజీ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అన్నారు. బిహార్ మార్పు తీసుకురావడంతో పాటు, యువ ముఖ్యమంత్రిని ఎన్నుకోబోతోంది. కొత్త ముఖ్యమంత్రిని, కొత్త శక్తితో కూడిన యువ సిఎం పొందబోతోంది. ఆదివారం తేజస్వీ యాదవ్ పుట్టినరోజు. యాధృచ్ఛికంగా అదే రోజు బిహార్‌లో ప్రచారానికి చివరి రోజు. ఆయనకు ప్రజల మద్దతు ఉంది' అని ఆయన అన్నారు. బిహార్‌లో ఆర్‌జెడి నేతృత్వంలోని మహాఘట్బంధన్, ఇండియా కూటమి విజయం దిశగా పయనిస్తున్నాయని, ఎన్నికల తర్వాత ఆవిజయం జాతీయస్థాయిలో కూటమిని మరింత బలోపేతం చేస్తుందని యాదవ్ పేర్కొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా చొరబాటుదారుల గురించి చేసిన వ్యాఖ్య గురించి అడిగినప్పుడు, యాదవ్ బిజెపిపై తీవ్రంగా విమర్శిస్తూ, 'ఘుస్పేథియే (చొరబాటుదారుల) కంటే గూస్ (లంచాలు) పైనే ఎక్కువ దృష్టి పెడుతుంది' అని మండిపడ్డారు. 'బిజెపి 11 సంవత్సరాలకు పైగా అధికారంలో ఉంది. ఈ కాలంలో చొరబాటుదారులు దేశంలోకి ప్రవేశించినట్లయితే, ఎవరు బాధ్యత వహిస్తారు? ఈ 11 సంవత్సరాలలో ఎంతమంది చొరబాటుదారులు వచ్చారో, ఎంతమంది అంతకు ముందు వచ్చారో (2014) బిజెపి స్వయంగా ఒక జాబితాను తయారు చేయాలని సవాల్ చేశారు. ఉత్తరప్రదేశ్ ప్రజలు గత లోక్‌సభ ఎన్నికల్లో బిజెపిని తిరస్కరించి తమ తీర్పును ఇప్పటికే ఇచ్చారని ఎస్పీ చీఫ్ అన్నారు. బిజెపి క్రైస్తవులు, ముస్లింలతో సహా వెనుకబడిన తరగతులు, దళితులు, గిరిజనులు, మైనారిటీలపై వివక్ష చూపిందన్నారు. వారందరూ పిడిఎ గొడుగు కింద ఐక్యమై బిజెపికి గుణపాఠం నేర్పించారని స్పష్టం చేశారు. బిజెపి తరుచూ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల గురించి మాట్లాడుతుంది కానీ, వారి మత రాజకీయాలు ప్రారంభమైన ప్రదేశాలలో కూడా ప్రజలు వారికి గుణపాఠం నేర్పారన్నారు. బిజెపి ఒకప్పుడు మత రాజకీయాలు ప్రారంభించిన చోటనే ఓడిపోయిందని గుర్తుచేశారు. రామ జన్మభూమి ఉద్యమానికి కేంద్రంగా ఉన్న అయోధ్యతో సహా ఫైజాబాద్ లోక్‌సభ స్థానంలో బిజెపి ఓటమిని ప్రస్తావించారు. సమాజ్‌వాదీ పార్టీ ఇతర రాష్ట్రాల్లో విస్తరించడానికి కృషి చేస్తోందని యాదవ్ అన్నారు.

### 'ఓటు చోరీ' అడ్డుకుంటే బిహార్‌లో

## కూటమిదే అధికారం

### బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ దేశాన్ని విభజించడానికి ప్రయత్నిస్తోంది : రాహుల్‌గాంధీ



**కిషన్‌గంజ్ :** ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత మరోమారు మండిపడ్డారు. వారు ఎక్కడికైనా వెళ్ళవచ్చు, కానీ చివరికి 'ఓటు చోరీ' చేసినందుకు పట్టుబడతారని పేర్కొన్నారు. ఆదివారం బిహార్‌లోని కిషన్‌గంజ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో రాహుల్‌గాంధీ ప్రసంగించారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ దేశాన్ని విభజించడానికి ప్రయత్నిస్తున్నాయని, ఇండియా కూటమి దేశాన్ని ఏకం చేయడానికి ప్రయత్నాలు చేస్తోందన్నారు. మోదీ, షా, ఎన్నికల కమిషన్ తాము చేసిన 'ఓటు చోరీ' (ఓటు దొంగతన) ఆరోపణలకు ఎటువంటి సమాధానాలుఇవ్వలేదన్నారు. ఎందుకంటే నిజం ఇప్పుడు ప్రజల ముందు బయటపడిందని, ప్రధానమంత్రి, షా వారు ఇష్టపడే చోటికి వెళ్ళవచ్చు, కానీ చివరికి 'ఓటు చోరీ' చేసినందుకు పట్టుబడతారని రాహుల్‌గాంధీ హెచ్చరించారు.

ఇటీవల రెండు కోట్ల మంది ఓటర్లు ఉన్న హర్యానాలో, ఓటర్ల జాబితాలో దాదాపు 25 లక్షల మంది నకిలీ ఓటర్లు ఉన్నట్లు తాను బయటపెట్టానన్నారు. దీనిపై ఇప్పటివరకు మోదీ లేదా (ప్రధాన ఎన్నికల కమిషనర్) జ్ఞానేష్ కుమార్ 'రాహుల్ గాంధీ అబద్ధం చెబుతున్నాడు' అని చెప్పే ధైర్యం చేయలేదన్నారు. ప్రజలు కలిసి వచ్చి ఓట్ల దొంగతనాన్ని ఆపితే, ఇండియా కూటమి బిహార్‌లో 100 శాతం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని రాహుల్‌గాంధీ ఉద్ఘాటించారు. బిహార్‌లో 'మహాఘట్బంధన్' తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోందని కచ్చితంగా చెప్పగలనన్నారు. అందుకు నూటికి నూరు శాతం అవకాశం ఉందని చెప్పారు. అయితే అందుకు బిజెపిని ఓటు దొంగతనం నుండి నిరోధించాలని పిలుపునిచ్చారు. ఓట్లు వేసే రోజున (నవంబర్ 11) పోలింగ్ కేంద్రాల వద్ద జాగ్రత్తగా ఉండాలని, బిహార్‌లో ఓటు దొంగతనాన్ని అడ్డుకోవడం ఇప్పుడు ప్రతి యువకుడు, కార్మికుడు, రైతు విధి' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. ముస్లింలు ఎక్కువగా ఉన్న బిహార్‌లోని సీమాంచల్ ప్రాంతంలో రాహుల్ మాట్లాడుతూ, బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ఓట్ల దొంగతనం నుండి దృష్టిని మళ్లించే లక్ష్యంతో 'విభజన ఎజెండా'ను అనుసరిస్తున్నాయని రాహుల్‌గాంధీ అన్నారు. మోదీ, షా ప్రజల గొంతుకు భయపడుతున్నారని, వారు భారతదేశ ఆత్మకు ద్రోహం చేశారని చెప్పారు. ఈ కేసులో వారు పట్టుబడటం ఖాయమన్నారు. ప్రధానమంత్రి ఆర్థిక విధానాలే రాష్ట్రంలో ఉపాధి కల్పన దుర్భరమైన స్థితికి కారణమని, ఆయన మిత్రుడు, బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌పై కూడా రాహుల్ మండిపడ్డారు. బెంగళూరు వంటి నగరాల్లో, అరుణాచల్ ప్రదేశ్ వంటి సుదూర రాష్ట్రాల్లో బిహార్ ప్రజలు రోడ్లు, పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రుల నిర్మాణానికి సహాయం చేస్తున్నారని, ఇంత కష్టపడి పనిచేసే వారికి ఇంట్లో పని ఎందుకు దొరకడం లేదని ప్రశ్నించారు. 20 ఏళ్లలో చేపలు, నక్కలు (మఖానా) సమృద్ధిగా పండే రాష్ట్రంలో ఆహార ప్రాసెసింగ్ యూనిట్లను ఎందుకు ఏర్పాటు చేయలేకపోయారో నితీష్ కుమార్ సమాధానం చెప్పాలని రాహుల్ డిమాండ్ చేశారు. కార్మికులుగా ఉండటానికి ఇష్టపడని బిహార్ యువతకు ముఖ్యమంత్రి ఉపాధిని కోరుకోవడం లేదు అని గాంధీ పూర్ణియలో జరిగిన మరో ర్యాలీలో అన్నారు.

## అర్హులను తొలగించకుండా చూసుకోండి

### 'సర్'పై డిఎంకె శ్రేణులకు సిఎం స్టాలిన్ ఆదేశం



**చెన్నై :** తమిళనాడులో ఈనెల 4వ తేదీ నుంచి ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)ను ఎన్నికల కమిషన్ నిర్వహిస్తోంది. అయితే ఈ ప్రక్రియలో అర్హులైన ఓటర్లలో ఎవరినీ తొలగించకుండా చూసుకోవాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ పార్టీ కార్యకర్తలకు హితబోధ చేశారు. ప్రజలతో తాను జరిపిన ముఖాముఖిలో ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)పై అవగాహన సరిపోలేదని తేలిందన్నారు. చాలా చోట్ల, బూత్ లెవల్ ఆఫీసర్లు (బిఎల్‌ఓలు) వంటి పోలింగ్ అధికారులు కూడా దీనిని అర్థం చేసుకోలేదని ప్రజలు వాపోతున్నట్లు స్టాలిన్ పేర్నొన్నారు. డిఎంకె ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో అధికార పార్టీ జిల్లా కార్యదర్శులతో జరిగిన వర్చువల్ ఇంటరాక్షన్‌లో స్టాలిన్ పాల్గొన్నారు. డిఎంకె పార్టీ కార్యదర్శులు, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు సర్ సంబంధిత పనిలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుత ఈశాన్య రుతుపవనాల కాలంలో సర్ అమలు సమయం గురించి ప్రశ్నించిన డిఎంకె ఈ భారీ ప్రక్రియ మైనారిటీ కమ్యూనిటీ నుండి ఓటర్లను తొలగించడానికి దారితీయవచ్చని పేర్కొంటూ దీనిని వ్యతిరేకిస్తోందని చెప్పారు. నెల రోజుల పాటు జరిగే సవరణ ప్రక్రియ గురించి చర్చించడానికి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన, సర్ ప్రచారంలో అర్హత కలిగిన ఒక్క ఓటరు పేరు కూడా మిగిలిపోకూడదని, అనర్హులైన ఓటర్ల పేర్లు జాబితా చేరేలా చూసుకోవాలన్నారు. అందుకు బూత్ స్థాయి ఏజెంట్లను అప్రమత్తంగా ఉండాలని స్టాలిన్ ఆదేశించిట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అలాగే సర్ గురించి సరైన వివరణ తర్వాత ఫారమ్‌లను ప్రజలకు పంపిణీ చేస్తున్నారా అని ఆయన ఆరా తీశారు.

## నాకు ప్రాణహాని : తేజ్ ప్రతాప్

**పాట్నా :** తనకు ప్రాణహాని ఉందని, తన శత్రువులు తనను చంపే ప్రమాదముందని ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ పెద్ద కుమారుడు, జనశక్తి జనతాదళ్ అధినేత తేజ్ ప్రతాప్ ఆరోపించారు. తన తండ్రి ఆర్‌జెడి నుంచి బహిష్కరించిన తర్వాత ఇటీవలే రాజకీయ పార్టీని స్థాపించిన తేజ్ ప్రతాప్‌యాదవ్, ప్రస్తుతం జరుగుతున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మహువా నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. ఆదివారం ఆయన పాట్నాలో మీడియాతో మాట్లాడుతూ 'నా భద్రత పెంచారు. నాకు ప్రాణహాని ఉంది. నా శత్రువులు నన్ను కూడా చంపవచ్చు. అందరూ శత్రువుల్లా కనిపిస్తున్నారు'అని అన్నారు. అయితే, ఆయన తన శత్రువులు ఎవరో వెల్లడించలేదు. యాదవ్ తన తమ్ముడు తేజస్వీకి పుట్టినరోజు శుభాకాంక్షలు కూడా తెలిపారు. 'నా ఆశీస్సులు ఎల్లప్పుడూ అతనికి ఉంటాయి. ఆయన మరింత ఎదగాలి' అని అన్నారు. తేజ్ ప్రతాప్ మే 25న ఆరు సంవత్సరాల పాటు ఆర్‌జెడి నుండి బహిష్కరించబడ్డారు. ఒక మహిళతో 'సంబంధం'లో ఉన్నట్లు అంగీకరించడంతో ఆయపై పార్టీ క్షమ శిక్షణా చర్యలు తీసుకుంది. అయితే, తన పేజీని 'హ్యాక్' చేశారని పేర్కొంటూ సోషల్ మీడియా పోస్ట్‌ను ఆ తరువాత తొలగించారు.

## 'వందే భారత్' ఎక్స్‌ప్రెస్‌లో ఆర్‌ఎస్‌ఎస్ పాటపై దర్యాప్తునకు ఆదేశం

### ఘటనపై కేరళ ప్రభుత్వం 'సీరియస్'

### అది దేశభక్తి గీతమని సమర్థించుకున్న కేంద్ర మంత్రులు

### తక్షణమే నివేదిక అందజేయాలని డిపిఐని ఆదేశించిన కేరళ సాధారణ విద్యా శాఖ మంత్రి వి.శివన్‌కుట్టి



**తిరువనంతపురం:** ఎర్నాకుళం నుండి బెంగళూరుకు కొత్తగా ప్రారంభించబడిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో పాఠశాల విద్యార్థులు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) పాట పాడటంపై ఆదివారం కేరళ ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించింది. కేంద్రమంత్రులు ఈ సంఘటనను గట్టిగా సమర్థించుకుంటూ అది దేశభక్తి గీతమని చెప్పినప్పటికీ కేరళ ప్రభుత్వం ఈ విషయంపై సీరియస్‌గా చర్యలు చేపట్టేందుకు సిద్ధమైంది. ఈ ఘటనపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని సాధారణ విద్య శాఖ మంత్రి వి.శివన్‌కుట్టి డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్స్ (డిపిఐ)ను ఆదేశించారు. ఈ సంఘటనను ప్రభుత్వం అత్యంత గంభీరంగా పరిగణిస్తుందని మంత్రి కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో శివన్‌కుట్టి తెలిపారు. ఇదిలాఉంటే ప్రతిపక్ష కాంగ్రెస్ ఈ సంఘటనను తీవ్రంగా పరిగణిస్తోంది. విద్యార్థులను మతపరంగా వాడుకునేందుకు అనుమతించినందుకు పాఠశాల అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. అయితే పాఠశాల యాజమాన్యం మాత్రం చిన్నారుల చర్యను సమర్థించుకుంటూ ప్రత్యేకించి ఆ పాట సందేశం 'భిన్నత్వంలో ఏకత్వానికి' సంబంధించినది అని పేర్కొంది. అంతేకాకుండా వారు అందులో మతతత్వం ఏమి ఉన్నదో తెలుసుకోవడానికి ప్రయత్నించారు. దర్యాప్తునకు ఆదేశించిన మంత్రి శివన్‌కుట్టి మాట్లాడుతూ రాజకీయ కార్యక్రమాలలో పిల్లలను రాజకీయం చేయడం, ఒక నిర్దిష్ట సమూహానికి చెందిన వారి మతపరమైన ఎజెండాను ప్రోత్సహించడానికి వారిని ఉపయోగించడం రాజ్యాంగ సూత్రాలను ఉల్లంఘించడమే అవుతుందని అన్నారు. 'పబ్లిక్ సూచనల డైరెక్టర్ (డిపిఐ)ని వెంటనే విచారణ నిర్వహించి నివేదిక సమర్పించాలని ఆదేశించాం' అని మంత్రి శివన్‌కుట్టి చెప్పారు. అధికారిక కార్యక్రమంలో విద్యార్థులను పాల్గొనేలా చేయడంలో ఏవైనా లోపాలు ఉన్నాయా అని దర్యాప్తు పరిశీలిస్తుందని, నివేదికలోని ఫలితాల ఆధారంగా తగిన తదుపరి చర్యలు తీసుకుంటాం అని మంత్రి శివన్‌కుట్టి తెలియజేశారు. దేశం యొక్క లౌకిక, జాతీయ విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఆ సూత్రాలను పరిరక్షించడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి శివన్‌కుట్టి చెప్పారు. అయితే కేంద్ర పెట్రోలియం, సహజవాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి మాత్రం పాఠశాల విద్యార్థులు కొత్తగా ప్రారంభించబడిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఆర్‌ఎస్‌ఎస్ పాట పాడటాన్ని సమర్థించారు. 'ఇది పిల్లల అమాయక వేడుకలో భాగం' అని త్రిసూర్‌లో విలేకరులడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. 'వాళ్లకు ఆపాట పాడాలని అనిపించింది. అలాగే చేశారు'. అది ఏమైనా 'తీవ్రవాద పాట' కాదు కదా'అని కేంద్ర మంత్రి సురేశ్ గోపి అన్నారు. రాష్ట్రానికి చెందిన మరో కేంద్ర మంత్రి జార్జి కురియన్ కూడా ఆర్‌ఎస్‌ఎస్ పాట పాడటాన్ని సమర్థించుకున్నారు. 'ఆ గీతంలో మతతత్వం ఏమున్నది' అని అడిగారు. భారత వ్యతిరేక భావాలను ప్రచారం చేయడానికి ప్రయత్నించే వారికి ఈపాట నచ్చకపోవచ్చని కూడా మంత్రి జార్జికురియన్ అన్నారు. ఎలమక్కరలోని సరస్వతీ విద్యానికేతన్ స్కూల్ ప్రిన్సిపాల్ డింటో కె.పి విద్యార్థులు పాట పాడటాన్ని సమర్థిస్తూ ఆ పాటను దేశభక్తి గీతంగా అభివర్ణించారు. దీనిని దక్షిణ రైల్వే నిర్దేశించిన విధంగా పాడలేదని, కానీపిల్లలు దానిని మలయాళ దేశభక్తి గీతంగా పాడాలని ఎంచుకున్నారని ప్రిన్సిపాల్ డింటో కె.పి చెప్పారు. ఈ వివాదం తర్వాత దక్షిణ రైల్వే యొక్క 'ఎక్స్'హ్యాండిల్ నుండి పాటను తొలగించినప్పుడు పాఠశాల అధికారులు ప్రధాన మంత్రి, కేంద్ర రైల్వే శాఖ కార్యాలయానికి లేఖలు పంపారని ప్రిన్సిపాల్ అంగీకరించారు. పాఠశాల అభ్యర్థన మేరకు దక్షిణ రైల్వే ఆ వీడియోను మరుసటి రోజు తర్వాత పోస్ట్ చేయవచ్చని ప్రిన్సిపాల్ డింటో తెలియజేశారు. రాష్ట్ర విద్యాశాఖమంత్రి ఈ విషయమై ఎందుకు దర్యాప్తునకు ఆదేశించారో మాకైతే తెలియదని, ఒకవేళ సాధారణ విద్య విభాగం తన చర్యను చేపట్టేందుకు ముందుకు వెళితే, మేం చట్టపరమైన మార్గంలో వెళ్లే విషయాన్ని మేం ఆలోచిస్తామని ప్రిన్సిపాల్ వివరించారు. ఈ పాట పాడిన పిల్లలు ఎక్కువగా సైబర్ వేధింపులకు గురువుతున్నారని, సామాజిక వేదికలపై వారిని 'సంఘీకిడ్స్'గా ముద్రవేయబడ్డారని డింటో చెప్పారు. ఈసంఘటనను ప్రజాస్వామ్యానికి సవాల్ అని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబి వ్యాఖ్యానించారు. 'కేరళను మతపరంగా మార్చడానికి బిజెపి చేసిన మరో ఉదాహరణ ఇది' అని కేరళ శాసనసభలో ప్రతిపక్ష నాయకుడు వి.డి.సతీషన్ ఆరోపించారు. 'ప్రజల ఖర్చుతో రాజకీయాకరణ అనుమతించబడదు. ఆర్‌ఎస్‌ఎస్ గణగీతాన్ని దేశభక్తి గీతం అని పిలవవచ్చా?' అని ప్రతిపక్ష నాయకుడు ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ఆర్‌ఎస్‌ఎస్ పాట పాడించడం 'చట్ట విరుద్ధం' మరియు 'అప్రజాస్వామికం' అని వ్యాఖ్యానించారు. కొత్తగా ప్రారంభించబడిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో పాఠశాల విద్యార్థులు ఆర్‌ఎస్‌ఎస్ పాట పాడిన ఒక రోజు తర్వాత కేరళలో తీవ్ర ప్రతిచర్యలు ఎదురైన అనంతరం రాష్ట్రప్రభుత్వం ఆదేశించిన దర్యాప్తు నేపథ్యంలో నాయకుల నుంచి తీవ్ర వ్యాఖ్యలు వెలువడ్డాయి. ముఖ్యమంత్రి పినరయి విజయన్ దక్షిణ రైల్వే చర్యను శనివారం ఖండించారు. ఇది నిరసనకు అర్హమైనదన్నారు. మత వ్యతిరేక ద్వేషాన్ని, మత విభజన రాజకీయాలను నిరంతరం వ్యాప్తి చేసే ఆర్‌ఎస్‌ఎస్ పాటను ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో చేర్చడం రాజ్యాంగ సూత్రాలను ఉల్లంఘించడమేనని మండిపడ్డారు.

### జమ్ము వ్యాప్తంగా ఉగ్ర వ్యతిరేక చర్యలు

## డజన్లకొద్దీ ప్రదేశాల్లో సోదాలు



**జమ్ము :** ఉగ్ర కార్యకలాపాలకు వ్యతిరేకంగా పోలీసులు జమ్ముకశ్మీర్‌ను జల్లెడ పడుతున్నారు. వివిధ ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. పాకిస్తాన్ నుండి పనిచేస్తున్న స్థానిక ఉగ్రవాదులు, వారి భూగర్భ కార్మికులను (ఒజిడబ్ల్యులు) లక్ష్యంగా చేసుకున్నారని కూంబింగ్ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రాంబన్, కిష్త్వార్, దోడా, కథువా, రియాసి, పూంచ్, రాజౌరి జిల్లాల్లోని డజన్ల కొద్దీ ప్రదేశాలలో భారీగాలింపు, కార్డన్ ఆపరేషన్ జరుగుతోందని తెలిపారు. జమ్ములోని దోడా జిల్లాలో భారీ ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ మధ్య శనివారం అనేక మంది అనుమానిత వ్యక్తులను ప్రశ్నించడానికి పిలిచారు. ఎత్తుప్రాంతాలలో పనిచేస్తున్న ఉగ్రవాదులు శీతాకాలంలో దాక్కోవడానికి సురక్షితమేన ప్రదేశాలను వెతుకుతున్నారని నిఘా నివేదికలు సూచించడంతో సోదాలు ముమ్మరం చేశారు. భద్రతా గ్రిడ్‌ను బలోపేతం చేయడానికి, శాంతిని కాపాడటానికి పోలీసులు తమ ప్రయత్నాలను కొనసాగించారు. రాంబన్ జిల్లాలోని బనిహాల్, గూల్ ప్రాంతాలలోని అనేక ప్రదేశాలలో భారీ కార్డన్, సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించారని పోలీసు ప్రతినిధి ఒకరు తెలిపారు. రాంబన్ సీనియర్ ఎస్‌పి అరుణ్ గుప్తా పర్యవేక్షణలో ఈ ఆపరేషన్లు బాగా సమన్వయంతో జరిగాయని, పాకిస్తాన్ నుండి కార్యకలాపాలు నిర్వహిస్తున్న జమ్ముకశ్మీర్ స్థానికుల బంధువుల అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించడం, అనుమానిత వ్యక్తుల పూర్వీకులను ధృవీకరించడం, దుర్బల ప్రాంతాల చుట్టూ భద్రతను కట్టుదిట్టం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన తెలిపారు. ఈ ఆపరేషన్ల సమయంలో, పాకిస్తాన్, ఒజిడబ్ల్యు నుండి కార్యకలాపాలు నిర్వహిస్తున్న జమ్ముకశ్మీర్‌కు చెందిన చురుకైన ఉగ్రవాదుల బంధువులు, తెలిసిన సహచరుల ఇళ్లను సోదాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. జాతీయ వ్యతిరేక లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరగడం లేదా వారికి మద్దతు ఇవ్వడం లేదని నిర్ధారించడానికి పోలీసు బృందాలు బహుళ ప్రాంగణాలను క్షుణ్ణంగా తనిఖీ చేశాయని ఆ ప్రతినిధి తెలిపారు. జిల్లా అంతటా వివిధ సున్నితమైన ప్రాంతాలను కవర్ చేసే డ్యూటీ మేజిస్ట్రేట్‌లతో పాటు పోలీసులు, సైన్యం, సిఆర్‌పిఎఫ్, ఎస్‌ఒజి యూనిట్ల సంయుక్త బృందాలు ఈ డ్రైవ్‌లను నిర్వహించాయన్నారు. సాధారణ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈ ఆపరేషన్లు వ్యవస్థీకృత పద్ధతిలో జరిగాయని తెలిపారు. ఈప్రాంతంలో శాంతి, స్థిరత్వం చెదిరిపోకుండా ఉండేలా కొనసాగుతున్న నివారణ, నిఘా ఆధారిత చర్యలలో ఇటువంటి ఆపరేషన్లు ఒకభాగమని చెప్పారు. దేశ వ్యతిరేక నెట్‌వర్క్‌ను నిర్వీర్యం చేయడానికి, అన్ని పౌరుల భద్రతను నిర్ధారించడానికి పోలీసులు కట్టుబడి ఉన్నారని, చట్ట అమలు సంస్థలతో సహకరించాలని, వారి ప్రాంతాలలో అనుమానాస్పద కదలికలు లేదా వ్యక్తులకు సంబంధించిన ఏదైనా విలువైన సమాచారాన్ని పంచుకోవాలని ప్రజలను అభ్యర్థించారు. సమాచారం ఇచ్చేవారి గుర్తింపును గోప్యంగా ఉంచుతామని ఆయన హామీ ఇచ్చారు.

## 'వందేమాతరం'పై వివాదం

## ప్రధానమంత్రి క్షమాపణకు కాంగ్రెస్ డిమాండ్

### రవీంద్రనాథ్ ఠాగూర్‌ను అవమానించారని విమర్శ

**న్యూఢిల్లీ:** 'వందేమాతర గీతం'పై ఏర్పడిన వివాదం చినుకు చినుకు గాలివానగా మారుతోంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ క్షమాపణ చెప్పాలని ప్రతిపక్ష కాంగ్రెస్‌పార్టీ డిమాండ్ చేసింది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 1937లో వందేమాతర గీతంపై జారీ చేసిన ప్రకటనను, దాంతోపాటు జాతీయ గీత రచయిత రవీంద్రనాథ్ ఠాగూర్‌ను కూడా ప్రధానమంత్రి అవమానించారని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి, ఆ పార్టీ కమ్యూనికేషన్స్ విభాగం ఇన్‌ఛార్జి జైరామ్ రమేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆదివారం ఆయన ఒక పోస్టింగ్ పెట్టారు. వందేమాతర గీతంలో ఉన్న ముఖ్యమైన చరణాలను 1937లో వదిలిపెట్టేశారని, దీనివల్ల దేశ విభజనకు బీజాలు పడ్డాయని,ఈ విధమైన విభజనవాద ఆలోచనాధోరణి ఈనాటికీ కూడా దేశానికి సవాలుగా మారిందని ప్రధానమంత్రి శుక్రవారం వ్యాఖ్యానించిన తర్వాత ఈ వివాదం చెలరేగింది. ఈ వ్యాఖ్యలు చేసినందుకు ప్రధానమంత్రి క్షమాపణ చెప్పాలని,దేశంలో కోట్లాదిమంది ప్రజలకు ఆందోళన కలిగిస్తున్న నిరుద్యోగం, అసమానతలు వంటి అనేక వర్తమాన సమస్యలపై పోరాడాలని,రోజువారీ రాజకీయ సమస్యలపై జరుగుతున్న పోరాటాన్ని ఎదుర్కోవాలని జైరామ్ రమేశ్ పేర్కొన్నారు. బంకించంద్ర ఛటర్జీ వందేమాతర గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా ఏడాదిపాటు నిర్వహించే స్మారక కార్యక్రమాలను ప్రారంభించిన సందర్భంగా మోదీ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై జైరామ్ రమేశ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ, మహాత్మాగాంధీ నాయకత్వాన జరిగిన మనదేశ స్వాతంత్ర్యపోరాటంలో ఆర్‌ఎస్‌ఎస్‌కు ఎలాంటి పాత్రా లేకపోవడంలో ఆశ్చర్యం లేదని, కానీ సిడబ్ల్యుసి ప్రకటనను (1937), టాగోర్‌ను దేశ ప్రధానమంత్రి అవమానించడం దిగ్భ్రాంతి కరమైన విషయమని అన్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 1937 అక్టోబరు 26 నుండి నవంబరు ఒకటో తేదీన కోల్‌కతాలో సమావేశం జరిపిందని, ఈ సమావేశంలో మహాత్మాగాంధీతోపాటు జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, నేతాజీ సుభాశ్ చంద్రబోస్, రాజేంద్ర ప్రసాద్, మౌలానా అబ్దుల్ కలామ్ అజాద్, సరోజినీ నాయుడు, జె.బి.కృపలానీ, భూలాభాయ్ దేశాయ్, జమ్నాలాల్ బజాజ్, నరేంద్ర దేవ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారని గుర్తుచేశారు. మహాత్మాగాంధీ రచనాసంకలనం 66వ సంపుటి 46వ పేజీలో ఉన్న సమాచారం ప్రకారం 1937 అక్టోబరు 28వ తేదీన సిడబ్ల్యుసి వందేమాతరగీతంపై చేసిన ప్రకటన ఆనాడు రవీంద్రనాథ్ ఠాగూర్‌ను, ఆయన సలహాను కూడా తీవ్రంగా ప్రభావితం చేసిందని జైరామ్ రమేశ్ ఎక్స్ వేదికగా గుర్తుచేశారు. అందువల్ల గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్‌ను, సిడబ్ల్యుసి ప్రకటనను ప్రధానమంత్రి అవమానించారని విమర్శించారు. ఆనాటి సిడబ్ల్యుసి ప్రకటన స్క్రీన్‌షాట్‌ను కూడా ఆయన ఎక్స్ వేదికగా షేర్ చేశారు.

### బిహార్ ఎన్నికల్లో ప్రత్యర్థులపై ...

## గొప్ప రాజకీయ అస్త్రం 'జంగిల్‌రాజ్'


### ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా, సిఎం నితీశ్‌కుమార్ నోట ప్రతీచోటా ఇదే జపం

**పాట్నా/జెహానాబాద్ :** దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తున్న బిహార్ శాసనసభ ఎన్నికలలో అధికారపక్షం, ప్రతిపక్షకూటమిపై పదేపదే ప్రయోగిస్తున్న 'జంగిల్‌రాజ్' పదబంధం ఇప్పుడు మరింత హాట్ టాపిక్‌గా మారుతోంది. బిహార్ శాసనసభ ప్రస్తుత బిహార్ శాసనసభ ఎన్నికలలో 'జంగిల్ రాజ్ ' అనే పదబంధం ఒక గొప్ప రాజకీయ ఆయుధంగా మారింది. ఇప్పుడు బిహార్ ఎన్నికల సందర్భంగాప్రచార స్థలాలు, సోషల్ మీడియా వేదికలు, టీవీ స్టూడియోలు, ప్రజల జ్ఞాపకాలలో కూడా రాజకీయ ప్రత్యర్థుల మధ్య కూడా భీకర పోరాటాలు జరుగుతున్నాయి. ప్రజాజ్ఞాపకాల యుద్ధ భూమిలో కీలక రాజకీయ ప్రత్యర్థులకు బహుశా మరే ఇతర పదబంధం జంగిల్ రాజ్ అనే పదబంధానికి మించిన గొప్ప రాజకీయ అస్త్రంగా మారలేదు. ఈ పదాన్ని జెడి(యు), దాని ప్రధాన మిత్రపక్షం బిజెపి నాయకులు ఆర్‌జెడి, ప్రతిపక్ష కూటమిపై దాడి చేయడానికి తరచుగా ఉపయోగిస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్‌షా, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ సహా అధికార ఎన్‌డిఎ కేంద్ర, రాష్ట్ర నాయకులు వారి ప్రచార సందర్భాలలో 'జంగిల్ రాజ్' అనే అపఖ్యాతిపాలైన పదబంధాన్ని ఉపయోగిస్తూ రెచ్చగొట్టారు. 2025 మొదటి దశ అసెంబ్లీ ఎన్నికల ర్యాలీలు మొదలు బూత్‌లెవల్ కార్యకర్తలతో చర్చాగోష్ఠులు సహా ఆన్‌లైన్ ప్రతిస్పందనలలో ఇండియా కూటమి, దాని కీలక భాగస్వామియైన ఆర్‌జెడిపై పూర్తి స్థాయి ఆరోపణాస్త్రాలు సంధించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'జంగిల్ రాజ్'ను దూరంగాఉంచాలని పదే పదే ఓటర్లను కోరారు. 'జంగిల్ రాజ్' గురించి యువతలో అవగాహన పెంచాలని కోరారు. 1990లలో లాలూ ప్రసాద్, రబ్రీదేవి పాలనలో తరచూ చోటుచేసుకున్న అక్రమాలు, పేలవమైన పాలనకు సంబంధించి పాలక కూటమి 'జంగిల్ రాజ్' పదాన్ని ఉపయోగించడమే కాదు, తరచూ ఉపయోగించింది. మొదటి దశ ఎన్నికలు ముగిసిన ఒక రోజు తర్వాత దక్షిణ బిహార్‌లోని కైమూరు జిల్లా భభువాలో ప్రచారం సమయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాజకీయదాడిని కొనసాగించారు. ఎన్నికల ర్యాలీలో లాలూ ప్రసాద్ కుమారుడు, ఇండియా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి అయిన ఆర్‌జెడి నాయకుడు తేజస్వీ యాదవ్‌పై 'జంగిల్‌రాజ్' విమర్శలు గుప్పించారు. ఎప్పుడైతే ప్రిన్స్ 'జంగిల్ రాజ్' ను మీరు పెద్ద అబద్ధాలను (వాగ్దానాలను) ఎలా నెరవేరుస్తారని అడిగినప్పుడు ప్రజలకు మావద్ద ఒక ప్రణాళికి ఉందని అంటాడని, ఏ ప్రణాళిక ఉందని ప్రజలు అడిగినప్పుడు మాత్రం దాని గురించి చెప్పడంలో నీళ్లు మింగుతున్నారని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు. ఎప్పుడైతే నితీశ్‌కుమార్ మొదటిసారి కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20ఏళ్లు అవుతున్నప్పటికీ 'జంగిల్ రాజ్‌ను అంతంచేశాను' అనే వాదనపై ఆధారపడి, ముఖ్యంగా ఎన్నికల సమయంలో రాజకీయ ఏకపక్ష పోరాటం గతం యొక్క భూతాన్ని సజీవంగా ఉంచుతోంది. ఆర్‌జెడి నాయకులు, దాని ఇద్దరు జాతీయ అధికార ప్రతినిధులైన ఇద్దరు మహిళలు ఈ ఆమ్లాత్మక విమర్శలను తిప్పికొట్టారు. గత కొన్నేళ్లుగా నితీశ్ ప్రభుత్వంలో శాంతిభద్రతల పరిస్థితి అధ్వానంగా మారిందని ఆరోపించారు. బిజెపిజెడి(యు) 'జంగిల్ రాజ్' గురించి పదేపదే మాట్లాడుకుంటూ ఇది వారి కథనం కాబట్టి మచ్చ తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయని, వారు ప్రజలకు ముఖ్యంగా పేదలు, నిరుపేదలకు ఏదైనా చేసి ఉంటే వారు ఈ విధంగా ఓట్లు అడిగేవారు కాదని ఆర్‌జెడి జాతీయ అధికార ప్రతినిధి ప్రియాంక భర్తీ అనేకసార్లు టీవీ డిబేట్లలో పదేపదే నొక్కి చెప్పారు. శుక్రవారం జముయిలో జరిగిన ర్యాలీలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మాట్లాడుతూ లాలూరబ్రీదేవి పాలనలో నేరస్తులు విచ్చలవిడిగా తిరిగారని, కిడ్నాప్‌లు జరిగాయని, అక్రమ రవాణా జరిగిందని, జంగిల్‌రాజ్ ఫ్యాక్టరీలు, వ్యాపారాలను మూసివేసి బిహార్‌ను పేదరికంలో ముంచెత్తిందని ఆరోపించారు.నవంబర్ 4న దర్భంగాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన 'జంగిల్‌రాజ్'ను గుర్తుచేశారు.జంగిల్‌రాజ్‌ను అడ్డుకునేందుకు 'తామరపువ్వు'గుర్తును ఎంచుకోవాలని కోరారు.

# సాహితీ విహారి

# పేదల బాధలు తెలిసిన రావిశాస్త్రి పెన్ను!

పూర్తి పేరు రాచకొండ విశ్వనాథ శాస్త్రి (30 జులై 1922– 10 నవంబర్ 1993). కానీ, రావిశాస్త్రి గానే సుపరిచితుడు. అల్పజీవిని ఆవిష్కరించిన విశ్వమిత్రుడు. రావిశాస్త్రిని ఇంట్లో 'విశ్వం' అని పిలిచేవారు. కోర్టులో ఆర్‌విఎస్‌గా తెలుసు. క్లయింట్లకు చాత్రిబాబు. పాఠకలోకానికి మాత్రం ఆయన రావిశాస్త్రి. ఆయన కలానికి పేదల బాధలు తెలుసు. అందుకే వృత్తిరీత్యా న్యాయవాది అయినప్పటికీ, ప్రవృత్తిలోనూ పేదల పక్షాల నిలిచి వాదించారు. ఆయన భారతదేశపు మాక్సిమ్ గోర్కీ.. చార్లెస్ డికెన్స్. రావిశాస్త్రి రచనలను సమీక్షించడం సామాజిక తనిఖీ చేయడం. దేశంలోని అధికార యంత్రాంగం, పోలీసులు, శాసనసభ, పార్లమెంటు, న్యాయవ్యవస్థ, రాజ్యాంగం గురించి, సామాన్యులకు కూడా అర్థమయ్యేలా అద్భుత రచనలు చేసి, తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. న్యాయం పక్షాన నిలబడి తన రచనల ద్వారా సమాజంలోని అన్యాయాన్ని ప్రశ్నించారు. డబ్బు పలుకుబడి, అధికారమదంతో కొందరు ఇంకొందరికి చేసే దురన్యాయాలను ఎండకడ్తూ ఎన్నో కథలు, నవలలు, కొన్ని నాటకాలు రాశారు. శ్రీకాకుళంలో నారాయణమూర్తి, సీతామహాలక్ష్మి దంపతులకు జన్మించిన రావిశాస్త్రి చదువు విశాఖపట్టణంలో సాగింది. రావిశాస్త్రి గారి తల్లికి సంగీత సాహిత్యాలలో గల పరిచయం పిల్లలపై ముఖ్యంగా శాస్త్రిగారిపై చాలా ప్రభావం చూపింది. సమకాలికమైన పత్రికలు పుస్తకాలు చదవడం వలన రాజకీయ, సాహిత్యవిషయాలతో పరిచయం ఏర్పడింది. సాహిత్యమే కాక సంగీతంలో కూడా రావిశాస్త్రికి మంచి అభిరుచి ఉండేది. ఆయన సమాజ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని రచనలు రాశారు. ఆయన రచనల్లోని పాత్రలు మన కళ్ళ ముందు కదులుతున్నట్లు కనిపిస్తాయి. అంతటి సహజత్వాన్ని సంతరించుకున్న రచనలు కాబట్టే పాఠకులను ఆసాంతం చదివిస్తాయి. ఆలోచింపచేస్తాయి. ఆయన రాసిన 'అల్పజీవి' ఇందుకు ఉదాహరణ. ఆయన తన పదమూడవ ఏటనే రచనలు చేశారు. పలు కథలు అప్పటి ప్రముఖ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. కాంతాకాంత, జాస్మిన్, గోల్కొండ రాం ప్రసాద్, శంకర గిరి, గిరిజా శంకరం, అన్ జానా వంటి సవాలక్ష పేర్లు. శృంగార రచనలతో మొదలుపెట్టి, సమసమాజం కోసం తల్లడిల్లే ఒక గొప్ప దార్శకుడి ఆలోచనల నుంచి ఉద్భవించిన రచనల వరకూ రావిశాస్త్రి సాహితీ ప్రస్థానం విశేషంగా, విజయవంతంగా సాగింది. బ్రిటన్‌కు చెందిన హెర్బర్ట్ లియోనెల్ అడోల్ఫస్ హార్ట్ (హెచ్‌ఎల్‌ఏ హార్ట్) న్యాయ శాస్త్రంలో తిరుగులేని మేధావి. రావిశాస్త్రి కూడా ఆ స్థాయికి చెందిన వాడే. 'ఆరు సారా కథలు'లో న్యాయ శాస్త్రంపై ఆయనకు ఉన్న పట్టు స్పష్టంగా కనిపిస్తుంది. దోపిడీ వ్యవస్థలో అడుగడుగునా అన్యాయానికి గురవుతూ, అణచివేతను ఎదుర్కొంటూ జీవచ్ఛవాల్లా బతికే వారు కూడా ఏదో ఒక రోజు ధైర్యంతో ప్రశ్నిస్తారని, అక్రమాలను ధిక్కరిస్తారని రావిశాస్త్రి నమ్ముతారు. ఆయన కథల్లో ఈ ఆశావాద దృక్పథం స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన పేదల పక్షాన నిలబడతారు. పోరాడతారు. సామాన్య ప్రజలే ఆయన రచనల్లో కీలక పాత్రలుగా పాఠకులను పలకరిస్తారు. అందుకే, ప్రతి కథా మనకు పరిచయం ఉన్నట్టు, కొన్ని సందర్భాల్లో మనమే ఆ కథలో ఇమడిపోయినట్టు అనిపిస్తుంది. సామాజిక రుగ్మతలను ప్రతిబింబిస్తాడు కాబట్టి, తిరుగుబాటు తప్పదని ఆయన రచనలు చదువుతున్న ప్రతి ఒక్కరూ గట్టిగా నమ్ముతారు. అలాంటి రోజు రావాలని మనసారా కోరుకుంటారు. తాను చెప్పాలనుకున్నది ఎలాంటి మొహమాటాలు లేకుండా... భయాందోళనకు గురికాకుండా.. భేషజాలకు వెళ్లకుండా నేరుగా చెప్పడం రావిశాస్త్రి నైజం. ఈ శైలికి ఎంతో మంది ఏకలవ్య శిష్యులు ఉన్నారు. సమాజంతో పాటు తాను కూడా మారడం ఆయన ప్రత్యేకత. అందుకే, సమకాలీన అంశాలపట్ల అవగాహన ఎక్కువ. నిశితంగా గమనిస్తే, కాలం గడుస్తున్నకొద్దీ, ఆయన రచనల్లో చోటు చేసుకున్న వైవిధ్యాలు కనిపిస్తాయి. 'అప్‌డేట్' కావడం రావిశాస్త్రికి తెలిసినంతగా మరెవరికీ తెలియదేమో! గొప్ప కంటెంట్, లోతైన భావాలు, వైవిధ్యమైన చిత్రాలు, స్థానిక భాష ఆయనను విశిష్ట రచయితగా నిలబెడతాయి. ఆయనకు పేదలు ఆప్తులు. శ్రామికులు ఆరాధ్యులు. సమాజ లోపాలు శత్రువులు. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి జీవన చిత్రణే కథావస్తువు. ఈవర్గానికి చెందిన వారి జీవితాలలోని సమస్యలు వాటికి కారణాలను వెతుకుతూ అందులోని జీవనవైఫల్యం, అంతర్లీనంగా ఉన్న విషాదం, మానవ సంబంధాలను ఆర్థిక కారణాలు ఎలా ప్రభావితం చేస్తాయో ఆయన కథలు, నవలలు చూపిస్తాయి. ఈ కారణంగానే, 'రావిశాస్త్రీయం' ఓ తత్వశాస్త్రమైంది. సైద్ధాంతిక ఆలోచనా విధానంగా మారింది. కోర్టుల్లో అనుసరిస్తున్న విధానాలను ఆయన నిరసించారు. పోలీసు వ్యవస్థపై విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ వ్యవస్థలన్నీ పేదలకు వ్యతిరేంగా ఉన్నాయని, సామాన్యుడికి అందుబాటులో ఉండకుండా పోతున్నాయని మథనపడ్డారు. కలానికి పదునుపెట్టి.. సమస్యలను రంగరించి.. సమభావ అవసరాన్ని ప్రచారం చేశారు. ధనవంతులు, పలుకుబడిగల వారికి చట్టాలు ఏ విధంగా సహకరిస్తున్నాయో, సామాన్యులను ఏ విధంగా కుంగదీస్తున్నాయో ఆయన తన రచనల్లో ప్రస్తావించారు. విశ్లేషించారు. మార్పు అవసరాన్ని ఎలుగెత్తి చాటారు. మార్క్సిస్టు సిద్ధాంతాలతో ప్రభావితమైన ఆయన, చివరి వరకూ అదే పంథాను అనుసరించారు. ప్రజా హక్కుల కోసం పోరాటాలు చేశారు. అప్పటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ దేశంలో అత్యవసర పరిస్థితి విధించినప్పుడు, రావిశాస్త్రి కూడా జైలు శిక్ష అనుభవించారు. అయినప్పటికీ ఆయన తీరు మార్చుకోలేదు. సమాజంలో నిత్యమూ పై తరగతులవారి అన్యాయాలకు, దౌర్జన్యాలకు గుర్రై చిత్ర హింసలు పడుతున్న దీన, హీన ప్రజల తరపున తన ప్రతి రచనలోను వకాల్తా పుచ్చుకున్నారు. వారి సాంఘిక, ఆర్థిక న్యాయం కోసం వాదించారు. సమాజం అట్టడుగు పొరల్లో, అనుక్షణం భయపడుతూ జీవించేవారికి అండగా నిలిచారు. నాటి మద్రాసు రాష్ట్రం పరిధిలో, 1937లో విధించిన మద్య నిషేధం, భారత స్వాతంత్ర్యానంతరం కూడా కొనసాగింది. 1971లో దానిని అధికారికంగా రద్దు చేశారు. మద్య నిషేధం అమల్లో ఉన్న 1960 దశకాల్లో చాలా మంది మద్యం సరఫరాను పేదలతో కొనసాగించేవారు. చిన్నపిల్లలు, మహిళలను కూడా డబ్బు ఆశ చూపించి.. బెదిరించి ఈ ప్రమాదకర వ్యాపారంలో పావులుగా వాడుకునేవారు. ఎన్నో కేసులు ఎదుర్కొనేవారు. న్యాయవాదిగా ఎన్నో కేసులు చూసిన రావిశాస్త్రికి పేదరికమే వారిని మద్యం అక్రమ రవాణాదారులుగా మార్చిందని అర్థమైంది. సంఘంలో జరుగుతున్న అన్యాయాలకు బలవుతున్నది అలగా జనమేనని, డబ్బు పదవి, పలుకుబడి ఉన్నవారు నిజంగా తప్పు చేసినా తప్పించుకోగలుగుతున్నారని తెలుసుకున్నారు. పట్టించుకునేవారు లేక జైల్లోనే మగ్గుతున్న ఎంతో మందికి రావిశాస్త్రి ఆశాదీపమయ్యారు. వారి తరఫున వాదించి, పేదల పక్షపాతి అనిపించుకున్నారు. ఈ అంశాలే ఆయన రచనల్లోనూ ప్రధానంగా నిలుస్తాయి. ఆయన రచనలు అప్పటి మధ్యతరగతి, దిగువ, పేద వర్గాల జీవితాల్లోకి తొంగిచూస్తాయి. సామాజిక నిర్మాణాన్ని లోతుగా అధ్యయనం చేస్తాయి. విశ్లేషించి, ధనం, పలుకుబడి, అధికారం సాగిస్తున్న అకృత్యాలను ఎండగడతాయి. 'రచయిత ప్రతివాడు తాను వ్రాస్తున్నది ఏమంచికి హాని కలిగిస్తుందో, ఏ చెడ్డకు ఉపకారం చేస్తుందో అని ఆలోచించవలసిన అవసరం వుందని నేను తలుస్తాను, మంచికిహాని, చెడ్డకు సహాయమూ చెయ్యకూడదని నేను భావిస్తాను' అంటారు రావిశాస్త్రి. పీడిత, తాడిత ప్రజల పక్షాన న్యాయంకోసం పోరాడి, విరసం వ్యవస్థాపకుల్లో ప్రముఖుడిగా నిలిచి, పతితుల కోసం, భ్రష్టుల కోసం, బాధాసర్పదష్టుల కోసం దగాపడ్డ తమ్ముల కోసం, చల్లారిన సంసారాల కోసం, చీకట్లు ముసిరిన బతుకుల కోసం.. తుది శ్వాసవరకు అవిశ్రాంతంగా ఉద్యమించారు. మనుషుల మనస్తత్వాలను అద్భుతంగా ఆవిష్కరించే ఆయన రచనలు అప్పుడేకాదు.. ఇప్పుడు కూడా మార్గదర్శకాలే. పేదలపై జరిగే అన్యాయాలను ఖండించే కరవాలాలే. 'బాకీ కథలు' పేరుతో వచ్చిన సంపుటిలోని 'వేతనశర్మ', 'షోకుపిల్లి', 'పిపీలికం' వంటి కథలు ఆయనపై మార్క్సిస్టు భావజాల ప్రభావానికి నిదర్శనాలు. తాను నమ్మిన సిద్ధాంతాలకు గౌరవం ఇస్తారు కాబట్టే తన రచనా కళకు దక్కిన ప్రభుత్వగౌరవాలను, కళా ప్రపూర్ణ బిరుదునూ తిరస్కరించారు. ఆయన ప్రజల మనిషి. ప్రజల్లో మనిషి. పేదల పక్షపాతి. ఆయన అనుకున్నదే రాశారు. రాసినదే ఆచరించారు. గొప్ప సాహితీస్రష్టగా చరిత్రపుటల్లో నిలిచిపోతారు.




**(నవంబర్ 10న రావిశాస్త్రి వర్ధంతి)**

**– సత్యశ్రీ**

## చదవాల్సిన పుస్తకం

## నిత్య 'సత్యాన్వేషి' రఘురామ్




సమాజం మీద బలమైన ముద్ర వేసే శక్తి దృశ్య రూపానికి ఎక్కువ. అందుకే, సాహిత్యంలో నాటక ప్రక్రియ ప్రత్యేకతను సంతరించుకుంది. అందుకేనేమో, ఎన్నో రచనలు చేసిన చిలువేరు రఘురామ్ బుద్ధిడి గురించి చెప్పడానికి నాటకాన్ని ఎంచుకున్నారు. కథామూలం డి.నటరాజ్ శాక్యదే అయినప్పటికీ, నాటకీకరణలో విలక్షణ రీతిని అవలంభించారు. సంభాషణల్లో పదును జోడించారు. నాటకంలో మొత్తం 16 దృశ్యాలు. బాల సిద్ధార్థుడు 12వ పుట్టిన రోజు వేడుకలతో ప్రారంభమై, అతను సన్యశించి మహాభినిష్క్రమణ వరకూ కొనసాగుతుంది. హంసతూలికా తల్పాలపైన పవళిస్తూ, రాజభోగాలు అనుభవించాల్సిన యువరాజు సిద్ధార్థుడు సన్యశించి, జోలెపట్టి తథాగతుడిగా మారిన వైనాన్ని రచయిత దృశ్య రూపంలో చూపేందుకు అవసరమైన అన్ని హంగులను, వివరాలను ఇందులో పొందుపరిచారు. సహజంగా రచయితలు తమ పుస్తకంలోని అంశాలను, కనీసం ఏ ఒక్క భాగాన్ని కూడా ఎవరూ, ఎక్కడా ఉపయోగించుకోకూడదని పేర్కొంటూ, కాపీరైట్ అస్త్రాన్ని ప్రయోగిస్తారు. కానీ, రఘురామ్ ఇందుకు భిన్నంగా స్వచ్ఛంద అనుమతి ప్రదానం చేశారు. పుస్తకంలోని ఏ భాగాన్నయినా స్వేచ్ఛగా వాడుకోవచ్చని, అందుకు సంతోషంగా అంగీకరిస్తున్నానని ప్రకటించారు. మతం పేరుతో మారణకాండ కొనసాగుతున్న ఈకాలంలో బుద్ధుడి ఆలోచనలు, సిద్ధాంతాలు ఆచరణీయమన్న వాదన బలపడుతున్నది. ఇలాంటి కాలంలోనే నటరాజ్ శాక్య రాసిన 'గౌతమ బుద్ధుడు' గ్రంథంలో కొంత భాగాన్ని తీసుకొని, నాటక రూపంలో అనువదించిన రఘురామ్ నుంచి తదుపరి నాటకాలు వస్తాయని, బుద్ధుడి జీవిత చరిత్ర మాత్రమేగాక, ఆయన సూత్రాలను కూడా అందులో వివరిస్తారని ఆశిద్దాం.

## ప్రగతిశీల కవితాధార 'ఎదురీత'

సామాజిక స్పృహతో, మార్పుకోసం నిరంతరం తపనపడే కవి గోలి మధు కలం నుంచి జాలువారిన ప్రగతిశీల కవితాధార 'ఎదురీత'. ఇందులోని ఆణిముత్యాల్లాంటి 55 కవితలు వేటికవే సాటి. అభ్యుదయ భావాలను ప్రతిబింబించడంలో మేటి. ఆయన కవిత్వంలో ఉగాది కోయిల గాయపడుతుంది. కవిత్వమై కూస్తుంది. గుండె గాయాల లోతుల్ని లోకానికి చాటాలని గొంతెత్తి గానం చేస్తుంది. తొలి కవితలోనే లోతైన భావాన్ని, సమస్యల ప్రభావాన్ని, చెడిపోతున్న సంఘాన్ని మనం చూడగలుగుతాం. రచయిత ఆంతర్యాన్ని ఆంతర్యాన్ని అర్థం చేసుకోగలుగుతాం. గ్రామీణ జీవనం ధ్వంసమై, పుట్టుకొచ్చిన దుర్మార్గపు విష సంస్కృతిని 'వికాసం' కవితలో కళ్లకుకడతారు రచయిత. రోజురోజుకూ దిగజారిపోతున్న దేశ ఆర్థిక పరిస్థితిని, రైతు కష్టాలను ప్రస్తావిస్తాడు మరో కవితలో.

**'మనిషి చుట్టూ మతం చుట్టి**
**మానవత్వం మంటగలుస్తుంటే**
**మరణశయ్యకు చేరువవుతున్నాయా**
**ప్రజాస్వామ్యమా?' అని ఆవేదన వ్యక్తం చేస్తారు. అదే సమయంలో ..**
**'నీ చెట్టు కొమ్మల్ని ఓటు కడవలిగా**
**తన బిడ్డలకు ఇవ్వబోతుంది'** అంటూ 'ప్రజాస్వామ్యమా.. దిగులు పడకు' అని భరోసానిస్తాడు. మణిపూర్‌లో తెగుతున్న తలలను, తడిగుడ్డతో గొంతులు తెగుతున్న వైనాన్ని.. వినోదం చూసే జనాన్ని కూడా ప్రస్తావిస్తారు. వాక్ స్వాతంత్ర్యం నోటికి పడిన తాళాన్ని, భావ ప్రకటన గుండెకు పడిన గొళ్లాన్ని చూస్తారు. మది గ్రంథాలయం నుంచి రోషం పౌరుషాల జ్వాలల్ని తీయాలని, కొత్తదారులు వేయాలని ప్రబోధిస్తారు. ఎగసిపడుతున్న నిరంకుశ జ్వాలల్ని చూస్తాడు. చైతన్య స్రవంతి జనావళిని తడుపుతునే ఉన్న వైనాన్ని గ్రహిస్తారు.





**'మహనీయులు వేసిన**
**రహదారి ధ్వంసమై**
**అరాచకం సృష్టించిన**
**గుంటలే ఎటు చూసినా..**
**దేశం రోడ్డు పక్కన**
**బక్కచిక్కిన శవాల గుట్టలు**
**పోగయ్యాయి..'** అనే భావం లోతుల్ని తడిమి చూడాలంటే ఈ పుస్తకాన్ని చదవాల్సిందే. దేశ ఆర్థిక వ్యవస్థను అల్లకల్లోలం చేస్తున్న కార్పొరేట్ సామ్రాజ్యాధిపతులను 'తేరగ తిని తెగ బలిసిన ఆంబోతులు'తో పోలుస్తాడు. అధికారాన్ని ఉపయోగించి, అడ్డంగా కొనసాగిస్తున్న దోపిడీని ప్రశ్నిస్తారు. పంట అంతా ధాన్యాగారం చేరాక, పందికొక్కులు చేరడంతో, తినడానికి తిండి కరువైందని దోపిడీ విధానాలపై పదునైన పదజాలంతో విరుచుకుపడతారు. రాజ్యాంగ వృక్షం కింద, ప్రజాస్వామ్యం నీడన విషపూరిత శక్తుల రంపపు కోతను వివరిస్తారు 'ప్రభంజనం' కవితలో.. స్వేచ్ఛా వాయువులే కరువైన సమాజానికి జన చైతన్యం ప్రభంజనమైతేనే మంచి భవిష్యత్తు ఉంటుందని నొక్కి చెప్తారు. పార్టీలు మారే రాజకీయ నాయకుల వికృత రూపాన్ని ఆవిష్కరిస్తారు. చెమట చుక్కను కూడా దోచుకుంటున్న పెద్దల చరిత్రను నిగ్గదీస్తారు. తన 'ఎదురీత' గురించి వివరిస్తూ..



**'పాలకుల చేతిలో**
**తోలుబొమ్మలాటకు'...**
**'చమట చుక్కల సిరుల ప్రయాణం**
**కొందరి కాళ్ల కిందకే**
**సాగుతున్న ప్రవాహానికి'..**
**'భావ ప్రకటన హక్కు**
**సంహరించే**
**మొసళ్లు తిరుగాడే సాగరాన**
**ప్రగతిశీలశక్తితో సాగే'** ప్రస్థానమని స్పష్టం చేస్తారు.

సూక్ష్మంగా చెప్పాలంటే, సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా... దోపిడీకారుల అక్రమాలకు వ్యతిరేకంగా.. కులాలు, మతాల పేరుతో జరుగుతున్న అణచివేతకు వ్యతిరేకంగా... భావ ప్రకటన స్వేచ్ఛను హరించే శక్తులకు వ్యతిరేకంగా గోలి మధు ఎదురీత కొనసాగింది. ఆశాభావంతో కూడిన 'ముగింపు' కొత్త లోకాలకు తలుపులు తెరుస్తుంది. ప్రతి కవితలోనూ ప్రగతిశీల భావాలు తొణికిసలాడే ఈ సంకలనం తప్పక చదవాల్సిన పుస్తకం.

## ఇగ్బో సంస్కృతికి దర్పణం 'థింగ్స్ ఫాల్ అపార్ట్'




చినువా అచేబే రచించిన 'థింగ్స్ ఫాల్ అపార్ట్' నవల 1958లో ప్రచురితమైంది. ఈ నవల నైజీరియా దేశంలోని ఇగ్బో ప్రజల సంప్రదాయ జీవనం, సంస్కృతి, యూరోపియన్ వలస పాలన వల్ల వచ్చిన మార్పుల నేపథ్యంలో సాగుతుంది. కథ ప్రధానంగా ఉముఫియా అనే గ్రామంలో జరుగుతుంది. కథానాయకుడు ఒకొంక్వో ఓ గొప్ప ధైర్యవంతుడు. కష్టపడి తన పేరు తెచ్చుకున్న వ్యక్తి. అతని తండ్రి ఉనోకా బలహీనుడు, అప్పులపాలైనవాడు. అందుకే ఒకొంక్వో జీవితమంతా తన తండ్రి లాంటి బలహీనుడు కాకూడదనే ప్రయత్నం చేస్తాడు. ఈ నవల ప్రథమ భాగంలో ఇగ్బో సమాజంలోని సంప్రదాయాలు, పండుగలు, న్యాయవ్యవస్థ, బంధుత్వాలను రచయిత ఎంతో వాస్తవికతో చిత్రించాడు. ఒకొంక్వో స్వయం కృషితో ఎదుగుతాడు. గౌరవం సంపాదిస్తాడు. కానీ, అతని అహంకారం, కఠినత అతని జీవితాన్ని నాశనం చేస్తాయి. అనుకోకుండా ఒక మనిషిని చంపడం వల్ల అతని జీవితంలో ఎదురైన దురదృష్టకర సంఘటన, ఫలితంగా ఊరి నుంచి ఏడు సంవత్సరాల బహిష్కరణను ద్వితీయ భాగంలో వివరిస్తాడు. తృతీయ భాగంలో యూరోపియన్ మిషనరీలు, బ్రిటిష్ ప్రభుత్వం ఇగ్బో సమాజంలోకి ప్రవేశించిన వైనాన్ని ఆవిష్కరిస్తాడు. కొత్త మతం, పాశ్చాత్య పాలనా విధానం కారణంగా స్థానిక సంప్రదాయాలు విచ్ఛిన్నమైన రీతిని వర్ణిస్తాడు. చివరికి, తన ప్రపంచం కూలిపోతుందనే భావనతో ఒకొంక్వో ఆత్మహత్య చేసుకుంటాడు. మొత్తం మీద ఈ నవలలో సాంప్రదాయాలు, ఆధునికత మధ్య వైవిధ్యాలు కనిపిస్తాయి. పాత ఇగ్బో సంస్కృతిని యూరోపియన్ వలస పాలన చెరిపివేసిన విధానాన్ని ఈ నవల వివరిస్తుంది. అదే విధంగా పురుషాధిక్య దృక్పథం అంతర్లీనంగా ఉంటుంది. ఒకొంక్వో లాంటి వ్యక్తి బలహీనతని ద్వేషించడం వల్ల తన కుటుంబానికి, తనకే నష్టం చేసుకునే వైనాన్ని కళ్లకు కడుతుంది. సమాజం మారినప్పుడు వ్యక్తులు ఆ మార్పుతో ఎలా పోరాడతారన్నది ప్రధాన ప్రశ్న. సాంస్కృతిక సంఘర్షణ ఇందులోని ప్రధాన ఇతివృత్తాల్లో ఒకటి. పాశ్చాత్య పోకడలు.. ఆఫ్రికా విలువల మధ్య పోరు ఈ నవలలో ప్రతిబింబిస్తాయి. ఈ రచనలో అచేబే భాష సజీవంగా, సాంస్కృతిక సందర్భాలతో నిండుగా ఉంటుంది. ఆయన ఇగ్బో పదాలు, సామెతలు, కథలు ఉపయోగించి ఆఫ్రికన్ స్వరాన్ని కాపాడాడు. ఏ సంస్కృతీ శాశ్వతం కాదని, కానీ దానిని బలవంతంగా మారిస్తే అది కూలిపోతుందని అంటాడు. ఈ నవలలో అచేబే పాశ్చాత్య వలసవాదం ఆఫ్రికా సంస్కృతిపై చూపిన ప్రభావాన్ని, స్థానిక ప్రజల మనస్తత్వాన్ని అద్భుతంగా చిత్రించాడు. గిరిజన తెగల సంప్రదాయాలు, విశ్వాసాలు, వారి ఉత్సవాలు, ఆడవారి మనోభావాలు, వారి కష్ట సుఖాలు, పిల్లల కోసం తల్లిదండ్రులు పడే ఆరాటాలు, ప్రకృతితో ఆ గిరిజనుల జీవన పోరాటం ఇలా అన్నీ కళ్లకు కట్టినట్లు చూపించాడు. ప్రపంచ వ్యాప్తంగా కనీసం 50 భాషల్లోకి అనువాదమైందంటే, ఈ నవల గొప్పతనం ఏమిటో అర్థమవుతుంది. ఆఫ్రికాకు చెందిన ఏ ఇతర రచయిత రచనలు ఇన్ని ప్రపంచ దేశాలకు చేరలేదు. 'థింగ్స్ ఫాల్ అపార్ట్' తర్వాత చాల కాలం వరకు ఆయన మరో ప్రధాన రచన చేయలేదు. 1987లో మాత్రమే ఆయన రాసిన 'యాంట్ హిల్స్ ఆఫ్‌ది సవన్నా' నవల వెలువడింది. అచెబె ఇంగ్లీషులోనే రచనలు చేసే వాడు. ఎందుకంటే 200కు పైగా విభిన్నమైన భాషలు మాట్లాడే ఆఫ్రికా ప్రజలందరికీ అవి చేరాలంటే ఇంగ్లీషులో రాయడమే ఉత్తమమైన మార్గమని ఆయన భావించాడు. విశేషమేమంటే ఎన్నో ప్రపంచ భాషల్లోకి తన రచనలను అనువదించడానికి అనుమతించిన అచెబె తన మాతృభాష ఈబోలోకి మాత్రం వాటిని అనువదించడానికి ఇటీవలి వరకు అంగీకరించలేదు. మూల భాషను వలసపాలకులు భ్రష్టు పట్టించారని, అలాంటి అపభ్రంశపు భాషలోకి తన రచనలను అనుమతించనని ఆయన చెప్పేవాడు. తన మూలాల పట్ల ఆయనకున్న ప్రగాఢ అభిమానానికి ఇదో నిదర్శనం.

> **'నేను స్కూలుకు వెళ్లడం మొదలు పెట్టి రాయడం, చదవడం నేర్చుకునే సమయానికి ఇతర దేశాల ప్రజల గాథలు మాత్రమే తెలుసు కోగలిగేవాడిని. అవన్నీ శ్వేత జాతీయుల మంచితనం గురించే ఉండేవి. సహజంగా నేను కూడ శ్వేత జాతీయులంత మంచివారు లేరని నమ్మేవాడిని. వారే తెలివికలవారు, మిగతా వారంతా వెర్రివారని భావించేవాడిని. అప్పుడే నాకనిపించింది, అసలు మనకంటూ మన కథలుండాలి కదా అని. నాకు ప్రసిద్ధ సామెత గుర్తుకు వచ్చింది. సింహానికి తన చరిత్ర తనకు తెలియకపోతే, వేటగాడి చరిత్రే ఎల్లప్పుడూ కీర్తించబడుతుందన్నది ఆ సామెత'.**

## ఆఫ్రికన్ ఆత్మను ప్రతిబింబించిన 'ఆచెబే'

ఆఫ్రికన్ సాహిత్య పితామహుడిగా పేరు పొందిన గొప్ప రచయిత చినువా ఆచెబే (16 నవంబర్ 1930– 21 మార్చి 2013). అతని రచనల్లో ఆఫ్రికన్ ఆత్మ ప్రతిబింబిస్తుంది. అందుకే, ఆయన కేవలం ఒక రచయిత మాత్రమే కాదు... ఒక సంస్కృతికి స్వరం కూడా. పాశ్చాత్య వలసవాద దృష్టిలో అనాగరిక ఖండంగా చిత్రీకరించబడిన ఆఫ్రికా గురించి ప్రపంచానికి నిజమైన రూపాన్ని చూపించినవాడు ఆచెబే. అతని రచనలు ఆఫ్రికన్ జీవన విధానాన్ని, సంస్కృతిని, నమ్మకాలను, మానవీయ విలువలను అద్భుతంగా ప్రతిబింబిస్తాయి. సాహిత్యంలో సాంస్కృతిక పునరావిష్కరణ చేసిన గొప్ప రచయిత ఆచెబే. అతని రచనలు ప్రధానంగా నైజీరియాలోని ఇగ్బో జాతి సంస్కృతిని కేంద్రంగా చేసుకుని ఉంటాయి. పాశ్చాత్య మిషనరీలు, వలస పాలకులు ప్రవేశించిన తరువాత ఆఫ్రికన్ సమాజంలో జరిగిన మార్పులను సున్నితంగా చిత్రీకరిస్తాడు. 'థింగ్స్ ఫాల్ అపార్ట్' నవలలో ఓకోంక్వో అనే పాత్ర ద్వారా, వలసవాదం ఎలా ఒక సంప్రదాయ సమాజాన్ని అంతర్గతంగా చీల్చేసిందో అద్భుతంగా వివరిస్తాడు. ఆచెబే యొక్క అత్యంత విలువైన సాహిత్య కృషిలో ఒకటిగా ఆయన భాషా ప్రయోగాన్ని పేర్కోవాలి. ఆయన ఆంగ్ల భాషలో రచనలు చేసినా, ఆఫ్రికన్ లింగ్విస్టిక్ రిథమ్‌ను అందులో కలిపేస్తాడు. ఇగ్బో సుభాషితాలు, సామెతలు, స్థానిక పలుకుబడులు ఆయన వాక్య నిర్మాణంలో సజీవంగా ఉంటాయి. దీని వల్ల పాఠకుడు ఆ సంస్కృతిలోని శబ్దాలు, వాసనలు, భావాలు నేరుగా అనుభవించగలుగుతాడు. ఆచెబే సాహిత్యంలో రాజకీయ అవగాహన కూడా లోతుగా ఉంటుంది. అతని రచనలు ఐరోపాకు చెందిన జోసెఫ్ కాన్రాడ్ వంటి రచయితల ద్వారా ఆఫ్రికా ప్రతిబింబంపై ప్రత్యామ్నాయ వాదాన్ని నిర్మించాయి. ఆయన చూపించిన ఆఫ్రికా చీకటి ఖండం కాదు, జీవంతో నిండిన, తత్త్వదృష్టి కలిగిన మానవ సమాజం. అతను తన రచనల్లో మనుషుల మధ్య తేడాలను కాకుండా, మానవ సంబంధాల మాధుర్యాన్ని ప్రధానంగా ప్రోత్సహించాడు. ఆయన నవలలు శత్రుత్వం, గౌరవం, కుటుంబ బంధాలు, భయాలు, ఆశలు వంటి మానవ భావాలను అత్యంత నిజాయితీగా ప్రతిబింబిస్తాయి. ఆచెబే సాహిత్యం ఆఫ్రికన్ మానవతా చింతనకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఆయన కలం ద్వారా ఒక ఖండం తన స్వరాన్ని తిరిగి పొందింది. ఆయన రచనలు నేటికీ వలసవాదానంతర ప్రపంచ సాహిత్యంలో స్వరాన్ని ఇచ్చే బలమైన ప్రతిధ్వనిగా నిలిచాయి.



**(నవంబర్ 16 ఆచెబే జయంతి)**

**ఈ వారం కవితలు**

## పలకరింపుల పులకరింపు

నా ఆగమనానికి స్వాగతాలా అన్నట్టు
ఇంటినుంచి బయటకొస్తానా...
ఎన్నెన్ని ఆత్మీయతాదృక్కుల
నవ్వులపువ్వులు
నన్ను అనురాగంగా స్పృశిస్తాయో
తెలుసా?
కళ్లతోనే ...
నా మనసును నిమిరిపోతాయి కొన్ని,
చెంతకొచ్చి ఆలింగనం చేసుకుపోతాయి
మరికొన్ని.

అయితే...
వాటిల్లో కొన్నే స్ఫురణకొస్తాయి.
కొన్ని చిరునవ్వులకు బదులుగా
చిరునగవు చిందిస్తూ
నే ముందుకు సాగినా,
లోలోపల మదిలో వెతుకులాట
మొదలవుతుంది వాటిగురించి.

నా వృత్తిజీవితంలో, ఎప్పుడో ఎక్కడో
నా సేవలందుకున్నవో
లేదా
అవి నా కవితా సుమసుగంధ సౌరభాలను
ఆఘ్రాణించినవేమోననిపిస్తుంది.
నాకు స్ఫురించకున్నా,
నా రూపాన్ని భద్రంగా దాచుకున్న హృద
యాలవి.

నా స్మృతిపొరలనుంచి అవి తొలగినా,
మనిషిని మనిషి పట్టించుకోని
ఈ కాలంలో...
పదిలంగా నన్ను స్ఫురణలో దాచుకోవడం,
దారిన పోతున్న నన్ను
ఆప్యాయంగా పలకరించడం,
ఏ జన్మపుణ్యమో! ఏ సేవల ఫలమో?

ఆ అభిమానధనాన్ని ఎలా కొలవనూ!

**– వేమూరి శ్రీనివాస్**

## కొలతలివిగో

కలే కదా
ఇదంతా కలే కదా
ఇంకా వినపడుతున్నాయా నీకు
ఆ.. ఆర్తనాదాల శ్రావ్యగీతాలు
మనసు మూసేసుకున్నావు కదా
ఎందుకంటే నువ్వు చీకటి కాగడాలో
మసి చూరిన కలలను వెతికే
ఆశవాదివి కదా
ఎందుకలా మొహం తిప్పుకుంటావ్
ఇదిగో ఇక్కడ ఫొటోలు తియ్యి
మెరిసే నా దేహం మసిబారక కూడదు సుమా!
ఇదిగో ఇక్కడ చూడు
కుటిల పరిహాసపు
నగ్న కీలలలో
మసి పట్టిన సాక్ష్యపు ఆనవాలు
ఎంత ఓపికో నాకు
గొంతు నొక్కేసుకుని మరీ వెతుకుతున్నా
ఎడారి పట్టిన మనసుల్ని తవ్వి తీస్తూ



దప్పిక పట్టిన చేతుల కోసం
నీటి చలమల్లే అక్కడే ఆగిపోయా
ఎండమావి ఎప్పుడూ
నువ్వు పట్టిన సమాజమే సుమా
ఎందుకో నిదుర వస్తోంది
ఉలికిపాటు నైనా
నిన్ను కలగా కంటూనే ఉంటాను
ఒట్టు నేస్తం
నేనింకా బతికే ఉన్నా
నువ్వు ఆగి ఆగి చూసే చూపులలో
ఒక వేకువ రాలిపోయిందని చెప్పడానికి


**– పి.సురేందర్**

## నేటి కాలంతో ..

అలల ప్రయాణంలో మునకలేస్తూ
కాలాన్ని తోచుకుంటూ గడపాలి
మనిషి కాని మనిషి జతలో తిరుగుతూ
మానవత్వాన్ని బ్రతికించుకోవాలి
చేతనైతే మార్పు లేకుంటే మారిపో
నినాదాల పోరుతో ఏకమై సాగాలి

కొత్త కొత్త కళల నైపుణ్యంతో కలిసిపోయి
కొన్ని మెళకువలు నేర్చుకుని రావాలి
మాటలతో కోటలు మౌనంతో ఆటలు
ప్రతి నిర్మాణం వెనుక ఒక తీర్మాణం
పేరాలుగా రెపరెపలాడిపోవాలి

నేటి కాలంతో మమేకమైపోతూ
రంగుల హంగులతో ఉప్పొంగిపోతూ
కరిగిపోయే కొవ్వొత్తిని నమ్ముకోవాలి
విరిగిపోయే పాలతో పట్టాభిషేకం
చప్పట్లతో ప్రశంసిస్తూ జరిపించుకోవాలి



నమ్మకానికి తొడుగులు తొడిగి
ఎండమావులే మేఘాలని మురిసిపోవాలి
మాటల వెల్లువలో కొట్టుకుపోతూనే
గంగార్పణకు అంకురార్పణ చేయాలి
మనిషితనాన్ని మరచిపోతూ నడుచుకునే
అమానవీయపు వలలో చిక్కుకుపోవాలి
ఆశల పల్లకి ఎక్కి ఊరేగుతూనే
కళ్లెం తెగిన గుర్రమై పరుగులు పెట్టాలి

నేటి కాలంతో చేయి కలపడమంటే
ముళ్ళ చెట్టును ఆలింగనం చేసినట్టే
తీరాన్ని తాకిన తుఫానులా రేగిపోతూనే
బురద మట్టిలో వజ్రాల వేట కొనసాగించాలి
కళ్ళు నులుముకుని పొరలు పొరలుగా
లోకాన్ని చూసి బిత్తరపోవాలి
కాలంతో కలిసి వుండలేమని నిర్ధారించాలి

**– నరెద్దుల రాజారెడ్డి**

## బ్రిడ్జి నిర్మాణం చేపట్టండి సారూ..

ప్రజాపక్షం/కొందుర్గు: బ్రిడ్జి నిర్మానం పనులు త్వరగా చేపట్టేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కొందుర్గు మండల పరిధిలోని గ్రామానికి వెళ్ళె రహదారిలో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించి వెళ్ళిపోయారు. ఉన్న రోడ్డును తవ్వి బ్రిడ్జి నిర్మాణానికి పిల్లర్లు వేశారు. కానీ ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయని, బ్రిడ్జి నిర్మాణ కాంట్రాక్టర్ కనిపించకుండా పోయాడని గ్రామస్తులు పేర్కొన్నారు మూడు నెలల్లో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తానని చెప్పిన కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు నిలిపి వెళ్ళిపోవడంలో అంతర్యమేమిటో చెప్పాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి మొత్తం రూ.2కోట్ల వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉందని, కానీ ప్రభుత్వం రూ.1.26కోట్ల నిధులు మాత్రమే విడుదల చేసిందని, దాంతోనే కాంట్రాక్టర్ వెళ్ళిపోయి ఉంటారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే ఒక్కసారి గ్రామ బ్రిడ్జిపై దృష్టి పెట్టి పనులు ప్రారంభమయ్యే విధంగా చూడాలని కోరుతున్నారు. పొలాల నుండి ఇంటికి పంటలు తీసుకురావాలంటే ఇబ్బందులు పడాల్సి ఉందని, అధికారులు చర్యలు తీసుకొని పనులు ప్రారంభమయ్యే విధంగా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## దివ్యాంగులకు ఇచ్చిన హామీలు సకాలంలో అమలు చేయాలి

ప్రజాపక్షం/షాద్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎన్‌పిఆర్‌డి షాద్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు చేగూరి శేఖర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శేఖర్ గౌడ్ మాట్లాడుతూ పాత పింఛన్లను పెంచడంతోపాటు కొత్త పింఛన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్న నేటికి ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. ఈనెల 12న షాద్‌నగర్‌లో జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని అన్నినియోజక వర్గాల నుండి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశానికి విహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

## సిఆర్ ఫౌండేషన్‌కు డిజిటల్ తెలుగు పుస్తకాలతో కంప్యూటర్ అందజేత




ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : మనసు ఫౌండేషన్ కు చెందిన మన్నం వెంకట రాయుడు ఆధివారం సిఆర్ ఫౌండేషన్‌లోని ఎన్‌ఆర్‌ఆర్ పరిశోధన కేంద్రంలోని పిల్లల లైబ్రెరి, సురవరం సుధాకర్ రెడ్డి లైబ్రెరీని సందర్శించారు. ఈ సందర్శన సందర్భంగా పిల్లల 4,500 తెలుగు డిజిటల్ పుస్తకాలతో ఫ్రీలోడ్ చేయబడిన కంప్యూటర్‌ను పిల్లల లైబ్రరికి విరాళంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని ప్రోత్సహించడం, రక్షించడం మనసు ఫౌండేషన్ లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తదుపరి ఎన్‌ఆర్ ఆర్ పరిశోధన కేంద్రం డైరెక్టర్ టి. సురేష్ బాబు మనసు ఫౌండేషన్ వెంకట రాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సురేష్ బాబు మాట్లాడుతూ విద్యను, అక్షరాస్యతను ప్రోత్సహించడంలో ఎన్‌ఆర్‌ఆర్ పరిశోధన కేంద్రం ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఆర్ పరిశోధన కేంద్రం డైరెక్టర్ సురేష్ బాబుతో పాటు కమిటీ సభ్యులు డాక్టర్ విజయలక్ష్మి, శ్రీమతి జ్యోత్స్న, ఎన్. కొండయ్య, కె. అజయ్ కుమార్, ఎం . చంద్రమౌళి, మనసు ఫౌండేషన్‌కు చేందిన రాము, బాలజీ పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతమే ధ్యేయం

సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య




ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం ఆదివారం మాదాపూర్‌లోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో శేరిలింగంపల్లి మండల సిపిఐ కార్యదర్శిగా చందుయాదవ్‌ను, సహాయకార్యదర్శిగా జెట్టి శ్రీనివాస్, వెంకటేష్‌ను ఎన్నుకున్నారు. అనంతరం పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ సిపిఐ తీసుకునే నిర్ణయాలకు కట్టుబడి ఉండి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ బడుగు, బలహీన వర్గాల పార్టీ అయిన కమ్యూనిష్టు పార్టీ జెండాను గడప, గడపకు తీసుకెళ్ళాలని సూచించారు. రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కార్యదర్శి రామకృష్ణ, సహాయకార్యదర్శి శ్రీనివాస్‌లు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సిపిఐ పార్టీ పటిష్టమైన ప్రణాళికతో ప్రతి సమస్య మీద పోరాటాలు నిర్వహించాలని రానున్న కాలంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సిపిఐ జెండా ఎగురేలా కృషి చేయాలని కోరారు. మాజీ కార్యదర్శి రామకృష్ణ, భవన నిర్మాణ రండారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కూన కాసిం, ఏఐటీయూసీ ఆటో యూనియన్ పాయకులు తుపాకుల రాములు, ప్రజా నాట్య మండలి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కూన సుధాకర్, డిహెచ్‌పిహెచ్ నాయకులు కొండలయ్య, రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కొమ్ము పరమేష్, రంగారెడ్డి, సురేష్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మంటపానికి శంకుస్థాపన



ప్రజాపక్షం/కేశంపేట: అయ్యప్పస్వాముల అన్నదానం కోసం నిర్మించనున్న మండపానికి ఆదివారం మండల కేంద్రంలోని దవళగిరి వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద శంకుస్థాపన చేశారు. గురుస్వాములు తిరుమలయ్య గౌడ్, రమణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, స్వాములు తలసాని పవన్‌కుమార్ రెడ్డి, యుగంధర్, రమేష్, రవి, గోపాల్ యాదవ్‌లు, గ్రామస్తులు మోహన్ రెడ్డి, పండుగౌడ్, దామోదర్‌రెడ్డి, పిల్లి అమరేష్ యాదవ్‌లు పాల్గొన్నారు.

## నివాస ప్రాంతంలో చెత్త గోదాములను తొలగించాలి

శ్రీరమణ కాలనీ సంక్షేమ సంఘం డిమాండ్



ప్రజాపక్షం/ఎల్‌బినగర్: నివాస ప్రాంతంలో చెత్త గోదాములను తక్షణమే తొలగించాలని శ్రీరమణ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎస్. వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కాంతారెడ్డి లు డిమాండ్ చేశారు. ఆదివారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని శ్రీరమణ కాలనీలో చెత్త గోదాములను ఇక్కడి నుంచి తరలించాలని గోదాముల ముందు కాలనీ వాసులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కోశాధికారి ఎస్.మురళిధర్‌రెడ్డి, సభ్యులు కొండల్, సందీప్, రవీందర్ నాయక్, జయదేవ్, శ్రీధర్‌రెడ్డి, ప్రవీణ్, రవీందర్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్: కాలనీల సమస్యల పరిష్కారానికి తమ వంతుగా సహాకారం ఎల్లప్పుడు ఉంటుందని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని జక్కిడి రాంరెడ్డి కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు కార్పొరేటర్ లచ్చిరెడ్డిని వారి నివాసంలో మర్యదపూర్వకంగా కలిసి కాలనీలు సమస్యలు పరిష్కారం చేయాలని వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో జక్కిడి సంజీవరెడ్డి, నాగేందర్, నంద కిషోర్, సంధ్య, రాజేష్, సిద్ధార్థ గౌడ్, లక్ష్మణ్ యాదవ్, ప్రశాంత్‌రెడ్డి, సంతోష్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ప్రోత్సాహక విధానాలతోనే అంతర్జాతీయ క్రీడా పోటీలు

స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి

గచ్చిబౌలిలో ముగిసిన తెలంగాణ ఇండియా ఇంటర్నేషనల్ ఛాలెంజ్ 2025 పోటీలు

బ్యాడ్మింటన్ క్రీడ అభివృద్ధి చెందుతోంది

పుల్లెల గోపిచంద్



ప్రజాపక్షం/రంగారెడ్డి: గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన తెలంగాణ ఇండియా ఇంటర్నేషనల్ చాలెంజ్ 2025 బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం విజయవంతంగా ముగిశాయి.ప్రపంచంలోని పలు దేశాల నుంచి ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని ఉత్కంఠభరిత మ్యాచ్‌లతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ముగింపు కార్యక్రమానికి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి మాట్లాడుతూ "తెలంగాణ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి తీసుకుంటున్న ప్రోత్సాహక విధానాలు దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రీడా మౌలిక వసతులు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతీ ప్రతిభావంతుడికి అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు లభిస్తున్నాయి.ఇలాంటి టోర్నమెంట్‌లు యువ క్రీడాకారులకు గొప్ప ప్రేరణగా నిలుస్తాయి" అని తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ గోపిచంద్ మాట్లాడుతూ "గత కొన్నేళ్లుగా తెలంగాణలో బ్యాడ్మింటన్ క్రీడ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు.ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు, కోచ్‌లు చేస్తున్న కృషి వల్ల క్రీడాకారులు ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందుతున్నారు. రాబోయే కాలంలో తెలంగాణ నుంచి మరిన్ని స్టార్ ప్లేయర్లు వెలుగులోకి వస్తారు అని పేర్కొన్నారు. అనంతరం విజేతలైన భారతీయ,విదేశీ క్రీడాకారులు తమ అనుభవాలను పంచుకున్నారు. నిర్వాహకులు రాష్ట్ర క్రీడా శాఖ, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా,స్పాన్సర్లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో క్రీడా శాఖ అధికారులు, కోచ్‌లు, జాతీయ స్థాయి అంపైర్లు, క్రీడాభిమానులు పెద్దఎత్తున హాజరై పోటీలు విజయవంతంగా ముగిసిన సందర్భంగా క్రీడాకారులను అభినందించారు. విజేతలుగా పురుషల సింగిల్స్ లో భారత ఆటగాడు జిన్‌పాల్ సోన్నా అద్భుత ప్రదర్శనతో మిథున్ మంజునాథ్ (3) పై 219, 2111 తేడాతో విజయం సాధించి టైటిల్ దక్కించుకున్నారు.అదేవిధంగా మహిళల సింగిల్స్ లో మాంసి సింగ్ (భారతదేశం) రక్షిత శ్రీ సంతోష్ రామ్‌రాజ్ (1) పై 219, 2114 తేడాతో గెలిచి మహిళల సింగిల్స్ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. అదేవిధంగా పురుషుల డబుల్స్ హరిహరన్ ఆంసకరుణన్, ఎం.ఆర్.అర్జున్(3) జంట ఫరన్యు కాసామాంగ్ మరియు తన డాన్ పున్‌పనిచ్ (థాయిలాండ్)పై 2114, 2114 తేడాతో విజయం సాధించారు. మహిళల డబుల్స్‌లో థాయిలాండ్ జంట హతైతిప్ మిజాద్‌తోపాటు నపపాకోర్న్ టుంకసతన్ భారత జంట ప్రియా కాంజెంగ్బమ్ మరియు శృతి మిశ్రా(5) పై 2116, 2116 తేడాతో గెలిచి టైటిల్‌ను కైవసం చేసుకోగా,మిక్స్‌డ్ డబుల్స్ లో భారత జంట సాత్విక్ రెడ్డి కనపురం అండ్ రేశిక ఉథయసూరియన్ ఇషాన్ భట్‌నాగర్, ఆరాధన బాలచంద్ర పై 2220,218 తేడాతో గెలిచి మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను సాధించారు.

## సమర్థవంతంగా విధులు

పోలీసు అధికారులకు 'కొత్వాల్ దిశనిర్దేశం'

ప్రజాపక్షం/హైదరాబాద్ : పోలీసు అధికారులు, సిబ్బందికి హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి సజ్జనార్ చేసిన దిశనిర్దేశం వివరాలను సెంట్రల్ జోన్ డిసిపి కె.శిల్పవల్లి వెల్లడించారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ఇటీవలే డిజిపి శివధర్‌రెడ్డి, పోలీసు కమిషనర్ విసి సజ్జనార్ పోలీసు అధికారులు, సిబ్బందికి దిశనిర్దేశం చేశారు. ఈ దిశనిర్దేశాలను వివరించేందుకు సెంట్రల్‌జోన్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బందితో డిసిపి కె.శిల్పవల్లి ఆదివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వారిని ఉద్దేశించి శిల్పవల్లి మాట్లాడుతూ.. విధినిర్వహణలో పోలీసులు ఎలా వ్యవహరించాలి, ఫిర్యాదులు ఎలా స్వీకరించాలి, ప్రజల్లో పోలీసుపై నమ్మకం కలిగించడం తదితర అంశాలను వివరించారు. డిజిపి శివధర్‌రెడ్డి, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ వ్యూహాత్మక దృక్పథానికి అనుగుణంగా సెంట్రల్ జోన్ అధికారుల కార్యాచరణ రోడ్‌మ్యాప్‌ను స్పష్టంగా వివరించారు. మార్గదర్శక సూత్రాలతో పాటు న్యాయమైన, దృఢమైన, స్నేహపూర్వక, ప్రొఫెషనల్ పోలీసింగ్‌ను శిల్పవల్లి వివరించారు. పౌర కేంద్రీకృత, సానుభూతి, సమగ్రతతో నడిచే పోలీసింగ్ సారాంశం పౌర కేంద్రీకృతంగా, సానుభూతితో సమగ్రతతో నడిపించాలన్నారు. ప్రతి అధికారి ప్రవర్తన పనితీరు రెండింటిలోనూ అత్యున్నత నైతికతో పాటు వృత్తిపరమైన ప్రమాణాలను పాటిస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు సానుభూతిని ప్రదర్శించాలి, ఫిర్యాదులను ఓపికగా వినాలి, వారి విధులను సంపూర్ణ నిబద్ధత చిత్తశుద్ధితో నిర్వర్తించాలని సూచించారు. వ్యక్తిగతంగా సంస్థాగతంగా క్రమశిక్షణ యొక్క ప్రాముఖ్యతను డిసిపి వివరించారు. పోలీస్ స్టేషన్లలో పరిశుభ్రత క్రమబద్ధత పెంపొందించాలన్నారు. విధుల్లో ఉన్నా లేకపోయినా, ప్రతి అధికారి హైదరాబాద్ నగర పోలీసులు, తెలంగాణ పోలీసుల ప్రతిష్టను ప్రతిబింబిస్తారని అందరికీ గుర్తు చేశారు. అందువల్ల, వ్యక్తిగత ప్రవర్తన, వృత్తిపరమైన సంబంధాలు మరియు ఆర్థిక క్రమశిక్షణలో అత్యంత జాగ్రత్తగా ఉండాలి. సమగ్రత లేదా ప్రవర్తనలో ఏదైనా లోపిస్తే, కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.



## పద్మశ్రీ డా.దత్తాత్రేయుడు నోరిని కలిసిన ఉప్పల



ప్రజాపక్షం/సరూర్‌నగర్ : పద్మశ్రీ డా.దత్తాత్రేయుడు నోరిని బంజారాహిల్స్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో టిపిసిసి ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయవర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రు లు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు కేన్సర్ సేవల కోసం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి అడ్వైజరీగా మరో ప్రతిష్టాత్మక నియామకం పొందినందుకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. తెలుగింటి బిడ్డ హైదరాబాద్‌లో విధ్యాభ్యాసం చేసి అందరికి ఆదర్శంగా నిలిచి అసాధారణ నైపుణ్యం, నిస్వార్థ సేవా భావం, జీవితాంతం కేన్సర్‌పై పొరాడుతూ ప్రాణాలను రక్షించాలనే మీ తపనకు ప్రతీక అని ఆయన అన్నారు.

## ఘనంగా నేతాజీ నగర్ రిక్రియేషన్ ఫోరం రజతోత్సవాలు




ప్రజాపక్షం/హైదరాబాద్: నేతాజీ నగర్ రెసిడెంట్స్ రిక్రియేషన్ ఫోరం రజతోత్సవాలు ఆదివారం నేతాజీ నగర్ లోని శివ దత్ రాయ్ ప్రహ్లాద్ రాయ్ కమ్యూనిటీ సెంటర్ లో ఘనంగా జరిగాయి. రిక్రియేషన్ ఫోరం అధ్యక్షుడు కెవిబి మురళీమోహన్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నేతాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, ఫోరం కార్యవర్గ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు. వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు వినోద్ అగర్వాల్, అధ్యక్షుడు జి అప్పారావు, ప్రధాన కార్యదర్శి జగన్మోహన్ రెడ్డి, కోశాధికారి అమర్ నాథ్ రెడ్డి, అసోసియేషన్ నాయకులు ఏ కృష్ణమూర్తి, ఏ సత్యంబాబు, వై నరేందర్ రెడ్డి, ఎం మాణిక్ రెడ్డి, కే ప్రభాకర్, కృష్ణ దాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 ఏళ్ల స్ఫూర్తిదాయక ప్రయాణంలో రిక్రియేషన్ ఫోరం ఎన్నో విజయాలు సాధించిందని ప్రశంసించారు. కాలనీవాసుల విరాళాలతో నిర్మించిన చక్కటి ఇండోర్ స్టేడియంలో వుడెన్ షటిల్ కోర్టును, టెన్నిస్ కోర్టును ఫోరం అన్ని హంగులతో ఏర్పాటు చేసి, ఉన్నత ప్రమాణాలతో నిర్వహిస్తున్నదని వారు కొనియాడారు. కాలనీలో బాల బాలికలకు సమ్మర్ క్యాంపులు నిర్వహించడం, జాతీయ పర్వదినాల సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నదని ఫోరం అధ్యక్షుడు మురళీమోహన్ రావు తెలియజేశారు. గత రెండున్నర దశాబ్దాలలో నగరంలోని పలు చోట్ల జరిగిన షటిల్ బ్యాడ్మింటన్, టెన్నిస్ పోటీలలో నేతాజీ నగర్ రిక్రియేషన్ ఫోరం తరపున జట్లు పాల్గొని విజయాలు సాధించాయని ఆయన వివరించారు. గెలుపొందిన జట్లకు అతిథులు ట్రోఫీలను అందజేశారు. రిక్రియేషన్ ఫోరం ఆఫీస్ బేరర్లు ఉమేష్ కుమార్, వై రవీందర్ రెడ్డి, ఎంవీ రంగారెడ్డి, శ్రీనివాసరావు, చలపతిరావు, అబ్దుల్ మాలిక్, పి రామేశ్వర్ రెడ్డి, వేణుగోపాల్ నాయుడు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 19 నుంచి బంజార భారత్ స్వర్ణోత్సవాలు




ప్రజాపక్షం/ఖైరతాబాద్ : బంజార భారత్ స్వర్ణోత్సవాలు ఈ నెల 19 నుంచి 21 వరకు న్యూఢిల్లీలో నిర్వహించనున్నట్లు బంజార భారత్ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ఎంపి ధారవత్ రవీంద్రనాయక్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బంజార భారత్ అధ్యక్షులు పృథ్వీసింగ్ రాథోడ్, నాన్ ఏజెన్సీ వికారాబాద్ ఏరియా అధ్యక్షులు రాఘవన్ నాయక్, జాతీయ మహిళా కన్వీనర్ ఎ.నాగమణి నాయక్, జె.బి.రాజులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బంజార భాష 'గొర్బోలి' అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానించి, పార్లమెంట్‌లో ఆమోదింపజేయాలని కోరారు. కర్ణాటక తరహాలో బంజార తండా ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం చలో బంజార భారత్ నగారా ఢంకాను రవీంద్రనాయక్ మోగించారు. సమావేశంలో బంజార నేతలు కె.హరిచంద్ నాయక్, కె.నరేశ్ కుమార్, సబ్లే అమర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## 'మైకు' గుర్తును సవరించకపోతే హైకోర్టుకెళ్తా

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

టిఆర్‌పి అభ్యర్థి నక్కా యదీశ్వర్



ప్రజాపక్షం/ఖైరతాబాద్ : తాను జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బరిలో దిగానని, తన ఎన్నికల గుర్తు 'మైకు' బొమ్మ అస్పష్టంగా ముద్రించడంతో ఓటర్లు గుర్తించక నష్టపోయే అవకాశం ఉన్నదని, దీనిని సవరించిన తర్వాతనే ఎన్నికలు వెళ్లాలని అభ్యర్థి నక్కా యదీశ్వర్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ మైకుగుర్తు ఇసిఐ స్పష్టంగా ముద్రించిందని, కానీ, రాష్ట్ర ఎన్నికల సంఘం (సిఇఒ) మాత్రం మైకుకు స్టాండ్ లేకుండా అస్పష్టంగా ముద్రించిందని వివరించారు. ప్రధాన పార్టీల గెలుపు కోసమే ఎన్నికల రిటర్నింగ్ అధికారి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై ఈనెల 3న రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదుచేస్తే, 6న తామేమి చేయలేమని చేతులెత్తేశారన్నారు. ఈవిఎం బ్యాలెట్‌పై మైకు గుర్తును సవరించకపోతే హైకోర్టును ఆశ్రయిస్తానని తెలిపారు. సమావేశంలో చెన్నోజు శ్రీనివాసులు, జెట్టమోని యోగేశ్ యాదవ్, రాజేశ్, రమేశ్ పాల్గొన్నారు.

## ఇచ్చుకో..కావాల్సినంత కట్టుకో..?







ఎల్‌బి నగర్ సర్కిల్-4లో జిహెచ్‌ఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారుల ఇష్టారాజ్యం

జిహెచ్‌ఎంసి ఆదాయానికి భారీ గండి, కీలకంగా వ్యవహరిస్తున్న ఎసిపి, చైన్‌మెన్

చర్యలు తీసుకోవాలని కోరుతున్న కాలనీ వాసులు

ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : రాష్ట్ర ప్రభుత్వం జిహెచ్‌ఎంసిలో ప్రణాళికాయుతంగా అభివృద్ధి చేయాలని సంకల్పంతో అనేక అంక్షలు విధిస్తోంది. వాటిలో అనుమతుల మేరకే నిర్మాణాలు జరగాలని అదనపు అంతస్తులను అనుమతించొద్దని నిబంధనలు ఉన్నాయి. కానీ అవన్నీ అమలుకునోచుకోవడం లేదని కాలనీ ప్రజలు వాపోతున్నారు. ఎల్‌బి నగర్ సర్కిల్4లో టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలదారులకు వతాస్తు పలుకుతుండడంతో అక్రమ నిర్మాణాలు దారులు ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

**హస్తినాపురం డివిజన్‌లో...** డివిజన్‌లోని హనుమాన్ నగర్ కాలనీలోని రోడ్డు నెంబర్ 5లో జీ ప్లెస్ 2 పర్మిషన్ ఉంటే అదనపు ఒక ఫ్లోర్ నిర్మాణం చేయగా, పక్కనే ఉన్న బిల్డింగ్‌లో ఎలాంటి సేట్‌బ్యాక్ లేక పాత ఇల్లుపై రెండు ఫ్లోర్ ఒక పెంట్ హౌజ్ నిర్మాణం చేశారు. అదే భవనంలో హాస్టల్‌కు అద్దెకు ఇచ్చారు. జిహెచ్‌ఎంసి నిబంధనల ప్రకారం ఇంటి పేరుతో పర్మిషన్ తీసుకుని కమర్షియల్‌గా మారుస్తున్నారు. దీనిపై కాలనీ ప్రజలు జిహెచ్‌ఎంసి అధికారులకు ఫిర్యాదు చేసిన చూసిచుడనట్లుగా వ్యవహరిస్తుడం గమనార్ధం. ఇంటి యజామాన్యం మాత్రం జిహెచ్‌ఎంసి అధికారులను మేనేజ్ చేయడం జరిగిందని కాలనీ ప్రజలకు భాహటంగానే చెప్పుతున్నారు. దీనిపై జిహెచ్‌ఎంసి అధికారులకు తెలియజేస్తే నోటీసులు ఇవ్వడం జరిగిందని తెలుపుతున్నారు. నోటీసులతోనే కాలం వెల్లదిసి అప్పటికే బిల్డింగ్ పూర్తి అయిపోతుందని కాలనీ ప్రజలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఏపిఎస్‌బి కాలనీలో ఏకంగా 20 ఫీట్ల రోడ్డుకు రెండు బిల్డింగ్‌కు జీ ప్లేస్2 పర్మిషన్ ఉంటే ఏకంగా రెండు ఫ్లోర్ అదనపు నిర్మాణం చేశారు. కాలనీ ప్రజలు భవిష్యత్‌లో రోడ్లపై వహనాలు ఎక్కువగా ఉంటే ఇరుకైన రోడ్లు ఉన్న చోట భారీ భవనాలు వస్తే భవిష్యత్తు రోజుల్లో ఇంటి నుంచే బయటకు వెళ్లలేని పరిస్థితి తలెత్తుతోందని కాలనీ వాసులు వాపోతున్నారు. డివిజన్‌లోని గోకుల్ ఎన్‌క్లేవ్‌లో రోడ్డు నెంబర్3లో భారీ భవనం నిర్మాణాదారుడు నిర్మాణం చేపట్టారు. పర్మిషన్ ఒక ఎత్తు భవన నిర్మాణం మరో ఎత్తుగా నిర్మాణం చేపడుతున్నారు. కనీ జిహెచ్‌ఎంసి అధికారుల అండదండలు మాకు ఉన్నాయని భవన నిర్మాణాదారులే చెప్పడం కాలనీలో చర్చనీయాంశంగా మారింది. అక్రమదారులకు జిహెచ్‌ఎంసి అధికారులు నిబంధనలకు విరుద్దంగా ఉన్న భవనాలను డీమాలేషన్ చేయాల్సిన అధికారులు వారికి అండగా నిలువడం ప్రభుత్వ అదాయానికి భారీ గండిపడే అవకాశం ఎక్కువగా ఉంది. ఒక వైపు ప్రభుత్వం అక్రమదారుల పట్ల ఉక్కుపాదం మోపాలని దిశనిర్ధశం చేస్తుంటే దానికి విర్ధుంగా చైన్‌మెన్, ఏసిపిలే వ్యవహరించడం సిగ్గుచేటు అంటున్నారు. అక్రమ దారులపై ఎల్‌బి నగర్ జోనల్ కమిషనర్, జిహెచ్‌ఎంసి కమిషనర్ తగిన చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

### నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం

ఎల్‌బి నగర్ సర్కిల్-4 ఏసిపి ప్రతాప్

జిహెచ్‌ఎంసి నిబంధనల ప్రకారం ఇండ్ల నిర్మాణం ఉండాలని, పర్మిషన్ కంటే అదనపు నిర్మాణం చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం. అదనపు ఫ్లోర్ నిర్మాణం ఉన్న వాటిని గుర్తించి నోటీసులు ఇచ్చి వాటిని న్యాక్ టీంకు అందజేస్తామని, పర్మిషన్ ప్రకారం లేకపోతే ఢీమాలేషన్ చేస్తామని తెలిపారు. కాలనీల నుంచి ఫిర్యాదు వాస్తున్న వాస్తమే కానీ మా దగ్గర స్టాఫ్ లేకపోవడం వలనే సమస్యలను పరిష్కారం చేయడంలో జాప్యం జరుగతుంది.

## కమ్యూనిస్టు రాజ్యంతోనే సమస్యలు పరిష్కారం

మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కేవలం కమ్యూనిస్టు ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఉట్ల పల్లి గ్రామంలో సీపీఎం మాజీ మండల కమిటీ సభ్యుడు బొంగరాల వెంకన్న ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన స్థూపాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. వెంకన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమ య్యాయని అన్నారు. సమస్యల పరిష్కారానికై సీపీఎం చేసే పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, చౌగాని సీతారాములు, నాగ్ హుస్సేన్, కన్నెగంటి రామకృష్ణ, చౌగాని వెంకన్న, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఐ హెల్త్ ఇన్‌కేర్ కోర్సును పూర్తిచేసిన డాక్టర్ బాలరాజ్ నాయుడు

**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** ఓనస్ ఆసుపత్రి ఎం.డి డాక్టర్ బాలరాజ్ నాయుడు హార్వర్డ్ మెడికల్ స్కూల్ కేర్ ఈ మరీస్ ప్రోగ్రామ్‌ను విజయమవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలరాజ్‌నాయుడు మాట్లాడుతూ వైద్య రంగానికి ఉత్తమ సేవలు అందించినందుకు తనను హెల్త్ కేర్ వారు అవకాశం కల్పించడం చాలా ఆనందంగా ఉందన్నారు. లీడింగ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ హెల్త్ కేర్ అనే కోర్సుపై పూర్తి చేసినట్లు తెలిపారు. నూతన వైద్య సాంకేతికలో అభివృద్ధి వైద్యరంగానికి ఉత్తమ సేవలు అందించే అవకాశం కల్పించినందుకు ఆనందంగా ఉందన్నారు. వైద్య రంగంలో సేవలందించేందుకు ఈ కోర్సు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గత ఎనిమిది సంవత్సరాలుగా చంపాపేట ప్రధాన రహదారిలో ఓనస్ రోబోటిక్ ఆసుపత్రిని ఏర్పాటు చేసుకోని వైద్య సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు తెలంగాణ రాష్ట్రంలోని పలువురువైద్యులు బాలరాజునాయుడును అభినందించారు.

## 26కిలోల గంజాయి స్వాధీనం



**ప్రజాపక్షం/వికారాబాద్ :** 26కిలోల ఎండు గంజాయిని ఆదివారం స్వాధీనం చేసుకోవడం జరిగిందని జిల్లా అదనపు అబ్కారి అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వికారాబాద్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో గంజాయి రవాణా చేస్తున్నట్లు సమాచారం మేరకు వికారాబాద్ జిల్లా అబ్కారీ శాఖ అధికారి విజయభాస్కర్ ఆదేశాల మేరకు, టాస్క్‌ఫోర్స్ బృందం రైల్వే హాస్పిటల్ పరిసర ప్రాంతంలో గాలిస్తుండగా అనుమానాస్పదంగా మూడు బ్యాగులు కనిపించాయి. వాటి గురించి విచారించగా ఎవరు కూడా ముందుకు రాలేదు. బ్యాగులు తెరిచి చూడగా ఎండు గంజాయి 13ప్యాకెట్లలో 26కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని అన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సిఐ శ్రీనివాస్, ఎస్ఐ ప్రేమ్‌కుమార్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, పి.రవికిరణ్, శివప్రసాద్ తదితరుతులు పాల్గొన్నారు.

## నేడు జెఎసి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భవన నిర్మాణ కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు జెఎసి ఛైర్మన్ ఎం.హన్మేశ్ తెలిపారు. ఇన్సూరెన్స్ క్లెయిమ్స్‌ను ప్రైవేట్ కంపెనీలకు ఇవ్వడాన్ని రద్దు చేయాలని, సహజ మరణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని తదితర డిమాండ్‌లతో రౌండ్ టేండ్ సమావేశం నిర్వహిస్తున్నామని వివరించారు. భవన నిర్మాణ కార్మిక నాయకులు, అన్ని సంఘాల ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నాయకులు సమావేశంలో పాల్గొంటారని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## భరత్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మండల నాయకులు




**ప్రజాపక్షం/నవాబుపేట్:** చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పామేనా భీమ్ భరత్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం నియోజకవర్గంలోని మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వచ్చి శుభాకాంక్షలు తెలుపుతూ శాలువతో సన్మానం చేసి కేక్ తినిపించారు. నవాబుపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మేడిపల్లి వెంకటయ్య, మండలం నాయకులు నుండి పెద్ద ఎత్తున వెళ్లి ఆయన స్వగృహంలో పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని పామేనా భీమ్ భరత్ ఆయన సతీమణి జ్యోతి భీమ్ భరత్‌లకు శాలువాతో సత్కరించి పూలమాల వేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా అంచలంచెలుగా ఎదుగుతూ నియోజకవర్గానికి అనేక రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని కోరినారు. ఈ కార్యక్రమంలో ది బ్లాక్ అధ్యక్షులు పోలీస్ మధుసూదన్ రెడ్డి, నవాబుపేట్ మండల అధ్యక్షులు మేడిపల్లి వెంకటయ్య కాంగ్రెస్ యువజన సంఘం అధ్యక్షులు తలారి శేఖర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సామ వెంకట్ రెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షులు గుండాల శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు ప్రభాకర్ రెడ్డి, వడ్డే రాములు,నాయకులు సంగారెడ్డి, గోపాల్ రెడ్డి,శ్రీధర్, గోపాల కృష్ణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప ఎన్నిక నేపథ్యంలో.. వేతనంతో కూడిన సెలవులు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** జుబ్లిహిల్స్ అసెంబ్లీ ఎన్నికల బై ఎలక్షన్ సందర్భంగా మేడ్చల్ జిల్లా పరిధిలోని బాలానగర్ మండలంలో పోలింగ్ జరగనుంది. బూత్ కేంద్రాల కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థలకు ఈ నెల 10, 11 తేదీలలో వేతనంతో కూడిన సెలవు దినాలుగా పేర్కొంటూ జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదివారం ఉత్తర్వులు జారీ చేసారు.

## జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో నవాబుపేట్ బిఆర్ఎస్ నాయకులు



**ప్రజాపక్షం/నవాబుపేట్:** కాంగ్రెస్ పాలనలో 24 నెలల పరిపాలన చూపించి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీని గెలిపించాలని నవాబుపేట్ మండల బిఆర్ఎస్ ప్రెసిడెంట్ అంతమోళ్ళ దయాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం మాజీ మంత్రివర్యులు సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్‌ను భారీ మెజారిటీ తో గెలిపించుటకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో భాగంగా ఎల్లారెడ్డిగూడా, శ్రీనగర్ కాలనీలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నవాబుపేట్ మండల బిఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గణపురం శాంతి కుమార్, కార్యదర్శి అభిషేక్ రెడ్డి, రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేశం, కేసిఆర్ సేవాదళ్ అధ్యక్షులు మాణిక్‌రెడ్డి, యూత్ ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, మండల నాయకులు బక్కని శేఖర్, చిట్టిగిద్ద గ్రామ కమిటీ అధ్యక్షులు రామచందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్ పాల్గొన్నారు.

## ఏడుపాయల క్షేత్రంలో కిక్కిరిసిన భక్తులు

**ప్రజాపక్షం/పాపన్నపేట :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా మాత క్షేత్రం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఏడుపాయలకు భక్తులు పోటెత్తారు.. వనదుర్గమ్మ ప్రధాన ఆలయం ముందున్న నదీ పాయ కొంతమేర ప్రవహించడంతో మూలవిరాట్ దర్శనానికి భక్తులకు ఇంకా అనుమతి ఇవ్వలేదు. దీంతో రాజగోపురంలో ప్రతిష్టించిన ఉత్సవ విగ్రహం వద్ద భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఆలయ అర్చకులు వేకువజామునే అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించి భక్తులకు వనదుర్గమ్మ దర్శనం కల్పించారు.

# చిత్తశుద్ధితో పని చేస్తున్న ప్రభుత్వం

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కొల్లూరు కాలనీ వాసులకు వారం రోజుల క్రితం ప్రభుత్వ పక్షాన ఇచ్చిన హామీలను 24 గంటలు పూర్తి కాకముందే అమలు చేస్తున్నామని, ఇది సిఎం రేవంత్ రెడ్డి పాలనాదక్షతకు నిదర్శనమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కొల్లూరు 2 బిహెచ్‌కె కాలనీ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని, ఇచ్చిన హామీ మేరకు కాలనీ వాసుల సమస్యలను పరిష్కరించామని తెలిపారు. సంగారెడ్డి జిల్లా కొల్లూరు కాలనీలో సుమారు 16 వేల కుటుంబాలకు చెందిన 48 వేలకు పైగా ప్రజలు నివసిస్తున్నారు. వారం రోజుల క్రితం ఈ కాలనీని సందర్శించిన మంత్రి పొంగులేటి, ఇతర మంత్రుల ఇచ్చిన హామీ నేపథ్యంలో ఆదివారం మరో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మైనార్టీ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, ఖమ్మం ఎంపి రామసహాయం రఘుకుమార్ రెడ్డి, మాజీ ఎంఎల్‌సి భూపతి రెడ్డి, కౌన్సిలర్ భరత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ కాలనీలో సన్నబియ్యం తీసుకునే లబ్ధిదారుల కోసం రేషన్‌షాపు, కాలనీ లోపలకు ఆర్‌టిసి బస్సులు సౌకర్యాన్ని కల్పించామన్నారు. కాలనీవాసుల రక్షణ కోసం శాశ్వత పోలీస్‌స్టేషన్ నిర్మాణం చేపట్టామని, 24 గంటల్లోనే తాత్కాలికంగా ఔట్ లెట్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. గతంలోనే ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నామని, అత్యవసర నిమ్మితం రెండు అంబులెన్స్‌లను అందించామని, కాలనీలో స్పీడ్ బ్రేకర్లు, సెంట్రల్ లైటింగ్‌ను వెంటనే ఏర్పాటు చేస్తామని, శ్మశానవాటిక ఏర్పాటుకు చర్యలు మొదలయ్యాయని ఆయన తెలిపారు. కాలనీలో అర్హులైన పేదలందరికీ గృహ జ్యోతి పథకం కింద 200 వరకు యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తామని, వృద్ధులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పింఛన్ తీసుకునే విధంగా వచ్చే నెల నుంచి ఇక్కడే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కాలనీలో షాపుల ఏర్పాట్లకు త్వరలో టెండర్లు ఆహ్వానిస్తామని, మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలంటే కాలనీవాసులు కమిటీని వేసుకోవాలని మంత్రి పొంగులేటి సూచించారు.

## మహిళ హత్య : ముగ్గురు నిందితుల అరెస్ట్




**ప్రజాపక్షం/దుండిగల్ :** మాజీ రౌడీషీటర్ మేనల్లుడు సహాయంతో వివాహితను అడ్డు తొలగించుకున్నాడని మేడ్చల్ డివిజన్ ఏసీపీ శంకర్ రెడ్డి తెలిపారు. దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధి, గ్రీన్‌హిల్స్ కాలనీలో జరిగిన హత్య కేసును 12 గంటల్లో పోలీసులు చేధించారు. ఆదివారం దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి, దుండిగల్ సీఐ సతీష్, డిఐ బాల్ రెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. బహదూర్ పల్లిలో మాజీ రౌడీ షీటర్‌కు చెందిన ఇంట్లో మృతురాలు స్వాతి అద్దెకు ఉంటుందని ఇంటి యజమాని బోయ కిషన్‌తో వివాహేతర సంబంధమే హత్యకు కారణమని పోలీసులు దర్యాప్తులో తేలిందని ఏసీపీ వెల్లడించారు. కొంత కాలంగా చనువుగా ఉన్న వీరు తనను పదే పదే పెళ్లి చేసుకోమని స్వాతి ఒత్తిడి తేవడంతో స్వాతిని అడ్డు తొలగించేందుకు వరుసకు మేనఅల్లుడు అయిన రాజేష్ మరియు అతని వద్ద పని చేసే వంశీలను హత్య చేయమని మాజీ రౌడీ షీటర్ బోయ కిషన్ ఉసిగొల్పాడు. దీంతో ఆమె ఇంటికి తెల్లవారుజామున వెళ్లిన రాజేష్, వంశీలు అతి దారుణంగా కూరగాయల కత్తితో తన కుమారుడి ముందే స్వాతిని గొంతు కోసి హత్య చేసి పరారయ్యారు. ఈ మేరకు సమాచారం అందుకున్న దుండిగల్ పోలీసులు సీసీ ఫుటేజి ఆధారంగా దర్యాప్తు జరిపి ముగ్గురు నిందితులు కిషన్, రాజేష్, వంశీలను అరెస్టు చేసి, వారి వద్ద హత్యకు ఉపయోగించిన ఒక కత్తి, కారు, 3 చరవాణిలను స్వాధీనపరుచుకుని, నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నామని ఏసీపీ వెల్లడించారు.

# వెజిటేబుల్... రేటు డబుల్

బెంబేలెత్తుతున్న సామాన్య ప్రజలు

మొంథా తుఫాను ప్రభావంతో ధరలు పెరిగాయంటున్న వ్యాపారులు

పేద, మధ్యతరగతి వారిపై అదనపు భారం



**ప్రజాపక్షం/వికారాబాద్ :** ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల రేట్లు రెట్టింపయ్యాయి. ఏ కూరగాయ చూసినా కిలో రూ.100కు చేరువలోనే ఉంది. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు బడ్జెట్ తారుమారవుతోంది. నిన్నటివరకు రూ.20కే కిలో అమ్మిన టమాట, ఆలుగడ్డలు నేడు రూ.50నుండి రూ.60కు అమ్ముతున్నారు. పచ్చిమిర్చి, సోరకాయ, వంకాయ, బీరకాయ వంటివి కిలో రూ.100 ఉన్నాయి. ఇక బీన్స్, చిక్కుడు, మునగ వంటివి కిలో వంద దాటిపోయాయి. దాంతో పేదలు కూరగాయలు కొనడమే తగ్గించారు. రోజుకు రెండు కూరలు వండే వారు ఒక దానితో సరిపెట్టుకుంటున్నారు. మిగతా పూటలు పచ్చడి, పప్పుచారుతో లాగించేస్తున్నారు. వికారాబాద్ జిల్లాలో ప్రజల అవసరాలకు అనుగుణంగా కూరగాయల సాగు లేదు దాంతో నిత్యం ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలను దిగుమతి చేసుకుంటుంటారు అయితే మొంథా తుఫాన్ కారణంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాలల్లో భారీ వర్షాలు కురిశాయి. వర్షాలకు కూరగాయల తోటలు దెబ్బతిని దిగుబడి తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. మనకు హైదరాబాద్ నుండి కూరగాయలు దిగుమతి అవుతుంటాయి. అయితే వర్షాల తరువాత అక్కడి వ్యాపారులే కూరగాయల రేట్లు పెంచి సరఫరార చేస్తున్నారని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. మార్కెట్‌కి కూరగాయలు తక్కువగా రావడం, స్థానికంగా డిమాండ్ ఉండడంతో వ్యాపారులు కూరగాయల రేట్లను రెట్టింపు చేసి విక్రయిస్తున్నారని స్థానికలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కూరగాయల ధరలు తక్కువగా ఉన్నప్పటికి అధిక ధరలకు అమ్ముతున్నారని కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. టమాట వారం క్రితం రూ.20ఉంటే ప్రస్తుతం రూ.40, ఆలుగడ్డ రూ.30నుండి రూ.50కి పెరిగింది. పచ్చిమిర్చి రూ.50నుండి రూ.80కి, కాకరకాయ రూ.50నుండి రూ.80కి పెరిగింది. బెండకాయ రూ.50నుండి రూ.80కి పెరిగింది. బీన్స్ రూ.80నుండి రూ.160వరకు పెంది. మునగకాయ రూ.70నుండి రూ.150కి పెరిగింది. క్యారెట్ రూ.500నుండి రూ.100కి పెరిగింది. గత నెల 22నుండి ఈనెల 19వరకు కార్తీక మాసం ఉంటుంది. తుఫాన్ ప్రభావంతో కూరగాయల ధరల దిగుమతిదారులే రేట్లు పెంచారు. దీనికి తోడు కార్తీకమాసం కావడంతో కూరగాయల డిమాండ్ పెరిగింది. వారం కిత్రం పోల్చి చూస్తే ధరలు రెట్టింపయ్యాయి. ఏది కొనాలన్నా కిలో రూ.100కు చేరువలో ఉన్నాయని,మార్కెట్‌కు రూ.500 తీసుకెళ్లినా సంచి నిండడం లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగయాల ధరలు పెరగడంతో పేద, మధ్యతరగతి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ధరలు నియంత్రించేందు కు అధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు.



## చౌహాన్ చిత్రపటానికి నివాళులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ గిరిజన సమాఖ్య వ్యవస్థాపక మాజీ ప్రధాన కార్యదర్శి, దేవరకొండ మాజీ ఎంఎల్‌ఎ బద్దూ ఛౌహాన్ 13వ వర్ధంతి సందర్భంగా హైదరాబాదులోని ఆయన స్వగృహంలో చౌహాన్ చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, తెలంగాణ గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, సిపిఐ రాష్ట్ర కార్యవ్గ సభ్యులు పల్లా నరసింహ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఎపి రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘ మాజీ నాయకులు సీతారాములు, బద్దు చౌహాన్ సతీమణి అంజలీదేవి. కుమారుడు డాక్టర్ గౌతమ్ చౌహాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజయ్య నాయక్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో 2003 సంవత్సరంలో తెలంగాణ గిరిజన సమాఖ్య ఏర్పాటు చేయడంలో బద్దుచౌహాన్ కృషి మరువలేనిదన్నారు. ఎంఎల్‌ఎగా ఉన్న సమయంలో గిరిజన సమస్యలపైన ఆయన శాసనసభలో అనేక సందర్భాల్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసి, హక్కుల సాధన కోసం పాటుపడిన వ్యక్తి అని కొనియాడారు. అన్ని జిల్లాల్లో గిరిజన సమాఖ్య నిర్మాణానికి కృషి చేసిన బద్దు చౌహాన్ కృషి నేటి గిరిజన ఉద్యమానికి మార్గదర్శిగా ఉండాలన్నారు. ఆయన స్ఫూర్తితో గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో గిరిజన హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఉన్నదని అంజయ్య నాయక్ తెలిపారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎంపి



రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు కేంద్రం నుంచి రూ.2లక్షల పరిహారం వారంలో అందజేస్తాం

**ప్రజాపక్షం/తాండూరు:** చేవెళ్ళ బస్సు ప్రమాదంలో మృత్యువాత పడిన కుటుంబ బాధితులకు వారంలోనే కేంద్రం ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల పరిహారం అందజేస్తామని చేవెళ్ళ పార్లమెంట్ ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 3న చేవెళ్ల మండలం మీర్జాపూర్ ఆర్టీసి బస్సు ప్రమాద ఘటనలో వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గ పరిధిలో మృత్యువాత పడిన 13మంది బాధిత కుటుంబాలను ఆదివారం ఎంపి కొండా విశ్వేశ్వర్ పరామర్శించి ఓదార్చారు. తాండూరు పట్టణ పరిధి ఇందిరమ్మ కాలనీకి చెందిన సలేహా, ఖలీద్, రెండు నెలల పాపతో పాటు పట్టణంలోని విశ్వంభర కాలనికి చెందిన తబుస్సుమ్, వాల్మీకినగర్‌కు చెందిన వెంకటమ్మ, పాత తాండూరుకు చెందిన డ్రైవర్ దస్తగిరిబాబ, తాండూరు మండల పరిధి గౌతాపూర్ గ్రామానికి చెందిన ముస్కాన్ బేగం కుటుంబాలను, యాలాల మండల పరిధి లక్ష్మి నారాయణపూర్ గ్రామానికి చెందిన అఖిల రెడ్డి, హాజీపూర్ గ్రామానికి చెందిన బందెప్ప,లక్ష్మి, పేర్కంపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు అక్కచెల్లెళ్లు తనుషా, సాయిప్రీయ, నందిని కుటుంబాలను ఎంపి పరామర్శించి ఓదార్చారు. అనంతరం ఎంపి స్వయం గా బాధిత కుటుంబాలలకు ఒక్కొక్కరికి రూ.30వేల చోప్పున ఆర్థిక సహాయం అందజేశారు. రోడ్లను మెరుగుపర్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్ని దుయ్యబట్టారు. ఇది పూర్తిగా దివాలా కోరు ప్రభుత్వమని విమర్శించారు. త్వరలోనే రూ.60కోట్ల నిధులను రోడ్ల నిర్మాణానికి కేంద్ర మంజూరు చేయబోతుందన్ని చెప్పారు. చేవెళ్ళ రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు కేంద్ర నుంచి రూ.2లక్షల పరిహారం వారంలో అందజేస్తామని తెలిపారు. అనాథలైన హాజీపూర్ చిన్నారులను తానే చదవిస్తానని ముందుకోచ్చారు. ఆయన వెంటా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్‌కుమార్, చేవెళ్ళ ఇంచార్జీ రత్నం, జిల్లా నాయకులు ప్రహ్లాద్ రావు, బాలేశ్వర్ గుప్తా తదితరులు ఉన్నారు.

# బహుళ అంతస్థుల భవనాలు ఫుల్..

## సర్కిల్ అధికారుల చర్యలు నిల్..

మహదేవపురంలో అడ్డగోలుగా బహుళ అంతస్థుల భవనాలు

ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న టౌన్ ప్లానింగ్ చైన్‌మెన్‌లు

ఎఫ్‌టిఎల్‌లో సైతం బహుళ అంతస్థుల నిర్మాణాలు

పట్టించుకోని ఉన్నతాధికారులు





**ప్రజాపక్షం/నిజాంపేట్ :** గాజులరామారం సర్కిల్‌లో అడ్డగోలుగా అనుమతులు లేకుండా బహుళ అంతస్థుల భవనాలు పెరిగిపోతున్నాయి. కనీసం సెట్ బ్యాక్‌లు, నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. గాజులరామారం, మహదేవపురం అంటేనే ప్రభుత్వ సర్వే నంబరని, బై నంబరు ద్వారా గతంలో లే అవుట్ వేసి ప్లాట్లుగా విభజించారు. కొంతకాలం క్రితం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఓ జాయింట్ కలెక్టర్ మహదేవపురం సర్వేనంబరు పూర్తిగా ప్రభుత్వ స్థలమని ఏకంగా పదుల సంఖ్యలో నిర్మాణాలను కూల్చివేశారు. ఇటీవల కోర్టుని ఆశ్రయించి మహదేవపురంలో క్రయవిక్రయాలను సాగిస్తున్నారు. ఇక్కడ నిర్మించే బహుళ అంతస్థుల భవనాలకు సైతం గాజులరామారం సర్కిల్ నుండి ఎలాంటి అనుమతులు ఉండవు. కొందరు మాత్రం కోర్టుని ఆశ్రయించి తద్వారా అనుమతులను పొంది ఏకంగా ఐదు, ఆరు అంతస్థులను నిర్మిస్తున్నారు. ఇదే అదునుగా చేసుకున్న సర్కిల్ టౌన్ ప్లానింగ్ చైన్ మెన్‌లు అందిన కాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు తారాస్థాయిలోనే వినిపిస్తున్నాయి. ఏ బిల్డింగ్ వద్ద చూసినా ముందు చైన్‌మెన్‌ల పేరు వినపడడం గమనార్హం. ఇదిలా ఉండగా గాజులరామారం సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు మహదేవపురం వైపు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మహదేవపురంలో అనుమతులు లేకుండా జరుగుతున్న నిర్మాణాల పై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**గాజులరామారం డివిజన్‌లో ఇష్టానుసారంగా నిర్మాణాలు...**

గాజులరామారం సర్కిల్ పరిధిలోని గాజులరామారం డివిజన్‌లో ఇష్టానుసారంగా అనుమతులు లేని బహుళ అంతస్థుల భవనాలు కొనసాగుతున్నాయి. డివిజన్‌లోని మహదేవపురం, బాలయ్యనగర్, కైలాస్ హిల్స్, రాంకీ సమీపంలోని ద్వారకా నగర్, పీపీ నగర్, శ్రీనివాస్ నగర్, బాలాజీ నగర్, దేవేందర్ నగర్, ఖైసర్ నగర్, రోడామేస్త్రీ నగర్, శ్రీరాంనగర్, హెచ్‌ఏఎల్ కాలనీ, ఉషోదయ కాలనీ, లెనిన్ నగర్ తదితర ప్రాంతాలలో ఇబ్బడిముబ్బడిగా అనుమతులు లేకుండా బహుళ అంతస్థుల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇక కొన్ని బస్తీలైతే ప్రభుత్వ స్థలంలో వెలసిన బస్తీలే. కాలనీలలో కనీసం జీ ప్లస్ టూ, మూడు అంతస్థుల వరకు అనుమతులు ఉంటాయి. కాని బస్తీల్లో జరుగుతున్న బహుళ అంతస్థుల భవనాలకు అసలు ఎలాంటి అనుమతులు ఉండవు. కానీ ఏకంగా నాలుగు, ఐదు అంతస్థుల భవనాలను కనీస నిబంధనలను పాటించకుండా నిర్మించడం ఇక్కడ పరిపాటి. ఇట్టి నిర్మాణాలపై సర్కిల్ అధికారులను వివరణ కోరితే నోటీసులను జారీ చేశామని, చర్యలు తీసుకుంటామని చేతులు దులుపుకోవడం సర్వసాధారణంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అనుమతులు లేకుండా నిర్మించే బహుళ అంతస్థుల భవనాలపై కొరడా ఝులిపించాలని పలువురు కోరుతున్నారు.

**పరికి చెరువు ఎఫ్‌టీఎల్‌లో బహుళ అంతస్థుల నిర్మాణాలు...**

గాజులరామారంలోని పరికి చెరువు ఎఫ్‌టీఎల్‌లో సైతం అనుమతులకు మించి బహుళ అంతస్థుల భవనాలను నిర్మిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఏకంగా నాలుగు, ఐదు అంతస్థులను నిర్మించడం విశేషం. ఓ వైపు ప్రభుత్వం హైడ్రాని తీసుకువచ్చి చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో నిర్మించే నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటుంటే మరో వైపు బహుళ నిర్మాణాలు చేపడుతుండడం గమనార్హం. గాజులరామారం సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి పరికి చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మించే నిర్మాణాల పై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# క్రీడ

## అహ్మదాబాద్‌కే అగ్రపీఠం..

### ఈ రెండు స్టేడియాల్లోనే నాకౌట్ మ్యాచ్‌లు!




వచ్చే ఏడాది పురుషుల టీ20 ప్రపంప కప్ పోటీలకు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న విషయం తెలిసిందే. మెగా టోర్నీకి సమయం సమీపిస్తున్నందున ఇరుదేశాల్లోని వేదికలను ఖరారు చేస్తోంది అంతర్జాతీయ క్రికెట్ మండలి. ఫిబ్రవరి 7న విశ్వ క్రీడా సమరం ప్రారంభం కానున్న నేపథ్యంలో మొత్తం 8 నగరాలను ఎంపిక చేసింది. ఊహించినట్టే అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియానికి తొలి ప్రాధాన్యమిచ్చింది ఐసిసి. ఆరంభ పోరుతో పాటు ఫైనల్ ఫైట్ కూడా ఇక్కడే జరుగుతుందని చెప్పిన ఐసీసీ ఆదివారం సెమీఫైనల్ స్టేడియాలను సైతం ప్రకటించింది. పొట్టి ప్రపంచ కప్ బెర్తులు ఖరారు కావడంతో షెడ్యూల్‌పై కసరత్తు చేస్తోంది ఐసిసి. మొదటగా వేదికల్ని ఖరారు చేయాలి కాబట్టి.. ఆతిథ్య దేశాలైన భారత్‌లో ఐదు, లంకలోని రెండు నగరాలను ఎంపిక చేసింది ఐసీసీ. అహ్మదాబాద్, కోల్‌కతా, ఢిల్లీ, చెన్నై, ముంబై.. శ్రీలంకలో కొలంబో, క్యాండీ సిటీల్లో ప్రపంచ కప్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. అహ్మదాబాద్‌లోనే మార్చి 8న ఫైనల్ జరుగనుంది. సెమీఫైనల్స్ కోసం ఒకటి కోల్‌కతా, అహ్మదాబాద్ నగరాలను ఆడించాలని షార్ట్ లిస్ట్ చేశామని ఐసీసీ తెలిపింది. అయితే.. ముంబైలోని వాంఖడే స్టేడియం పేరు కూడా పరిశీలనలో ఉన్నట్టు సమాచారం.

పాకిస్థాన్ జట్టు మ్యాచ్‌లన్నీ శ్రీలంకలో ఆడించడంపై పాక్ బోర్డు, బీసీసీఐ మధ్య అంగీకారం కుందిరింది. ఒకవేళ పాక్ టీమ్ ఫైనల్ చేరితే అహ్మదాబాద్‌లో కాకుండా మ్యాచ్ నిర్వహించడం ఖాయం. అక్టోబర్ 17న ప్రకటించనట్టే ఈసారి కూడా 20 జట్లతో టోర్నీని నిర్వహించనున్నారు. టోర్నీకి అర్హత సాధించిన జట్లను ఏ గ్రూప్‌లో ఉంచాలి? ఏ మ్యాచ్‌లు ఎక్కడ ఆడించాలి? అనే వివరాల్ని కూడా త్వరలోనే ఐసిసి ప్రకటించనుంది.

**క్వాలిఫయర్స్ నుంచి**

వరల్డ్ కప్ టోర్నీకి భారత్, శ్రీలంకతో పాటు నిరుడు జరిగిన ప్రపంచ కప్‌లో టాప్7లో నిలిచిన అఫ్గనిస్థాన్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇంగ్లాండ్ దక్షిణాఫ్రికా, యూఎస్ఏ, వెస్టిండీస్‌లకు నేరుగా బెర్తు దక్కింది. ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ ఆధారంగా ఐర్లాండ న్యూజిలాండ పాకిస్థాన్ అర్హత సాధించాయి. ఆఫ్రికా క్వాలిఫయర్స్ ద్వారా నమీబియా, జింబాబ్వే వరల్డ్ కప్ బరిలోకి వచ్చాయి. యూరప్ క్వాలిఫయర్స్‌లో అదరగొట్టిన ఇటలీ, నెదర్లాండ్స్.. అమెరికన్ క్వాలిఫయర్స్ నుంచి కెనడాలు క్వాలిఫై అయ్యాయి. ఇక చివరి క్వాలిఫయర్ టోర్నీ అయిన తూర్పు ఆసియా ఫసిఫిక్ నుంచి ఒమన్, నేపాల్, యూఏఈలు ప్రపంచ కప్‌లో పోటీపడే అవకాశాన్ని పట్టేశాయి.

**వరల్డ్ కప్ బరిలోని జట్లు :**

భారత్, శ్రీలంక (ఆతిథ్య దేశాలు), ఆస్ట్రేలియా, అఫ్గనిస్థాన్, బంగ్లాదేశ్, ఇంగ్లాండ్ దక్షిణాఫ్రికా, యూఎస్ఏ, వెస్టిండీస్, ఐర్లాండ్, న్యూజిలాండ్, పాకిస్థాన్, కెనడా, ఇటలీ, నెదర్లాండ్స్, నమీబియా, జింబాబ్వే, నేపాల్, ఒమన్, యూఏఈ.

## ప్రపంచ రికార్డు..

### 11 బంతుల్లోనే ఆకాశ్ హాఫ్ సెంచరీ!



భారత క్రికెట్‌లో మరో సంచలనం నమోదైంది. మేఘాలయ బ్యాటర్ ఆకాశ్ చౌదరీ వేగవంతమైన హాఫ్ సెంచరీతో చరిత్ర సృష్టించాడు. దేశవాళీ టోర్నీలో పాపులర్ అయిన రంజీ ట్రోఫీలో ఆకాశమే హద్దుగా చెలరేగిన ఆకాశ్ కేవలం 11 బంతుల్లోనే అర్ధ శతకం సాధించాడు. ప్రత్యర్థి బౌలర్లను ఊచకోత కోసిన అతడు.. వరుసగా ఎనిమిది సిక్సర్లు బాదేసి యాభైకి చేరుకోవడం విశేషం. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీ నమోదు చేసిన అకాశ్ సునామీ ఇన్నింగ్స్ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరలవుతోంది. దేశవాళీ క్రికెట్‌లో ప్రతిభావంతులకు కొదవ లేదని చాటాడు మేఘాలయ బ్యాటర్ ఆకాశ్ చౌదరీ. రంజీ ట్రోఫీలో భాగంగా సూరత్‌లో ఆదివారం అరుణాల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ చిచ్చరపిడుగు నమ్మశక్యం కాని ఆటతో రెచ్చిపోయాడు. ఎనిమిదో స్థానంలో క్రీజులోకి వచ్చిన ఆకాశ్ తొలి మూడు బంతుల్లో రెండు పరుగులే తీశాడు. కానీ, నాలుగో బంతిని సిక్సర్‌గా మలిచి తన విధ్వంసానికి తెరతీశాడు.ఆరుణాచల్ బౌలర్లకు చుక్కలు చూపించిన అతడు ఆ తర్వాతి ఏడు బంతులను స్టాండ్స్‌లోకి పంపాడు. 11 బంతుల్లోనే ఫిఫ్టీతో లీగ్ చరిత్రలోనే వేగవంతమైన అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. తద్వారా దేశవాళీలో వరుసగా ఏడు బంతులకు ఏడు సిక్సర్లు బాదిన తొలి ఆటగాడిగా చరిత్రకెక్కాడు ఆకాశ్. ప్లేట్ గ్రూప్ మ్యాచ్‌లో సుడిగాలి ఇన్నింగ్స్ ఆడిన ఆకాశ్ ఐపీఎల్ ఫ్రాంచైజీల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఓపెనర్ అర్పిత్ భటేవరా ద్విశతకం(207), కెప్టెన్ కిషన్ లింగ్దోహ్(119), ఆర్ దలాల్ (144)లు సెంచరీలతో రెచ్చిపోగా.. ఆకాశ్ మెరుపులతో మేఘాలయ తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 628 పరుగులు చేసింది.

# ఆరోగ్యం ఫోకస్

## ప్రాణాయామంలో కొత్త విధానం




ఎక్కువ మంది ఆచరిస్తున్న ప్రాణాయామంలో కొత్త విధానాన్ని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ వైద్య పరిశోధకులు కనుగొన్నారు. మనోస్థైర్యాన్ని, శీఘ్రమైన మానిక ప్రశాంతతను పొందడానికి 'సైకిల్ సయింగ్' అనే శ్వాస విధానం ఉపయుక్తంగా ఉంటుందని వారు అంటున్నారు. దీనిని 'సైకలాజికల్ సయ్' అని కూడా పిలుస్తారు. ఇది శాస్త్రీయ పరమైన పద్ధతి. దీని ప్రాముఖ్యత, ఫలితాలు శాస్త్రీయంగా పరిశీలించి, ధ్యానం కంటే కూడా 'తక్షణ' ఉపశమనం ఇస్తుందనే విషయాన్ని నిరూపించారు. దీనిని సులభంగానే ఆచరించవచ్చు. సార్లు చిన్న, అర్ధ శ్వాసలు తీసుకొని, ఆ తర్వాత దీర్ఘంగా, ఒక్కసారి పూర్తిగా ఆ శ్వాసను విడిచిపెడతారు. ఇలా మూడు లేదా నాలుగు రౌండ్లు (సైకిల్స్) చేయాల్సి ఉంటుంది. సుమారు 5 నిమిషాలు ఈ ప్రక్రియలో ప్రాణాయామం జరిపితే, తక్షణ ప్రయోజనం ఉంటుందని పరిశోధకులు అంటున్నారు. దీనిని 111 మందిపై అధ్యయనం చేయగా, 'సైకిల్ సయింగ్' పార్టిసిపెంట్లు తమకు ధ్యానం, ఇతర శ్వాస ప్రయోగాలు కన్నా తక్కువ సమయంలోనే మెరుగైన విశ్రాంతిని, శరీరం, మనసు ప్రశాంతత లభించినట్టు చెప్పారు. ఈ సైకిల్ సయింగ్ వల్ల శరీరంలోని ఒత్తిడికి కారణమైన కార్టిసాల్ తదితర హార్మోన్‌లు తగ్గుతాయి. నర్వస్ సిస్టమ్ ద్వారా ఆందోళనకి కారణమయ్యే శరీర స్పందన నుండి విముక్తి లభిస్తుంది. దీనితో ఒత్తిడి ఆందోళన తగ్గి, మనసు ఉల్లాసంగా ఉంటుంది. శ్వాస అనేది మన శరీరంలో హృదయ స్పందన, జీర్ణక్రియ వంటి ఇతర సహజ క్రియల జాబితాలో చేరుతుంది. కానీ, మనం తక్కువ శ్రమతో, పూర్తి అవగాహనతో శ్వాసను నియంత్రించగలుగుతాం. దీని వల్లనే శరీరం, మనసును తక్షణంగా ప్రశాంతతకు తీసుకెళ్లడం సాధ్యమౌతుంది. దైనందిన శ్వాస ప్రయోగం ద్వారా దీర్ఘకాలిక మానసిక ప్రశాంతతను, స్థిరత్వాన్నిఅందిస్తాయి. ఇది పూర్తిగా ఉచితం, ప్రకృతిసిద్ధమైనది, ఎప్పుడైనా, ఎక్కడైనా చేయొచ్చు. మందులు అవసరం లేదు. యాప్స్ లేదా ప్రత్యేక శిక్షణ కూడా అవసరం లేదు. సులభంగా చేయదగినది కాబట్టి ఎవరైనా దీనిని అనుసరించవచ్చు.

## హృదయం కూడా ఆలోచిస్తుంది!



గుండెను చాలా మంది హృదయంగా పేర్కొంటారు. ప్రత్యేకించి కవులు హృదయంపై లెక్కనన్ని రచనలు చేశారు. హృదయం మాట్లాడుతుందని ఊహాత్మకంగా అల్లిన కవితలు నిజమేనని ఇప్పుడు శాస్త్రవేత్తలు అంటున్నారు. తాజా అధ్యయనాలను అనుసరించి మన గుండె కేవలం రక్తాన్ని పంపే ఒక పైపు మాత్రమే కాదు.. దానికి స్వంత నాడీ వ్యవస్థ కూడా ఉంది. మన గుండెలో సుమారు 40,000 న్యూరాన్లు ఉంటాయి. ఇవి మెదడులోని న్యూరాన్ల మాదిరిగానే విద్యుత్ సంకేతాలను పంపి, సమాచారాన్ని ప్రాసెస్ చేస్తాయి. మరో రకంగా చెప్పాలంటే, గుండె ఒక 'మినీ బ్రెయిన్'లాగా పని చేస్తుంది. స్వతంత్రంగా కొన్ని నిర్ణయాలు తీసుకుంటుంది. ఉదాహరణకు, మీ భావోద్వేగాలపై ప్రతిస్పందన ఇవ్వడం, లేదా ఒత్తిడిసమయంలో రక్త ప్రసరణను సర్దుబాటు చేయడం వంటివి చర్యలు చేపడుతుంది. ఇప్పటి వరకూ గుండెకు మెదడు ద్వారానే ఆదేశాలు వెళతాయని అనుకుంటూ ఉన్నారు. బాగా ప్రాచుర్యంలో ఉన్న సిద్ధాంతం ఇది. కానీ, మెదడు నుంచి గుండెకు వెళ్లే సంకేతాల కంటే, గుండె నుంచి మెదడుకు వెళ్లే సంకేతాలు ఎక్కువని 'హార్ట్‌మాథ్ ఇన్‌స్టిట్యూట్' తన కొత్త అధ్యయనం పేర్కొంటున్నది. వివిధ రకాలమైన భావోద్వేయాలు, ఆలోచనలు, నిర్ణయాలు కేవలం మెదడు పైనే కాకుండా, గుండెపైన కూడా ఆధారపడతాయి. అంతేకాదు, గుండె నుంచి వెలువడే ఎలక్ట్రోమాగ్నెటిక్ ఫీల్డ్ చాలా శక్తివంతమైంది. ఇది మీ చుట్టూ ఉన్నవారి భావోద్వేగాలపైనా ప్రభావం చూపగలదు. 'గుండెతో ఆలోచించు', 'హృదయపూర్వకంగా అనుభవించు' వంటి కవుల వర్ణనకు అర్థం ఉందని ఈ అధ్యయనం రుజువు చేస్తున్నది.

## గుండె కేన్సర్‌కు 'ప్యాచ్'



గుండె కవాటాల్లో లేదా కణాల్లో కేన్సర్ ట్యూమర్లు అరుదుగా వస్తాయి. కానీ, అవి చాలా ప్రమాదకరం. చికిత్స చేయడానికి ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయి. ప్రస్తుతం అనుసరిస్తున్న చికిత్సా విధానాలను అనుసరించి కెమోథెరపీతో వైద్యం అందిస్తున్నారు. అయితే, దీని వల్ల హృదయ కండరాలు దెబ్బతింటాయి. పైగా, అత్యంత సున్నితమైన గుండె కవాటాలను తెరవడంగానీ, చికిత్స జరపడంగానీ సమస్యాత్మకంగా మారింది. దీనికి చెక్ పెట్టడానికి జర్మనీ మాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు కొత్త విధానాన్ని కనిపెట్టారు. వీరు రూపొందించిన 'ప్యాచ్' గుండెకు బైపాస్ మాదిరి పని చేస్తుంది. ఇది గుండె కండరాలను అంటుకొని ఉంటుంది. కేన్సర్ మందులను నేరుగా వ్యాధి సోకిన గుండె కణాల్లోకి విడుదల చేసింది. గుండె పనికి ఎలాంటి ఆటంకం లేకుండా ఇది ప్యాచ్ పని చేస్తుంది. ఇది ప్రత్యేకంగా ట్యూమర్ కణాలను మాత్రమే టార్గెట్ చేస్తుంది కాబట్టి, దీనివల్ల గుండె మిగిలిన భాగాలు క్షతగాత్రం కావడం నివారిస్తుంది. క్లినికల్ పరీక్షల్లో 78 శాతం రోగులలో కేన్సర్ ట్యూమర్ కేవలం 8 వారాల్లో తరిగిపోవడాన్ని గమనించారు. మందులు పూర్తయ్యాక ఈ ప్యాచ్ సహజంగానే కరిగిపోతుంది. ఎటువంటి విదేశీ పదార్థం గుండెలో ఉండదు. కాగా, క్లినికల్ పరీక్షలు విజయవంతమైన నేపథ్యంలో, లివర్, ప్యాంక్రియాస్ వంటి ఆరు ఇతర ముఖ్య అవయవాలపై కూడాన ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. ఈ సాంకేతికతను నానో టెక్నాలజీ, బయో ఇంజనీరింగ్, ఆంకాలజీని కలిపి రూపొందించారు. దీనిని మరింత అభివృద్ధి చేసి దీనిని అభివృద్ధింత దేశాల్లో అందుబాటులోకి తేవడం వైపు దృష్టిపెడుతున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

### సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.భాషామియా



**ప్రజాపక్షం/నర్సంపేట:** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.భాషామియా అన్నారు. సిపిఐ నర్సంపేట మండల సమితి సమావేశం బాధరా బోయిన యాదగిరి అధ్యక్షతన మాదన్నపేట రోడ్డు సిపిఐ కాలనీలో ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సిపిఐ పుట్టి వంద సంవత్సరాలు గడుస్తున్నా సందర్భంగా ఖమ్మం నగరంలో 100 సంవత్సరాల ముగింపు సభను లక్షలాది మంది జనంతో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 40 దేశాల కమ్యూనిస్టు నాయకులు, దేశ కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఈ బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జాత కార్యక్రమాలను ప్రచార కార్యక్రమాలను నిర్వహించేందుకు జోడిగాట్ కొమురం భీం విగ్రహం నుంచి బయలుదేరే జాత 20న నర్సంపేటకు చేరుకోనున్న సందర్భంగా పార్టీ ప్రజాసంఘాల నాయకులు, సానుభూతిపరులు, ప్రజలు ఘనమైన స్వాగతం పలకాలని ఆయన కోరారు. ఈ జాతాలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, సిపిఐ కార్యదర్శి వర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, కలవేని శంకర్ పాల్గొంటారని తెలిపారు. ఈనెల 12, 13 తేదీలలో వరంగల్‌లో జరుగు జనసేవా దళ్ జిల్లా శిక్షణ శిబిరాలను విజయవంతం చేయాలని భాషామియా పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు అయితా యాకోబు, అక్కపెల్లి రమేష్, జిల్లా సమితి సభ్యులు గోవర్ధన్ మియాపురం, దిడ్డి పార్థసారధి, పాలక కవిత, ఓర్సు రాజు, నాయకులు పిట్టల సతీష్, గడ్డం యాకయ్య, నాగరాజు, కమ్మల వెంకన్న పాల్గొన్నారు.

## సిపిఐ సీనియర్ సభ్యురాలు సుగుణమ్మ మృతి



**ప్రజాపక్షం/చింతకాని :** భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ సభ్యురాలు, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వంకాయలపాటి సుగుణమ్మ (92) ఆదివారం మరణించారు. మండల పరిధిలోని నాగులవంచ గ్రామానికి చెందిన సుగుణమ్మ భర్త వంకాయలపాటి సీతయ్య సుదీర్ఘ కాలం కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా పనిచేశారు. సుగుణమ్మ రెండుసార్లు ఖమ్మం సమితి సభ్యురాలిగా పని చేశారు. తుదిశ్వాస వరకు కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలిగా సుగుణమ్మ కొనసాగారు. సుగుణమ్మ జాతీయ మహిళా సమాఖ్య ఖమ్మం జిల్లా నాయకురాలిగా రెండు దశాబ్దాల కాలం పాటు వివిధ హోదాలలో పనిచేశారు. ఆమె కుమారుడు వంకాయలపాటి సత్యనారాయణ సిపిఐ నుంచి ఎంపిటిసిగా పనిచేశారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సుగుణమ్మ మరణ వార్త తెలిసిన వెంటనే పలువురు సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్ తదితరులు సుగుణమ్మ మృతి పట్ల విచారాన్ని వ్యక్తం చేశారు. నిబద్ధత కలిగిన కమ్యూనిస్టును కోల్పోయామని వారు సంతాప సందేశంలో పేర్కొన్నారు. సుగుణమ్మ మృతదేహాన్ని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి సందర్శించి అరుణ పతాకాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లికార్జున్, నాయకులు తాళ్లూరి యాదగిరి, బిఆర్ఎస్ నాయకులు రంగారావు తదితరులు ఉన్నారు.

# అమరుల ఆశయ సాధనకు పునరంకితమవుదాం

### సిపిఐ విస్తరణకు కేశవరావు కృషి మరువలేనిది
### సంతాప సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అమరుల ఆశయాల సాధనకు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పునరంకితం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. సిపిఐ, ఎఐకెఎస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా సీనియర్ నాయకులు భాగం కేశవరావు సంతాప సభ మండలంలోని కేశవరావు కొత్త అంజనాపురంలో గ్రామంలో ఆదివారం జరిగింది. సంతాపసభకు ముఖ్య అతిధిగా హాజరైన కూనంనేని, సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా తదితరులు కేశవరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం జరిగిన సంతాపసభలో కూనంనేని మాట్లాడుతూ పేద వర్గాల అభ్యున్నతి కోసం, పార్టీ విస్తరణ కోసం కేశవరావు నిరంతరం కృషి చేశారన్నారు. సుజాతనగర్ పరిసర ప్రాంతాల్లో పార్టీ విస్తరణకు కేశవరావు ఎనలేని కృషి చేశారన్నారు. అనేక ప్రజా, రైతు ఉద్యమాలు నిర్మించి సమస్యల పరిష్కారం కోసం శక్తి వంచన లేకుండా పనిచేశారని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకుడిగా ప్రతీ పోరాటంలో అగ్రభాగాన నిలిచారని కొనియాడారు. కేశవరావు స్ఫూర్తితో ఆయన ఆశయాలను సాధించేందుకు, పార్టీ బలోపేతానికి నేటితరం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. సంతాపసభ కార్యక్రమంలో సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు బూక్యా ధస్రు, సిపిఐ మండల కార్యదర్శి కొమారి హన్మంతరావు, జిల్లా సమితి సభ్యులు, నాయకులు జక్కుల రాములు, తాళ్లూరి పాపారావు, భాగం కృష్ణయ్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ప్రజా ఉద్యమాలతో ముందుకు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్

**ప్రజాపక్షం/మంచిర్యాల :** సమస్యల పరిష్కారానికి నిత్యం ప్రజా ఉద్యమాలతో ముందుకు సాగుతామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ పేర్కొన్నారు. సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరగనున్న శత జయంతి వేడుకల ముగింపు సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఈనెల 15న ఆసిఫాబాద్ కొమురంభీం జిల్లా జోడేఘాట్ నుండి భద్రాచలం వరకు ప్రారంభమయ్యే బస్సు జాతలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, జాతీయ నాయకులు చాడ వెంకట రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఆదివారం సిపిఐ జిల్లా సమితి సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యులు ఇప్పకాయల లింగయ్య అధ్యక్షతన సిపిఐ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కలవేన శంకర్ మాట్లాడుతూ దేశంలో ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ నిత్యం ఉద్యమాలతో ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రణాళికలు రచించిన విటి అబ్రహం, పి.నర్సయ్య, బాశెట్టి గంగారాం, గుండా మల్లేష్ లాంటి అనేక మంది నాయకులు ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు. నిజాం నవాబుకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంతో 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచింది సిపిఐ అని, తెలంగాణ ఉద్యమంలో అగ్రభాగాన నిలబడిందని, కార్మిక వర్గ ఉద్యమాలకు నాయకత్వం వహించిందని ఆయన వివరించారు. ఖమ్మం నగరంలో వంద సంవత్సరాల ముగింపు సభకు 40 దేశాల కమ్యూనిస్టు నాయకులు హాజరవుతారని తెలిపిరాఉ. ఈ బహిరంగ సభ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జరిగే జాత కార్యక్రమాలను ప్రచార కార్యక్రమాలను నిర్వహించేందుకు జోడిగాట్ కొమురం భీం విగ్రహం దగ్గర నుండి బయలుదేరే జాతలకు పార్టీ ప్రజాసంఘాల నాయకులు, సానుభూతిపరులు, ప్రజలు ఘనమైన స్వాగతం పలకాలని ఆయన కోరారు. సమావేశంలో సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామదుగు లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి, మేకల దాసు, జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కలిందర్ అలీ ఖాన్, చిప్ప నర్సయ్య, దాగం మల్లేష్, కారుకూరి నగేష్, మిట్టలపల్లి శ్రీనివాస్, లింగం రవి పాల్గొన్నారు.




## ఆక్రమణలకు గురవుతున్న భూముల పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత



### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మ

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ భూముల పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మ, సిపిఐ నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ అన్నారు. ఆదివారం కొల్లాపూర్ మండలంలోని ఏల్లూరు శివారులో గల నల్లమల రిజర్వు ఫారెస్టు దగ్గర్లో ఉన్న సర్వే నెంబర్ 359, 360, 364, 365 మొత్తం 48 ఎకరాల భూమిని కొంతమంది వ్యక్తులు ప్రైవేట్ భూమి అని, అక్కడ ఉన్న గుట్టలను తొలుస్తూ లక్షలాది చెట్లను అక్రమంగా తొలగించి ఎటువంటి ఆనవాలు లేకుండా చేసి భూమి స్వభావాన్ని మారుస్తుండంతో ఆదివారం ఆ ప్రాంతాన్ని సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా బాల్‌నర్సింహ్మ మాట్లాడుతూ ప్రధానంగా ఈ భూమి 1995–96వరకు సీలింగ్ భూమి సర్కార్ భూమి అని, రెవెన్యూ రికార్డులలో స్పష్టంగా ఉందన్నారు. 2009–2010 సంవత్సరాలకు మధ్యలో జటప్రోలు రాజాగారు అయినటువంటి ఆదిత్య లక్ష్మణరావు సోదరి సుభారాణి పైన పట్టా ఉంది అని చెప్పి ఒ ప్రముఖ ఫార్మా కంపెనికి చెందినవారు కొనుగోలు చేశారని, ఇక్కడ సమాచారం ఉంది ఇది రెవెన్యూ అధికారులు సీలింగ్‌భూమి ఏవిధంగా పట్టా భూమి అయిందో సమాధానం చెప్పాలన్నారు. ఈ మొత్తం ప్రక్రియలో పూర్తిగా చట్టాలను పక్కనపెట్టేసి వ్యక్తుల ఇష్టానుసారంగా జరుగుతుంటే రెవెన్యూ అధికారులు, ఫారెస్టు అధికారులు కళ్లు మూసుకొని వారికి సహకరిస్తున్నారు కాని అడ్డుకునే పరిస్థితిలేదని ఆయన ఆరోపించారు. ఈ భూములపైన సమగ్ర విచారణ జరిపి పట్టాలను రద్దు చేయాలని బాల్‌నర్సింహ్మ డిమాండ్ చేశారు. స్థానిక మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ భూముల వ్యవహారంపై తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని బాల్‌నర్సింహ్మ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు టి.నర్సింహ్మ, కె.యేసయ్య, ఆర్.ఇందిర, మండల కార్యదర్శి తుమ్మల శివుడు, జిల్లా సమితి సభ్యులు కుర్మయ్య, శివశంకర్, కృష్ణ, జంగంశివుడు, వెంకటస్వామి, శివ, రామకృష్ణ, రవిప్రకాష్‌కుమార్, రమణ, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## భువనగిరిలోని అర్బన్ కాలనీలో అగ్ని ప్రమాదం

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరిలోని అర్బన్ కాలనీలో అగ్నిప్రమాదం ఆదివారం జరిగింది. అర్బన్ కాలనీలోని తడక ప్రమీల ఇంట్లో అగ్ని ప్రమాదం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో ప్రమాదవశత్తు ఇంట్లో మంటలు అంటుకున్నాయి. ఇంట్లో ఉన్న డబ్బు, బంగారం, బియ్యం బట్టలు, బీరువులో ఉన్న పూర్తిగా దగ్ధమయ్యాయి, మంటలు అంటుకున్న సమయంలో ఇంట్లో ఎవరూ లేరు, ఇంట్లో నుండి మంటలు రావడంతో ఇరుగు పొరుగు వారు చూసి ఇంటి తాళం పగలకొట్టి మంటలు ఆర్పారు. సుమారు 5 లక్షల వరకు నష్టం జరిగిందని బాధితులు తెలిపారు.



## రాజీయే రాజ మార్గం : జిల్లా ఎస్‌పి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఈనెల 15 శనివారం రోజు జరిగే స్పెషల్ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని, రాజీయే రాజ మార్గమని సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ స్పెషల్ లోక్ అదాలత్ నందు రాజీ పడదగిన కేసులలో, క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన కేసులు, డ్రంకన్ డ్రైవ్ కేసులు, మోటారు ట్రాన్స్‌పోర్ట్ రోడ్డు నిబంధనలు ఉల్లంఘన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంక్ రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్‌బౌన్స్ ఇలా రాజీపడదగిన కేసుల్లో కక్షిదారులు రాజీ చేసుకోవాలని సూచించారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకొని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృధా చేసుకోవద్దన్నారు. న్యాయశాఖ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్‌లు, ఇతర పోలీస్ సిబ్బంది రాజీపడ్డ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీపడేటట్లు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఎవరైనా తమ కేసులలో రాజీ కావాలనుకునేవారు సంబంధిత పోలీస్ అధికారులకు సంప్రదించాలని, లోక్‌అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని వివరించారు.

## సుధా బ్యాంక్ ఎన్నికలు ఏకగ్రీవం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సుధా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలక వర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల అధికారి మురళీరమణ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ గత పది రోజులుగా కొనసాగి ఆదివారం ముగిసింది. బ్యాంక్ చైర్మన్‌గా మీలా మహదేవ్, వైస్ చైర్మన్‌గా కక్కిరేణి చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. గత పాలకవర్గంలో డైరెక్టర్లు కక్కిరేణి చంద్ర శేఖర్, డాక్టర్ మీలా సందీప్, అడ్వకేట్ ఏపూరి శ్రవణ్ కుమార్, బాణావత్ సుజాత తిరిగి ఎన్నిక కాగా కొత్తగా అప్పం శ్రీనివాస్, డాక్టర్ మిన్నా విజయ లక్ష్మి, పటేల్ నరసింహారెడ్డి, తోట శ్యాంప్రసాద్, అనంతుల శారదలు ఎన్నికయ్యారు. అనంతరం వారితో ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. గత ఏడు సార్లుగా పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక కావడం సహకార బ్యాంకుల చరిత్రలో ఒక రికార్డుగా ఎన్నికల అధికారి చెప్పారు. బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ మాట్లాడుతూ బ్యాంక్ యొక్క పనితీరు బ్యాంక్ అందిస్తున్న ఉత్తమ సేవల ఫలితంగా సుధాబ్యాంక్ పట్ల వాటాదారులలోను ఖాతాదారులలోను అచంచలమైన విశ్వాసం ఏర్పడిందన్నారు. ఈ ఎన్నిక ద్వారా అతి తేటతెల్లమైనందని చెప్పారు. వాటాదారులందరూ ఈ ఎన్నికల ద్వారా మాపై ఉంచిన విశ్వాసాన్ని మరిన్ని మెరుగైన ఫలితాలతో నిరూపించుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## సాగర్ ఎడమ కాలువలో పడి లారీ డ్రైవర్ గల్లంతు



**ప్రజాపక్షం/గరిడేపల్లి :** మండలంలోని మర్రి కుంట గ్రామ సమీపంలో ఉన్న సాగర్ ఎడమ ప్రధాన కాలువలో ప్రమాదవశాత్తు పడి లారీ డ్రైవర్ గల్లంతయ్యాడు. గల్లంతైన లారీ డ్రైవర్ మంచిర్యాల జిల్లా రాజీవ్ నగర్‌కు చెందిన ఈట శ్రీకాంత్‌గా పోలీసులు గుర్తించారు. చెన్నై నుంచి కెమికల్ బ్యాగ్స్ లోడుతో మంచిర్యాలకు వెళ్తుండగా ఆదివారం మధ్యాహ్నం గరిడేపల్లి మండలం మర్రి కుంట సమీపంలోని సాగర్ ఎడమ ప్రధాన కాలువ వద్దకు చేరుకున్నారు. అక్కడ లారీని ఆపి డ్రైవర్ క్లీనర్ ఇతర లారీ డ్రైవర్లతో కలిసి వంట చేసుకొని భోజనం చేసి కాళ్లు చేతులు కడుక్కునేందుకు కాలువ ఒడ్డుకు చేరుకున్న క్రమంలో ఈట శ్రీకాంత్ (36) అనే లారీ డ్రైవర్ కాలువలో పడి గల్లంతయ్యాడు. గరిడేపల్లి ఎస్‌ఐ చలికంటి నరేష్ పర్యవేక్షణలో గల్లంతైన వ్యక్తి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## 96వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నల్లగొండ జిల్లాలో 300 ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన 96వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని డీసీవో ఎం.పత్యానాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని అవంతీపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రంలోని ధాన్యం రాశులను పరిశీలించి ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, 17శాతం తేమ ఉంటేనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. జిల్లా వ్యాప్తంగా మరో 75 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రూ.158 కోట్లను రైతుల ఖాతాల్లో జమా చేయడం జరిగిందన్నారు. అవంతీపురం మార్కెట్‌యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేయకుండానే అద్దదారులు ట్రక్‌షీట్ జారీ చేయడంపై డీసీవో విచారణ నిర్వహించారు. అద్దదారులో ట్రక్ షీట్ జారీ చేయడంపై డీసీవో విచారణ నిర్వహించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఏడీవ డి.సైదానాయక్ ఉన్నారు.

## బాలభవన్ కార్యక్రమాలతో సృజనాత్మకత

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** బాలభవన్‌లో నిర్వహించే కార్యక్రమాలు విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకత ఎంతో ఉపకరిస్తాయని విశ్రాంత అధ్యాపకులు హమీద్‌ఖాన్, హైమావతి, అడ్వకేట్ కృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో ఆదివారం బాలభవన్ నాల్గవ వార్షికోత్సవం, నవంబర్ 14 బాలల దినోత్సవాల సందర్భంగా నిర్వహించిన డ్యాన్స్, డ్రాయింగ్, వాయిద్యం, సంగీతం, క్రాఫ్ట్, లలిత కళల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బండి రాధాకృష్ణరెడ్డి, సైంటిస్ట్ డాక్టర్ అనంతుల రవిశేఖర్, గిన్నీస్ బుక్ రికార్డు హోల్డర్, కళాకారులు డాక్టర్ పెండెం కృష్ణ కుమార్, సిబ్బంది దాసరి ఎల్లయ్య, సత్య నారాయణ సింగ్, ఉమారాణి, అనిల్, సాయి, వీరయ్య, పద్మ పాల్గొన్నారు.



# బిసి రిజర్వేషన్లు సామాజిక తెలంగాణ నిర్మాణంలో కీలక అడుగు

తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం



**ప్రజాపక్షం/సూర్యాపేట :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన సామాజిక తెలంగాణ నిర్మాణంలో కీలక అడుగని తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఆదివారం సూర్యాపేటలోని తిరుమల గ్రాండ్ కాన్ఫరెన్స్ హాల్లో తెలంగాణ జనసమితి జిల్లా కమిటి ఆధ్వర్యంలో యువజన సమితి నాయకులు నారబోయిన కిరణ్ అధ్యక్షతన నిర్వహించిన సామాజిక తెలంగాణ బిసి రిజర్వేషన్లు ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంపై జరిగిన సదస్సులో ప్రధాన వక్తగా పాల్గొని ఆయన మాట్లాడారు. సదస్సు ప్రారంభంలో మహాత్మాజ్యోతిరావుపూలే, బిఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. తెలంగాణ ప్రజలు ఎన్నో త్యాగాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం ఆదిపత్య వర్గాల బదలాయింపుకు కాదన్నారు. ప్రజలందరికి భాగస్వామ్యం కల్పించడం కొరకు సాధించుకున్నామన్నారు. ఆ దిశగా అడుగులు వేయడమే తెలంగాణ ప్రజల యొక్క కర్తవ్యమని స్పష్టం చేశారు. బిజెపి మొదటి నుంచి కులగణనకు వ్యతిరేకమని, రాష్ట్ర ప్రభుత్వం కుల గణన ప్రారంభించడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. అందరూ ఐక్యంగా పోరాడి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు సాధించాలన్నారు. ప్రజలకు కావల్సింది ఉచిత పథకాలు కాదు సమానత్వం, ఆత్మగౌరవం అన్నారు. రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన చట్టాలు, ఆర్డినెన్స్‌లను గవర్నర్లు ఆమోదం తెలపకపోవడం దురదృష్టకరమన్నారు. రిజర్వేషన్లు 50 శాతం దాటొద్దనేది సుప్రీం కోర్టు తీర్పు కాదని, 1931 బిసి సెన్సస్, 1961 సెన్సస్, 1979 మండల కమీషన్ రిపోర్టులను పరిగణలోనికి తీసుకొని అప్పటి పరిస్థితుల్లో కోర్టు ఆ అభిప్రాయం వ్యక్తం చేస్తిందని వివరించారు. రిజర్వేషన్లు సవరించుకోవచ్చని మండల కమీషన్ రిపోర్టులోనే ఉందన్నారు. రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చి న్యాయ సమీక్ష నుండి రక్షణ కల్పించాలన్నారు. ప్రజలు ఎన్నుకున్న శాసనసభ చట్టం చేసి పంపితే దాన్ని తిరస్కరించే అధికారి గవర్నర్లకు లేదన్నారు. గవర్నర్లు కేంద్ర ప్రభుత్వ ఏజెంట్లుగా వ్యవహరిస్తూ ఫెడరల్ వ్యవస్థకు తూట్లు పొడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక అసమానతలను నిర్మూలించడంలో రిజర్వేషన్లు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. తెలంగాణ జన సమితి పార్టీ ఏర్పడిందే సామాజిక ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణం కోసమన్నారు. పదేండ్ల టిఆర్‌ఎస్ పాలనలో బిసిలకు అన్యాయం జరిగిందని, ఉన్న రిజర్వేషన్లను కూడా తగ్గించారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా సదస్సులు, సెమినార్లు నిర్వహించి ప్రజల్లో చైతన్యం కలిగిస్తామని, డిసెంబర్‌లో హైదరాబాద్‌లో భారీ ర్యాలీ, జనవరిలో ఢిల్లీలో దీక్షలు, ధర్నాలు నిర్వహిస్తామని ప్రకటించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్ మాట్లాడుతూ బిజెపి నాయకులు ఇక్కడ మద్దతు తెలపడం కాదు ఢిల్లీలో ఉన్న పార్టీ వైఖరి ఏమిటో చెప్పే విధంగా ఆ పార్టీ నాయకత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. అనంతరం సదస్సు పలు తీర్మానాలను ఆమోదించింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గట్ల రమాశంకర్, విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు నాగరాజు గౌడ్, బిసి జెఏసి కన్వీనర్ చల్లమల్ల నరసింహ, లీగల్‌సెల్ జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్ నాయక్, విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షులు బొమ్మగాని వినయ్‌గౌడ్ పాల్గొన్నారు.

## రాష్ట్ర కళ సాధన కోసం యాదవ బిడ్డలు కృషి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, క్యామా మల్లేష్

రాష్ట్రాభివృద్ధికి అందరూ ముందుకు రావాలి




**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** రాష్ట్రా అభివృద్ధికి అందరూ ముందుకు రావాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, బిఆర్‌ఎస్ భువనగిరి పార్లమెంట్ ఇన్చార్జి క్యామ మల్లేష్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో శ్రీకృష్ణ యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు పుట్టా వీరేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన యాదవ సదర్ సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర కళ సాధన కోసం యాదవ జాతి బిడ్డలు ఎంతో కృషి చేసారని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, క్యామా మల్లేష్ అన్నారు. ప్రతి సంవత్సరం అందరూ కలిసి ఈ సదరు సమ్మేళనం కార్యక్రమం అందరూ కలిసిని ర్వహించడం గొప్ప విషయం అన్నారు. మన సంస్కృతి సాంప్రదాయాలను ముందు తరాలకు తెలియజేయాలన్నారు. ముందుగా భువనగిరిలోని సాయిబాబా గుడి నుండి జూనియర్ కళాశాల మైదానం వరకు దున్నపోతులను ఊరేగిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఈ సమ్మేళన కార్యక్రమానికి దున్నపోతుల విన్యాసాలను వీక్షించడానికి పట్టణ ప్రజలతో పాటు వివిధ ప్రాంతాల నుండి ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ భువనగిరి పార్లమెంట్ ఇన్చార్జి క్యామ మల్లేష్, తెలంగాణ గౌట్ అండ్ షిప్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్, తోట స్వామి యాదవ్, జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్, నక్కల చిరంజీవి యాదవ్, బెల్లి శేఖర్ యాదవ్, శ్రీకృష్ణ యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుండెబోయిన సురేష్ యాదవ్, మేకల బాల నరసింహయాదవ్, మల్లయ్య, సిరబోయిన వెంకటేష్ యాదవ్, అవిశెట్టి రమేష్ యాదవ్, రేకల రమేష్ యాదవ్, రాశల నవీన్ యాదవ్, పర్వతం రంజిత్ యాదవ్, బాద్కా అశోక్ యాదవ్, శ్రీరామ్ శరత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## కార్తీక వనభో'జనం' సందడి

**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట పట్టణ పరిధిలో గల కొహ్యేన్స్ లైఫ్ సైన్సెస్ లిమిటెడ్, సూర్యాపేట యూనిట్ వారి ఆధ్వర్యంలో కంపెనీలో పనిచేస్తున్న అధికారులు, కార్మికులు, వర్కర్స్, వారి కుటుంబ సభ్యులందరూ ఆదివారం కార్తీక వనభోజనాల కార్యక్రమం కంపెనీ పరిసర ప్రాంతంలో అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. స్వాగత తోరణాలతో, సెల్ఫీ పాయింట్లతో, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆకాశమంత పందిరిలా ఉన్న వనంలో కంపెనీలో విధులు నిర్వహిస్తున్న చిన్న, పెద్ద తేడా లేకుండా కంపెనీ ఉద్యోగులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం, కార్తీక వనభోజనాల రూపేనా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పైలా శంకర్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిధిగా యూనిట్ హెడ్ ఎం రమేష్ బాబు హాజరై మాట్లాడారు. వన భోజనం విశిష్టత గురించి ఉద్యోగ కుటుంబాలకు రోడ్డు భద్రత, ఆరోగ్య భద్రత, సంక్షేమం ఉద్యోగులకు ఐక్యత గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధిపతులు పిజె రాయుడు, ఎంవి రమణ, ఆర్‌వి రమణ, రమణారెడ్డి, సాయికుమార్, సిహెచ్ నరేష్, సైదులు, ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## బుద్ధవనం సందర్శించిన విదేశీ బౌద్ధ భిక్షువులు

**ప్రజాపక్షం/నందికొండ:** అంతర్జాతీయ పర్యాటక కేంద్రం బుద్ధవనాన్ని థాయిలాండ్ బౌద్ధ భిక్షువులు సందర్శించారు. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాలోని సిద్ధార్థ బుద్ధ విహార నుండి బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య సూచన మేరకు నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం సందర్శించారు.గగన్ మాలిక్ ఫౌండేషన్,గుల్బర్గా బౌద్ధ విహార సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి దమ్మయాత్ర కోసం ఈబృందం బుద్ధవనం సందర్శించారు. వీరికి బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దమ్మ చారి శాసన,ఎస్టేట్ ఆఫీసర్ రవి చంద్ర, బుద్ధవనంఆర్ట్స్ ప్రమోషన్ మేనేజర్ శ్యాంసుందర్ రావులు బుద్ధవనం విశేషాలను వివరించారు. వీరు ముందుగా బుద్ధవనం సందర్శనలో భాగంగా బుద్ధ చరిత వనంలోని బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించి బుద్ధ వందనం సమర్పించారు.అనంతరం బుద్ధ చరితవనం,జాతక వనం,ధ్యానవనం,స్థూప వనం, మహాస్తుపాలను సందర్శించి బుద్ధ వనంలోని శిల్పాల ఏర్పాట్లపై ప్రశంసించారు.ప్రశాంత వాతావరణంలో అలనాటి బౌద్ధ వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించి వారికి ప్రేరణ కలిగించడం ప్రస్తుత సమాజానికి ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు.నాగార్జునసాగర్‌లోని ప్రశాంత వాతావరణంలో బుద్ధవనాన్ని ఏర్పాటు చేయడం ప్రపంచ బౌద్ధ బిక్షవులకు ఒక ఆరాధన కేంద్రంగా విలసిల్లుతున్నదని అన్నారు. బుద్ధావనం అంతర్ భాగంలోని ధ్యాన మందిరంలో బుద్ధం,సంఘం,బుద్ధం శరణం అనే బుద్ధుని ప్రాథమిక దమ్మ ప్రబోధాన్ని తెలియజేశారు. బుద్ధ ధర్మం గురించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుల్బర్గా నుండి వచ్చిన థాయిలాండ్, కంభోడియా,యుఎస్‌ఏ, భారతదేశ బౌద్ధ బిక్షులు,ఉపాసకులు పాల్గొన్నారు. థాయిలాండ్ ఉపాసిక లిథ, బుద్ధ విహార గుల్బర్గా నుండి రతన జ్యోతో, నాగార్జునసాగర్ డ్యాం భద్రత అధికారులు శ్రీనివాసరావు,రఘు ,పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ పాల్గొన్నారు.



## కుక్కల సమస్యలపై పాల్వంచ హరికిషన్ కార్టూన్



**ప్రజాపక్షం/ రామన్నపేట:** బడులు, బస్టాండ్ వద్ద కుక్కల వద్ద తీవ్రంగా ఉన్న కుక్కల సమస్యకు పరిష్కారం చూపుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సందర్భంగా మరో సమస్య(కోతులు)ను కూడా ఎత్తి చూపుతూ రామన్నపేట మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త, కవి, ఉపాధ్యాయుడు, కార్టూనిస్టు పాల్వంచ హరికిషన్ వేసిన కార్టూన్ ఆలోచింపచేసేదిగా ఉంది. ముఖ్యమైన ప్రాంతాలైన బడులు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌లు, ఆట స్థలాలు తదితర జనావాసాల్లో కుక్కలను నిబంధనల ప్రకారం కట్టడి చేయాలని సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాలకు ఆర్డర్ వేయడం మంచి నిర్ణయమని హరికిషన్ అన్నారు. అదేవిధంగా తెలంగాణాలోని అన్ని ప్రాంతాల్లో కుక్కల సమస్యతోపాటు కోతుల సమస్య కూడా తీవ్రంగా ఉందని ఆ సమస్యకు కూడా నిబంధనల ప్రకారం పరిష్కారం చూ పాలని ఈ వ్యంగ్య చిత్రం ద్వారా కోరుతున్నానని, కోర్టులు, ప్రభుత్వాలు తగిన నిర్ణయం తీసుకోవాలని, ప ర్యావరణ పరిరక్షనలో కూడా సముచితమైన అంశంగా చూడాలని ఆయన కోరారు.

## దేవాలయ భూముల పరిరక్షించాలి



**ప్రజాపక్షం/ కోదాడ:** కోదాడ పట్టణ పరిధి కోదాడ, ఖమ్మం ప్రధాన రహదారి సమీపంలోని ఎంతో విలువైన దేవాలయ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని వాటిని అధికారులు పరిరక్షించాలని కోదాడ సిపిఐ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బత్తినేని హనుమంతరావు ప్రభుత్వన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం గుంటూరు జిల్లా అమరావతిలో ప్రముఖ శివాలయానికి చెందిన రెండు ఎకరాల 13 కుంటలు, తమ్మర బండపాలెం శ్రీబాలాజీ దేవాలయానికి చెందిన 2 ఎకరాల 16 కుంటల భూమి ఉన్నది. గతంలో ఓజాతీయ పార్టీకి చెందిన నాయకులు అక్రమణకు ప్రయత్నిస్తే సిపిఐ పార్టీ ఆందోళనలతో నాడు ఆక్రమణను అడ్డుకున్నామని, నేడు తిరిగి దేవాయల భూముల ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని దేవాదాయ శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో అడ్డుకోవాలని లేని పక్షంలో తమ పార్టీ ఆందోళ చేయవలసి వస్తుందని హెచ్చరించారు. ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా పేదలకు పంపిణీ చేశాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు మేకల శ్రీనివాసరావు పాల్గన్నారు.

## సాహిత్యం అభ్యుదయ సమాజాన్ని కాంక్షించాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** సమాజంలో విలువలను పరిరక్షించేది సాహిత్యమేనని ప్రముఖ సాహితీవేత్త సుంకిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సమాజంలో అనివార్యంగా వస్తున్న మార్పులను సాహిత్యకారులు స్వాగతించాలని నేటి తరం విద్యార్థులు సమకాలీన సాహిత్యంపై జరుగుతున్న సాహిత్య సదస్సులకు సమావేశాలకు హాజరై నూతన విషయాలను తెలుసుకోవాలి అన్నారు. ఆదివారం గ్రంథాలయ ఉద్యమకారులు వట్టి కోట ఆళ్వారు స్వామి జయంతి ఉత్సవాల సందర్భంగా తెలంగాణ సాహితీ ఉమ్మడి నల్లగొండ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన సాహిత్య సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ సాహిత్య సృజనలో పుస్తకాల ముద్రణలో, ఆ పుస్తకాలను పాఠకులకు చేర్చడంలో వస్తున్న నూతన విధానాలను అందిపుచ్చుకోవాలన్నారు.తెలంగాణ సాహితీ చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. పాఠశాల స్థాయి పిల్లలనుండి యూనివర్సిటీ స్థాయి విద్యార్థుల వరకు తెలంగాణ సాహిత్య సమావేశంలో పాల్గొనడం అభినందనీయమన్నారు.నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధాన ఆచార్యులు ప్రొఫసర్ బెల్లి యాదయ్య విద్య సమాజం అనే అంశంపై ప్రసంగించారు. ఏ సమాజం అభివృద్ధి చెందాలన్నా విద్యారంగం అభివృద్ధి చెందాలని, అందుకోసం సమా జం ఉపాధ్యాయులు కృషి చేయాలని యాదయ్య ఆకాంక్షించారు. తెలంగాణ సాహితి ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు కుకుడాల గోవర్ధన్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య,రిటైర్డ్ ఐఏఎస్ చోల్లేటి ప్రభాకర్,అద్దంకి కృష్ణమాచార్య,ప్రముఖ కవి విమర్శకులు మేరెడ్డి యాదగిరి రెడ్డి,బైరెడ్డి కృష్ణారెడ్డి,డాక్టర్ సలీమా,ఏభూషి నరసింహ,నల్లా నర్సింహ,అంబటి వెంకన్న డాక్టర్ పగడాల నాగేందర్,భూంత ముత్యాలు,మునాస్ వెంకట్ ,పెరుమాళ్ల ఆనంద్, డాక్టర్ ఉప్పల పద్మ,డాక్టర్ సాగర్ల సత్తయ్య,కోమటిరెడ్డి బుచ్చిరెడ్డిలు పాల్గొన్నారు.



## బిసి రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలి : ప్రసన్న కుమార్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** బీసీలకు విద్య,ఉద్యోగ,స్థానిక సంస్థల ఎన్నికలలో 42 రిజర్వేషన్లు కల్పించడం కోసం రాజ్యాంగ సవరణ చేయాలని బీసీ జేఏసీ చైర్మన్ మునాస ప్రసన్న కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక పట్టణంలోని టిఎన్‌జిఓ భవన్‌లో నిర్వహించిన కుల సంఘాల సమావేశంలో 40 కుల సంఘాలకు సంబంధించిన నాయకులు పాల్గొనడం జరిగింది. అన్ని కుల సంఘాల నాయకులు బీసీ జేఏసీ చైర్మన్ మునాస ప్రసన్నకుమార్‌ని జిల్లా జేఏసీ చైర్మన్‌గా ఆమోదం తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే ఏ కార్యక్రమాన్నైనా విజయవంతం చేయాలని కుల సంఘాల నాయకులందరూ తీర్మానించడం జరిగింది. డిసెంబర్ ఫస్ట్ నుంచి నిర్వహించే పార్లమెంటు సమావేశాలలో బీసీ బిల్లు కోసం ప్రతిపక్షాలుచ,అధికారపక్షం పార్లమెంట్లో చర్చించి బీసీ బిల్లును ఆమోదింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ మన్మయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుంటోజు వెంకటాచారి,రజక సంఘం జిల్లా అధ్యక్షులు చిలుక రాజు చెన్నయ్య,మున్నూరు కాపు సంఘం వైద్యుల సత్యనారాయణ,పాల్వాయి రవి,గౌడ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుకల శంకర్ గౌడ్,పద్మశాలి సంఘం కర్నాటి యాదగిరి,యాదవ సంఘం చెన్నూరి భరద్వాజ యాదవ్,మేరు సంఘం నవీన్ కుమార్,ముదిరాజ్ సంఘం దుద్దు కృష్ణమూర్తి,బెస్త సంఘం అంబటి శివకుమార్, మైనార్టీ నాయకులు ఖదీర్,వివిధ కుల సంఘాల నాయకులు పందుల సైదులు గౌడ్,గండిచెరువు వెంకన్న గౌడ్,అయితగోని జనార్దన్ గౌడ్,పుట్ట వెంకన్న గౌడ్,మార్గం సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## గేదెలను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

**ప్రజాపక్షం/మోటకొండూరు :** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామ ప్రధాన రహదారిపై చర్చి ఆవరణలో తొర్రూర్ డిపోకు చెందిన టి ఎస్ 26 జెడ్ 0030 నెంబర్ గల ఆర్టీసీ బస్సు గేదెలను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఒక గేదెకు బస్సు బలంగా ఢీకొట్టడంతో ఒక గేదె చావు బ్రతుకుల మధ్య నడిరోడ్డు మీద కొట్టుమిట్టులాడుతు మృతి చెందింది. పాడి గేదె నిండు సుడితో ఉండడంతో గేదె మరణం స్థానికులను గ్రామస్తులను కలచివేసింది. ఈ ఘటన చూసిన గ్రామానికి చెందిన గేదెల కాపరి, యజమాని అడేపు సోములు అక్కడే సొమ్మసిల్లి పోవడంతో అతని ఆస్పత్రికి తరలించారు. ఘటన జరిగిన వెంటనే బస్సు డ్రైవర్ బస్సు దూకి పరారయ్యాడు. బాధితుడికి న్యాయం చేయాలని కోరుతున్న గ్రామస్తులు, ప్రధాన రహదారిపై కాసేపు స్వల్ప ట్రాఫిక్ జాబ్ గేదెలను రోజువారీగా మేత అనంతరం ఇంటికి తరలిస్తుండగా ప్రమాదం జరిగింది అని స్థానికులు తెలిపారు. ఘటన స్థలానికి చేరుకున్న స్థానిక ఎస్సు అశోక్ ప్రమాదానికి గల వివరాలు సేకరిస్తున్నారు.



# స్థానికం

REGIONAL NEWS

మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## ఆటోడ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన

### ఎస్ఐ విజయ్‌కుమార్

**ప్రజాపక్షం/మద్దూర్ :** పట్టణ కేంద్రంలో ఆటోడ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై ఆదివారం రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ట్రాఫిక్ నిభంధనలు, వాహన పత్రాలు, హెల్మెట్ వినియోగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని సూచించారు. ప్రజల ప్రాణ భద్రత మనందరి బాధ్యత అని, ఆటోడ్రైవర్లు ఎల్లప్పుడు జాగ్రత్తగా వాహనాలు నడపాలని, చిన్నపాటి నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని తెలిపారు. అదేవిధంగా ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను, విద్యార్థులను, కూలీలను ఎక్కించుకోరాదని, అలాగే ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తన, చట్ట ఉల్లంఘనలకు పాల్పడరాదని సూచించారు. ర్యాష్ డ్రైవింగ్ చేయరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ఆటో డ్రైవర్లు యూనిఫామ్ ధరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఆటోడ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా అంతర్జాతీయ న్యాయ సేవల దినోత్సవం

**ప్రజాపక్షం/ఆత్మకూరు :** ఆత్మకూరు పట్టణంలోని ఆదివారం జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా మండల్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో ఆత్మకూరు న్యాయస్థానం నుండి గాంధీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. భారత్ అధ్యక్షుడు జికె.రాములు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ 9న న్యాయ దినోత్సవం జరుపుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జికె.రాములు, డి.అశోక్‌కుమార్, బార్ ప్రధాన కార్యదర్శి ముక్తేశ్వర్, సీనియర్ న్యాయవాది తిప్పారెడ్డి, నారాయణగౌడ్, న్యాయవాదులు శంకర్ లింగం, పిన్నంచర్ల అశోక్‌గౌడ్, రామచందర్ జి.రామచందర్ జి.అబ్రహం, కోర్టు సూపరింటెండెంట్ తిప్పన్న, లోక్ అదాలత్ సిబ్బంది స్వప్న, విద్యావతి, రాజ్యలక్ష్మి, కోర్ట్ కానిస్టేబుల్స్ జాకీర్, బాలరాజు పాల్గొన్నారు.



## మల్లన్న సేవలో దేవాంగ్ సంఘం

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** పవిత్ర శ్రీశైల మల్లికార్జునస్వామి సన్నిధిలో నారాయణపేట మండల పరిధిలోని జాజాపూర్ దేవాంగ్ సమాజ సభ్యులు పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొని తమ భక్తిని చాటుతున్నారు. మల్లన్న సన్నిధిలో గత మూడు రోజుల నుండి మహిళలు వివిధ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములై తరిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు వివిధ సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో పాటు స్వామి వారి ఆలయంలో వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతూ పలువురి మన్ననలు పొందుతున్నారు. జాజాపూర్ దేవాంగ్ సమాజ మహిళా సభ్యులు గత కొన్నేళ్ల నుండి శ్రీశైల మల్లికార్జున స్వామి సేవలో పాల్గొంటున్నారు.

## ఫింగర్ ప్రింట్స్ డివైస్‌తో తనిఖీలు : మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి



**ప్రజాపక్షం/మక్తల్ :** జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపిఎస్ ఆదేశాల మేరకు మక్తల్ మండల కేంద్రంలో ముందస్తు నేరాల నియంత్రణలో భాగంగా దొంగతనాల నివారణనే లక్ష్యంగా, పాత నేరస్తులను గుర్తించడానికి బ్లూ కోల్డ్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరిగిందని ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి తెలిపారు. ఆదివారం మక్తల్ బస్టాండు ప్రధాన చౌరస్తాలలో మక్తల్ పోలీసులు మనోహర్, శ్రీహరిలు ఆకస్మికంగా ఫింగర్ ప్రింట్స్ డివైస్‌తో తనిఖీలు నిర్వహించడం జరిగింది. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను తగిన రీతిలో పరిశీలించి, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఫింగర్ ప్రింట్ డివైస్ తో వ్యక్తుల వేలిముద్రలు సేకరించి క్రిమినల్ రికార్డులతో సరి పోల్చారు. పౌరులు ఎటువంటి అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను తగిన రీతిలో పరిశీలించి, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఫింగర్ ప్రింట్ డివైస్‌తో వ్యక్తుల వేలిముద్రలు సేకరించి క్రిమినల్ రికార్డులతో సరిపోల్చారు. పౌరులు అనుమానాస్పద వ్యక్తులు గమనించినా వెంటనే లోకల్ పోలీసులకు లేదా డయల్ 100కి సమాచారం ఇవ్వాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.



## ఉపాధ్యాయుడి కుటుంబానికి పిఆర్‌టియు చేయూత

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి మండల హరిజనవాడ కల్వకుర్తి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ అనారోగ్యకారణాలవల్ల మృతిచెందినటువంటి కప్పెర జంగయ్య కుటుంబసభ్యులకు పిఆర్‌టియు సంక్షేమసంస్థ నిధినుండి లక్ష రూపాయల చెక్కును వారి కుటుంబసభ్యులకు ఆదివారంవారి స్వగృహంలో అందజేశారు. కార్యక్రమంలో కల్వకుర్తి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మర్యాదకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దొడ్ల సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర జిల్లాబాధ్యులు సాయిని శ్రీనివాస్, సుభాన్, శ్రవణ్, శంకర్, ఆనంద్, మన్సూర్ పాల్గొన్నారు.

## మదర్‌షావలి గంధోత్సవం వేడుకలకు హాజరైన నాయకులు

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణంలో సుభాష్‌నగర్‌లో ఏర్పాటుచేసిన గ్యార్మీ వేడుకలకు ముఖ్యఅతిథులుగా విద్యాకమిషన్ మెంబర్ చారకొండ వెంకటేష్, జడ్పీవైస్ చైర్మన్ బాలాజిసింగ్, మాజీసర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ దర్గాలో ప్రార్థనలుచేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీకౌన్సిలర్లు శానవాజ్‌ఖాన్, ఎజాస్, మార్కెట్‌డైరెక్టర్ మసూద్, మైనార్టీ నాయకులు సోఫిఆరిఫ్ , ముక్తాదర్,ఖయ్యూం, హిమాయత్ పాల్గొన్నారు.



# పరేషాన్‌లో పత్తి రైతులు

### ఇప్పటికీ స్లాట్స్ బుక్ అవ్వని పత్తి కొనుగోలు

**ప్రజాపక్షం/ఆత్మకూరు :** మద్దతు ధర 8110 రూపాయలు లేనట్టే 8 శాతం తేమ లోపు ఉంటే మద్దతు ధర 8110, 8 శాతం కంటే తక్కువగా ఉన్న ప్రతి ఒక్క శాతానికి 81 రూపాయలు కోత, 12 శాతంకు మించి ఉంటే కొనుగోలు చేయడానికి కుదరదు. 8 నుంచి 12 శాతం తేమ ఉంటే కొనుగోలుపైన ప్రతి ఎకరాకు 7 క్వింటాలు మాత్రమే గతంలో 12 క్వింటాల కొనుగోలు అధిక వర్షాల కారణంగా చాలా చోట్ల అధిక తేమ 15 నుంచి 20 శాతం. వనపర్తి జిల్లాలో ఆత్మకూర్, అమరచింత మండలాల్లో పత్తి విస్తీర్ణం దాదాపుగా12 వేల ఎకరాలు సాగు చేయడం జరిగింది. అధిక వర్షాల కారణంగా గణనీయంగా దిగుబడులు తగ్గిపోవడం జరిగింది. ఈ దిగుబడులు తగ్గడం వల్ల పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదు. ఒక్క కూలికి ఒక రోజుకు 500 వెచ్చించి పత్తి తీయించడం జరిగింది. కూలీల ఖర్చు పత్తి తీయించడం జరిగింది. కూలీల ఖర్చు భరించలేక ప్రైవేట్ మార్కెట్లో 6000 నుంచి 6800 రూపాయలకు మాత్రమే అమ్ముకొచ్చినా కనీసం కూలీల ఖర్చు కూడా పైసలు రావడం లేదు. పత్తి కొనుగోలు ఒక నెల క్రితం సెంటర్లు ప్రారంభించినా ఇప్పటివరకు వనపర్తి జిల్లాకు కేటాయించిన ఎమ్మెస్.ఎస్ఎస్వి జిన్నర్స్ ప్రైవేట్ లిమిటెడ్ మిల్లులో ఒక్క స్లాట్ బుక్ అవడం లేదు త్వరగా ఈ మిల్లులో స్లాట్ బుక్ అయ్యేవిధంగా చూసి రైతులను మద్దతు ధర దక్కేలా చూడాలని పత్తి రైతులు కోరుతున్నారు.



## వీపనగండ్ల గురుకుల విద్యార్థుల ప్రతిభా ప్రదర్శన

### జిల్లా స్థాయి క్రీడల్లో ఘన విజయం



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** తెలంగాణ రాష్ట్ర సామాజిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట సంక్షేమ గురుకుల క్రీడా ప్రాంగణంలో ఇటీవల నాలుగు రోజుల పాటు నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడల పోటీల్లో వీపనగండ్ల (కొత్తకోట) గురుకుల పాఠశాల కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి అనేక విభాగాల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులను కైవసం చేసుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ పి.సాయి రెడ్డి తెలిపారు. అండర్17 విభాగంలో నిర్వహించిన ఫుట్‌బాల్, కబడ్డీ, చెస్ పోటీల్లో వీపనగండ్ల గురుకుల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించగా, అండర్19 విభాగంలో ఫుట్‌బాల్, క్యారమ్స్ పోటీల్లో కూడా ప్రథమ బహుమతులు గెలుచుకున్నారు. అదేవిధంగా హ్యాండ్‌బాల్, ఖోఖో విభాగల్లో ద్వితీయ బహుమతులు అందుకున్నారు. అథ్లెటిక్స్ విభాగంలో విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ 1500 మీటర్లు, 800 మీటర్లు పరుగు పందెంలో ప్రథమ స్థానాలు సాధించడం పాఠశాల గర్వకారణమని సాయి రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులు తొలిసారిగా ఇంత విస్తృతంగా క్రీడా పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలవడం, పాఠశాల స్థాయిలో క్రీడా ప్రోత్సాహానికి నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ విజయానికి కృషి చేసిన పిఇటిలు, పిడిలు, ఉపాధ్యాయ బృందంకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల విజయంలో భాగస్వామ్యమైన తల్లిదండ్రులు కూడా ఆనందం వ్యక్తం చేశారు. ఈ విజయంతో వీపనగండ్ల గురుకుల పాఠశాల కళాశాల విద్యార్థులు క్రీడారంగంలో కొత్త రికార్డులు సృష్టించి, తమ ప్రతిభతో గురుకుల ప్రతిష్టను మరింత ఎత్తుకు చేర్చారు.

## కారులో మంటలు

**ప్రజాపక్షం/అచ్చంపేట :** హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళుతున్న ఫార్చునర్‌కారు ఈగలపెంటవద్ద కారులో ఆకస్మికంగా మంటలుచెలరేగి పూర్తిగా దగ్ధమైన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఇందులో ప్రయాణిస్తున్న ఆరుగురు యాత్రికులు సురక్షితంగా బయటపడ్డారు. కారులో హైదరాబాద్‌కు చెందిన ప్రణవ్‌కుమార్ కుటుంబసభ్యులతో శ్రీశైలం వెళుతున్నామని కారులో ప్రణవ్‌తో పాటు ఆయన చెల్లెలు సుమ, భార్య జయశ్రీ, పిల్లలు తేజ, శ్రీవల్లి ఉన్నారు. కారులో వేడివాతావరణం కారణంగా వెంటనే దిగామని దిగిన రెండు నిమిషాల్లోనే కారు పూర్తిగా దగ్ధమైందని తెలిపారు. ఈగలపెంట ఎస్ఐ జయన్న సంఘటన స్థలానికి వచ్చి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




## సేవలలో అగ్రగామి వాసవిక్లబ్ ఇంటర్నేషనల్

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** సమాజంలోని అన్నివర్గాల ప్రజలకు సేవలందించడంలో అగ్రభాగాన నిలిచే సామాజిక సంస్థ వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ అని వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్‌వైస్ ప్రెసిడెంట్ జూలూరు రమేష్‌బాబు అన్నారు. ఆదివారం వనస్థలిపురం వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన డిస్ట్రిక్ వి102 ఏ రీజియన్ 2 శ్రీశైల భ్రమరాంభిక సేవ పురస్కారవైభవం సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రీజియన్‌పరిధిలోని వాసవిక్లబ్ ద్వారా చేపట్టిన సామాజిక సేవలను అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలలో సేవలను అందించడం గొప్ప విషయమన్నారు. సేవలతోనే సార్థకత లభిస్తుందన్నారు. సామాజికసేవ బాధ్యతగా తీసుకొని ప్రతి ఒక్కరు ముందుకుసాగాలని తోటివారికి సహాయం అందించే గుణంతో మెలగాలని కోరారు. కార్యక్రమంలో రీజియన్‌చైర్మన్ మద్ది శివ నాగేశ్వరరావు, సరస్వతి, పరమేష్, నవీన్, రమేష్, ఉప్పల శ్రీనివాస్, వాసవిక్లబ్ అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు , క్లబ్ సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



## వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/దామరగిద్ద :** దామరగిద్ద మండలంలోని పిడెంపల్లి, మల్‌రెడ్డిపల్లి, కానుకుర్తి వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన కార్యక్రమంలో మాజీ డిసిసి అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాంపురం శివారెడ్డి , రైతులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు ఎవరూ కూడా బయట తక్కువ ధరలకు అమ్మి నష్టపోవద్దని, ప్రభుత్వమే కనీస మద్దతు ధరకు కొని రూ.500లు బోనస్ ఇస్తోంది అని చెప్పారు.



## విద్యపట్ల ఆసక్తి ఉన్నవారికి ఓపెన్‌స్కూల్ చక్కని అవకాశం

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** విద్యపట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులు, ఉద్యోగులు, గృహిణులు ఓపెన్‌స్కూల్ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యావంతులుకావాలని ఓపెన్‌స్కూల్‌లో అడ్మిషన్‌పొందినవారు విధిగా ప్రతి రెండోశనివారం , ఆదివారం తరగతులకు హాజరుకావాలని తెలంగాణరాష్ట్ర ఓపెన్‌స్కూల్ జాయింట్‌డైరెక్టర్ ఎం.సోమిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లాపరిషత్ బాలికల ఉన్నతపాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న పదోతరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్‌స్కూల్ స్టడిసెంటర్లలో బోధన ప్రక్రియలను రాష్ట్రజాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి ఆకస్మికంగా తనిఖీచేసి ఓపెన్‌స్కూల్ బోధన తరగతులను పరిశీలించారు. ఓపెన్‌స్కూల్ సెంటర్లలో విద్యార్థుల నమోదు, హాజరు వివరాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం దూర విద్య విధానంలో పదోతరగతి, ఇంటర్మీడియట్ కోర్సులను విజయవంతంగా నిర్వహిస్తుందన్నారు. ఈవిద్యాపీఠం జారీచేసే సర్టిఫికెట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొంది ఉండి ఉన్నత చదువులకు, ఉద్యోగాలు పొందుటకు అర్హత కలిగి ఉంటుందన్నారు. 2025–26 విద్యా సంవత్సరానికిగాను పదోతరగతిలో 403 విద్యార్థులు, ఇంటర్మీడియట్‌లో 996మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో నిర్వహిస్తున్న ఓపెన్‌స్కూల్ తరగతులపై ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు. ఆయనవెంట జిల్లా ఓపెన్‌స్కూల్ కోఆర్డినేటర్ శివప్రసాద్, ఆయాసెంటర్ల అధ్యాపకులు రవిప్రకాష్, తిరుపతయ్య, అహ్మద్, యాదగిరి , బాలరాజు ఉన్నారు.

## ఘనంగా మాతా మాణికేశ్వరి 7వ వార్షికోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** నారాయణపేట జిల్లా కేంద్ర సమీపంలోని పగడి మారి రోడ్డు లో గల శ్రీశ్రీశ్రీ సద్గురు రూపరహిత అహింసా యోగేశ్వరి వీరధర్మజ మాతా మాణికేశ్వరి ఏడవ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు ధ్వజారోహణము, 7 గంటలకు గోమాత పూజ, 8 గంటలకు నాగ సింహాసన అభిషేకము, 9 గంటలకు అమ్మవారి పాదుకల అభిషేక పూజలు, మహా గాయత్రి యజ్ఞము, 12 గంటలకు మంగళహారతి, మహిళలచే ఓంకారం త్రిశూలాకార కార్తీక దీపాలంకరణోత్సవం, ఒంటి గంటకు తీర్థ ప్రసాద అన్న దాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిసిసి మాజీ అధ్యక్షులు కుంభం శివ కుమార్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైరమన్ శివారెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కోట్ల మధుసూదన్ రెడ్డి, మాధవ రెడ్డి లతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, నారాయణపేట మాత మాణికేశ్వరి ఆశ్రమ కమిటీ సభ్యులు ఏవి మందార, ఏవి లత, బండి శివరాం రెడ్డి, బండి రాజేశ్వరి, వాల్వేకర్ నికేతన్, దశరథ్, విటల్ బిలాల్, తమ్మలి సత్యనారాయణ, కొండల శ్రీనివాస్, భూపాల్ రెడ్డి, సుజాత, వాసవి లతో పాటు మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు ప్రైవేటు బీమా కంపెనీలకు ఇవ్వొద్దు : నిక్సన్




**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట భవన నిర్మాణ సంక్షేమ బోర్డు స్కీములు ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ డిమాండ్ చేశారు. ఆదివారం భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో కొత్తకోట చౌరస్తాలో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులు గుర్తింపులేని ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని ఆయన చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన 346 కోట్లు తిరిగి వెల్ఫేర్ బోర్డులో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అక్రమంగా 346 కోట్లు దారి మళ్లించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే కార్మికులకు హెల్త్ టెస్టుల పేరుతో సిఎస్‌సి సంస్థకు 463 కోట్లు దోచిపెట్టారని ఆయన విమర్శించారు. ఆ సంస్థకు నిధులు ఇవ్వకుండా ఆపివేయాలని హెల్త్ టెస్టులను రద్దుచేయాలని కార్మికులకు అందరికీ ప్రభుత్వం ద్వారా హెల్త్ కార్డులు ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కావలి చిన్న వెంకటయ్య, కొత్తకోట టౌన్ అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి వెంకటేష్, కోశాధికారి శాంతన్న, సీనియర్ నాయకులు పి.జనార్ధన్ ,గొల్ల వెంకటయ్య, సంధ ఆంజనేయులు, కానాయపల్లి సంఘం అధ్యక్షులు చిట్యాల రాములు, గోపాల్, భాస్కర్, చిట్యాల కృష్ణయ్య, అమడబాకుల సంఘం అధ్యక్షులు కురుమూర్తి, వి.నాగరాజు, రాములు, వడ్డే శ్రీను, ఉప్పరిరాజు, కురుమూర్తి, గార్లపాటి వెంకటయ్య, పి.వెంకటయ్య, రమేష్, బి.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# 'ఎఐ'తో మంచి, చెడు, రెండూ...

### భవిష్యత్తు అంతా ఎఐదే...!
### చెడును గుర్తించి ముందుకు సాగాలి
### ఎఐతో ఎన్నో అద్భుతాలు చేయొచ్చు:సుధాకర్ రెడ్డి

**ప్రజాపక్షం/గజ్వేల్;**ఎఐతో మంచి, చెడు రెండూ ఉన్నాయని టియుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఖాజా విరాహాత్ అలీ అన్నారు. గజ్వేల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని 'ఓ ప్రైవేటు గార్డెన్ లో ఆదివారం ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌మీడియా' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో వక్తగా ఉడుముల సుధాకర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విరాహాత్ అలీ మాట్లాడుతూ, ఎఐ కత్తిలాంటిదని, మనం ఎలా ఉపయోగించుకుంటే అలా ఉపయోగపడుతుందని చెప్పారు. గ్రామీణ స్థాయిలో విలేకరులకు ఎఐపై అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఎఐతో ఎన్నో అద్భుతాలు చేయవచ్చని, అన్ని రకాల సమాచారం నిర్లిప్తమై ఉంటుందని, కానీ పూర్తి స్థాయిలో ఎఐపై ఆధారపడవద్దని కోరారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు సురేందర్, సత్యనారాయణరావు, కృపాకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, నాయిని యాదగిరి, విజయరావు, శంకర్, ఎల్లం, కృష్ణ, చిన్న యాదగిరి, రమణారెడ్డి, కిరణ్, జగదీశ్, అశోక్, వెంకట్ రెడ్డి, మహేందర్ రెడ్డి, యాదగిరి, బాలకృష్ణ రెడ్డి పాల్గొన్నారు.





## ఘనంగా సిపిఐ శతజయంతి ఉత్సవాలు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** సిపిఐ పార్టీ ఏర్పడి వంద సంవత్సరాల సందర్భంగా దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని దేశ రాష్ట్ర పార్టీలు పిలుపునిచ్చాయి. ఆదివారం తాడూరు మండలం అంతారం గ్రామంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొమ్ముభరత్ మాట్లాడుతూ భారతదేశంలో సిపిఐ పార్టీ ఏర్పడి వంద సంవత్సరాలు అవుతున్న సందర్భంగా పెద్ద ఎత్తున ప్రజలను చైతన్యంచేసి కార్యక్రమాలు, సమావేశాలు, ర్యాలీలను సదస్సులు, సెమినార్లను నిర్వహించడం జరుగుతుందన్నారు. దేశం, రాష్ట్రం, జిల్లా, మండల కేంద్రాల్లో గ్రామీణప్రాంతంవరకు నిర్వహిస్తున్నటువంటి కార్యక్రమం అన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కృష్ణయ్య, ఠాగూర్, పరుష రాములు, లక్ష్మణ్, బంగారయ్య, శివుడు, రామాంజనేయులు, రామచంద్రయ్య, రాములు పాల్గొన్నారు.

# రీల్



## 14న సీమంతం విడుదల

టీఆర్ డ్రీమ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న క్రైమ్ థ్రిల్లర్ సీమంతం. హీరోగా వజ్రయోగి, హీరోయిన్‌గా శ్రేయ భర్తీ నటిస్తున్నారు. సుధాకర్ పాణి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతోంది. ఈ చిత్రం ప్రశాంత్ టాటా నిర్మాణంలో, గాయత్రి సౌమ్య గుడిసేవ సహనిర్మాతగా తెరకెక్కింది. రచయిత, దర్శకుడిగా సుధాకర్ పాణి వ్యవహరిస్తున్నారు. సంగీతం ఎస్. సుహాస్ అందిస్తున్నారు.గర్భవతులపై దాడుల నేపథ్యంలో సాగే ఈ థ్రిల్లర్ టీజర్ గ్రిప్ చేసే బీజీఎం, హై టెక్నికల్ వాల్యూస్‌తో ఆకట్టుకుంటోంది. ఈ సినిమా ఈ నెల 14న థియేటర్స్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో వజ్రయోగి, డైరెక్టర్ సుధాకర్, మ్యూజిక్ డైరెక్టర్ సుహాస్, సినిమాటోగ్రఫర్ శ్రీనివాస్, కో ప్రొడ్యూసర్ గాయత్రి సౌమ్య, హీరోయిన్ శ్రేయ భర్తీ తతరులు పాల్గొన్నారు.



మెగా స్టార్ చిరంజీవి మోస్ట్ అవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన శంకరవరప్రసాద్ గారు' ఫస్ట్ సింగిల్ మీసాల పిల్ల' 50

## 50 మిలియన్ల వ్యూస్ దాటిన 'మీసాల పిల్ల' పాట

మిలియన్ల వ్యూస్ క్రాస్ చేసి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తెలుగు సినిమా మ్యూజిక్ కి కొత్త బెంచ్‌మార్క్‌ను నెలకొల్పింది. హిట్‌మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం పండగ వాతావరణంలో, కుటుంబమంతా కలిసి చూసేలా ఉండే ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటోంది. ఆ వైబ్‌ను అద్భుతంగా అందించిన సాంగ్ మీసాల పిల్ల. భీమ్స్ సిసిరోలియో అందించిన ఎనర్జిటిక్ ట్యూన్, బీట్‌తో ఈ పాట దేశవ్యాప్తంగా చార్ట్‌బస్టర్‌గా మారింది. తెలుగు పాటగా ఇంత పెద్ద స్థాయిలో పాన్‌ఇండియా రీచ్ సాధించడం అరుదైన ఘనత. మెగా స్టార్ చిరంజీవి తన సిగ్నేచర్ చార్మ్, ఎక్స్‌ప్రెషన్స్, ఎనర్జిటిక్ డ్యాన్స్ మూవ్స్‌తో అభిమానుల హృదయాలను గెలుచుకున్నారు. ముఖ్యంగా నయనతారతో ఉన్న సీన్స్‌లో ఆయన టైమింగ్ ప్రేక్షకులను అలరించింది. ఉదిత్ నారాయణ్, శ్వేతా మోహన్ వోకల్స్ కట్టిపడేశాయి. ఆకట్టుకునే హుక్‌లైన్‌తో ఈ సాంగ్‌ను సోషల్ మీడియాలో వైరల్ సెన్సేషన్‌గా మార్చేశాయి. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, రీల్స్ ఎక్కడ చూసినా మీసాల పిల్ల ఫీవర్ కనిపిస్తోంది. అభిమానులు డాన్స్ చేస్తూ, రీమిక్స్ చేస్తూ, తమ ప్రేమను అద్భుతంగా వ్యక్తపరుస్తున్నారు. ఈ పాటకు వస్తున్న అద్భుతమైన స్పందనతో సినిమాపై ఎక్స్‌పెక్టేషన్స్ ఆకాశాన్ని తాకుతున్నాయి. మిగతా సాంగ్స్‌పై కూడా భారీ ఆసక్తి నెలకొంది. సాహూ గారపాటి, సుష్మిత కొణిదెల సంయుక్తంగా షైన్ స్క్రీన్స్, గోల్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై నిర్మిస్తున్న మన శంకరవర ప్రసాద్ గారు 2026 సంక్రాంతికి గ్రాండ్‌గా విడుదల కానుంది.



## 'ఇరువురు భామల కౌగిలిలో' షూటింగ్ షురూ

దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు దర్శకత్వ పర్యవేక్షణలో అచ్యుత్ చౌదరి దర్శకత్వంలో దీపా ఆరట్స్ శ్రీనివాస గౌడ్ నిర్మాతగా ఎంతో అట్టహాసంగా అతిరథ మహారుధుల సమక్షంలో హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోలో ప్రారంభమైన చిత్రం 'ఇరువురు భామల కౌగిలిలో'. పూజా కార్యక్రమాలతో షూటింగ్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా దర్శకులు కె.రాఘవేంద్రరావు స్క్రిప్టును నటీనటులు, దర్శక, నిర్మాతలకు అందచేశారు. 'కమిటీ కుర్రాళ్లు' ఫేమ్ త్రినాద్ వర్మ హీరోగా, వైష్ణవి కొల్లూరు, మలినా హీరోయిన్లుగా అక్షర గౌడ కీలకపాత్రలో నటిస్తోన్న ఈ చిత్రంలో ఎంతోమంది ప్రముఖ నటులు నటించనున్నారు. చిత్ర ప్రారంభోత్సవం సందర్భంగా హీరో హీరోయిన్లపై నిహారికా కొణిదెల క్లాప్‌నివ్వగా ప్రముఖ దర్శకులు బి.గోపాల్ కెమెరా స్విచాన్ చేశారు. ఫస్ట్‌షాట్‌కి ప్రముఖ దర్శకులు ఎ కోదండరామిరెడ్డితో పాటు నిర్మాత, కెమెరామెన్ ఎస్ గోపాల్రెడ్డి గౌరవ దర్శకత్వం వహించారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ జరుపుకోనున్న ఈ చిత్ర ఓపెనింగ్కి 'కమిటీ కుర్రాళ్లు' దర్శకుడు యధు వంశీతో పాటు ఆ సినిమాలో నటించిన నటీనటులందరూ పాల్గొన్నారు. టిల్లు స్వేర్ దర్శకుడు మల్లిక్రామ్, దర్శకులు వర ముళ్లపూడి తదితరులు ఓపెనింగ్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## తిరువీర్, ఐశ్వర్య రాజేష్ జంటగా కొత్త చిత్రం

తిరువీర్ హీరోగా సంక్రాంతికి వస్తున్నాం విజయం తర్వాత ఐశ్వర్య రాజేష్ జంటగా కొత్త చిత్రాన్ని ప్రారంభించారు. ఈ చిత్రం భరత్ దర్శన్ డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. గంగా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై మహేశ్వర రెడ్డి మూలి ప్రొడక్షన్ నంబర్ 2గా నిర్మిస్తున్నారు. తమ ఫస్ట్ ప్రొడక్షన్ శివమ్ భజేతో ప్రేక్షకులని అలరించిన గంగాఎంటర్టైన్మెంట్స్, మరో ఎక్సయిటింగ్ కథతో వస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమం హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయి.ప్రేక్షకులకు వైవిధ్యమైన కథలతో అలరించే తిరువీర్, మసూద నుంచి ప్రీ వెడ్డింగ్ షో వరకు డిఫరెంట్ జానర్లలో ఆకట్టుకున్నారు. ఈ కొత్త సినిమా హిలేరియస్ ఎంటర్టైనర్‌గా రూపుదిద్దుకుంటోంది. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇవ్వబోతోంది. ట్యాలెంటెడ్ టెక్నికల్ టీం సినిమాకి పని చేస్తోంది.



రజాకార్, పోలిమేర చిత్రాలకు సినిమాటోగ్రఫీ చేసిన సి.హెచ్. కుషేందర్ ఈ చిత్రానికి కెమెరామ్యాన్. ఎం.ఎం. కీరవాణి శిష్యుడు భరత్ మంచిరాజు సంగీతం సమకూరుస్తారు. బలగం ఫేం తిరుమల ఎం. తిరుపతి ఆర్ట్ డైరెక్టర్, క చిత్రానికి ఎడిటింగ్ చేసిన శ్రీ వరప్రసాద్ ఎడిటర్. స్వయంభు చిత్రానికి పని చేస్తున్న అను రెడ్డి అక్కటి ఈ చిత్రానికి కాస్ట్యూమ్ డిజైనర్. పాపులర్ లిరిక్ రైటర్ పూర్ణచారి ఈ చిత్రంలోని పాటలు రాస్తున్నారు. ఈ నెల 19వ తేదీ నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుంది. సినిమా తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో ఒకే సారి విడుదల కానుంది.



## పహల్గామ్‌లో 'అనుమాన పక్షి' కీలక షెడ్యూల్ పూర్తి

రాగ్ మయూర్ హీరోగా, డిజే టిల్లు ఫేమ్ విమల్ కృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'అనుమాన పక్షి'. చిలకా ప్రొడక్షన్స్ పై రాజీవ్ చిలకా, రాజేష్ జగ్తియాని, హిరాచంద్ దండ నిర్మిస్తున్నారు. భరత్ లక్ష్మీపతి సహనిర్మాత. సినిమా షూటింగ్ వేగంగా సాగుతోంది. తాజాగా కశ్మీర్‌లోని పహల్గామ్, శ్రీనగర్ ప్రాంతాల్లో కీలకమైన షెడ్యూల్‌ను పూర్తి చేశారు. ఈ ఏడాది ప్రారంభంలో అక్కడ జరిగిన దుర్ఘటన తర్వాత మళ్లీ పహల్గామ్‌లో షూట్ చేసిన తొలి సినిమా ఇది. సీఆర్పీఎఫ్ మార్గదర్శకత్వంలో, అన్ని భద్రతా నియమాలు పాటిస్తూ 20 రోజుల పాటు ఇంటెన్స్ షెడ్యూల్ షూట్ చేశారు. ఈ షెడ్యూల్‌తో సినిమాకి దాదాపు 80 శాతం షూటింగ్ పూర్తయింది. నవంబర్ చివర్లో తదుపరి షెడ్యూల్‌ను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇటివలే విడుదలైన టైటిల్, ఫస్ట్ లుక్ మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రానికి శ్రీ చరణ్ పాకాల సంగీతం అందించగా, సునీల్ కుమార్ నామా సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. ప్రిన్స్ సెసిల్, అనన్య, చారిత్ కీలక పాత్రల్లో కనిపించగా, బ్రహ్మాజీ, అజయ్, సీనియర్ నటి రాశి యూనిక్ రోల్స్‌లో కనిపించనున్నారు. విభిన్న కథతో, వినోదం, భావోద్వేగాల మేళవింపుతో తెరకెక్కుతున్న అనుమాన పక్షి త్వరలో థియేటర్లలోకి రానుంది.

## 'మా' సభ్యులకు హెల్త్ చెకప్

కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో 'మా' సభ్యుల కోసం విష్ణు మంచు హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 'మా' ప్రెసిడెంట్ విష్ణు మంచు, 'మా' ట్రెజరర్ శివ బాలాజీ, రాజీవ్ కనకాల పాల్గొన్నారు. హాస్పిటల్ తరుపున కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్ సీఓఓ సుధాకర్ జాదవ్, సీనియర్ కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్ డా.నవ వికాస్ జుకంటి, కన్సల్టెంట్ వాస్క్యులర్, ఎండోవాస్క్యులర్, డయాబెటిక్ ఫుడ్ స్పెషలిస్ట్ డా.నిషాన్ రెడ్డి, గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, హెపటాలజిస్ట్, డా.ముదుమల ఐసాక్ అభిలాష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విష్ణు మంచు మాట్లాడుతూ ''మా' సభ్యుల ఆరోగ్యం కోసం నిర్వహిస్తున్న హెల్త్ క్యాంప్ సభ్యుల ఆరోగ్యమే మాకు ప్రాధాన్యం. అందుకే ఇలా నిత్యం హెల్త్ క్యాంప్లను నిర్వహిస్తున్నాం. మాకు సహకరించిన కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్ బృందానికి ధన్యవాదాలు' అని అన్నారు. శివ బాలాజీ మాట్లాడుతూ'మా' సభ్యుల ఆరోగ్యం, సంక్షేమం కోసం మేం ఎల్లప్పుడూ ముందుంటాం. అందుకే ఇలా నిత్యం హెల్త్ క్యాంప్స్ని నిర్వహిస్తూ ఉన్నాం. వీటికి సహకరిస్తున్న ప్రతీ ఒక్కరికీ థాంక్స్' అని అన్నారు. రాజీవ్ కనకాల మాట్లాడుతూ ఆర్టిస్టులు ఎక్కువగా సమయం అనేది పట్టించుకోకుండా పని చేస్తుంటారు. 'మా' సభ్యుల కోసం ఇలా నిత్యం హెల్త్ క్యాంప్ లు నిర్వహిస్తుండటం ఆనందంగా ఉంది' అని అన్నారు.



## వనజీవి రామయ్యగా బ్రహ్మాజీ



పద్మశ్రీ వనజీవి రామయ్య జీవిత చరిత్ర ఆధారంగా ఓ సినిమా రాబోతోంది. ఈ చలన చిత్ర ప్రారంభోత్సవానికి హాజరుకావాలని కోరుతూ చిత్ర బృందం ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనమండలి సభ్యులు జూపూడి ప్రభాకర రావును హైదరాబాదులోని ఆయన నివాసంలో కలసి ఆహ్వానించారు. చిత్ర దర్శకుడు వేముగంటి, ఖమ్మం కు చెందిన ప్రముఖ సంగీత దర్శకుడు బల్లేపల్లి మోహన్ జూపూడిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. బ్రహ్మాజీ ప్రధాన పాత్రలో రూపొందనున్న ఈ చిత్రం షూటింగ్ ప్రారంభ వేడుక ఈనెల 21న ఖమ్మం జిల్లా బల్లేపల్లిలోని నేచర్ ర్యాలీలో జరుగుతుందని సంగీత దర్శకుడు బల్లేపల్లి మోహన్ తెలిపారు. వనజీవి రామయ్య జీవిత చరిత్రను భావితరాలకు స్ఫూర్తి నింపేలా చలనచిత్రం ఉండాలని ఈ సందర్భంగా జూపూడి ప్రభాకర రావు పేర్కొన్నారు. ఈ సినిమాకు సంబధించిన ఇతర నటీనటులు, సాంకేతిక వివరాలు త్వరలోనే వెల్లడించనున్నారు.

## బిగ్ బాస్‌లో స్టెప్పులేసిన శివ హీరో,హీరోయిన్

నాగార్జున హీరోగా, అమల హీరోయిన్‌గా రామ్ గోపాల్ వర్మను దర్శకుడిగా పరిచయం చేస్తూ ముప్పై ఆరేళ్ళ క్రితం రిలీజ్ చేసిన శివ సినిమా ఇప్పుడు మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. నవంబర్ 14న ఈ సినిమాను రిరిలీజ్ చేస్తున్న సందర్భంగా నాగార్జున సినిమా ప్రొమోషన్ డోస్ పెంచారు. ఏకంగా నాగార్జున, అమల దంపతులు కలసి బిగ్ బాస్ స్టేజిపై స్టెప్పులేశారు. ఈ వేదికపై రామ్ గోపాల్ వర్మను కూడా తీసుకొచ్చారు. అయితే థియేటర్ లో జరిగిన ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ లో ముప్పై ఆరేళ్ళ తరువాత నాగార్జున, వర్మ కలసి ఒకే వేదికపై ట్రైలర్ రిలీజ్ చేస్తామని అనుకోలేదని నాగార్జున వ్యాఖ్యానించారు. మొత్తానికి శివ సినిమా పై హైప్ క్రియేట్ చేసే పనిలో నాగార్జున నిమగ్నమై ఉన్నారు. 4కే డాల్బీ ఆటోమాస్ సౌండ్ సిస్టం తో శివ సినిమాను మరోసారి రిలీజ్ చేస్తున్నారు.



# కప్పిపుచ్చుకునేందుకే 'సర్'

(మొదటి పేజీ తరువాయి)

తాము క్రమంగా అందిస్తామన్నారు. అయితే తమ సమస్య ప్రధానంగా ఓటు దొంగతనమేనన్నారు. దానికి తోడు ఇపు సర్ కూడా చేరిందన్నారు. ఓటు దొంగతనాన్ని కప్పిపుచ్చుకునేందుకే సర్‌ను చేపడుతున్నారని రాహుల్‌గాంధీ ఆరోపించారు. భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని వివరాలను వెల్లడిస్తారా అని విలేకరులు ప్రశ్నించగా, రాహుల్‌గాంధీ స్పందిస్తూ తమ వద్ద చాలా భిన్నమైన, వివరణాత్మక సమాచార ఉందని, తాము వాటిని అవసరమైన సమయంలో విడుదల చేస్తామన్నారు. ప్రస్తుతం కొద్ది మేరకు మాత్రమే బయట పెట్టామని చెప్పారు. కానీ ఇప్పుడు ప్రజాస్వామ్యం, అంబేద్కర్ రాజ్యాంగంపై దాడి జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. (ప్రధానమంత్రి) మోదీ జీ, (కేంద్ర హోంమంత్రి) అమిత్ షా జీ, (ప్రధాన ఎన్నికల కమిషనర్) జ్ఞానేష్ జీ ఉమ్మడి భాగస్వామ్యాన్ని ఏర్పరచుకోవడం ద్వారా దీన్ని నేరుగా చేస్తున్నారని, దీని కారణంగా దేశం చాలా ఆవేదనకు గురవుతోందన్నారు. భారతమాతకు హాని జరుగుతోంది, భారతమాతకు నష్టం జరుగుతోందిదని ఆరోపించారు. మరో ప్రశ్నకు సమాధానంగా రాహుల్ గాంధీ స్పందిస్తూ మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుల శిక్షణపై తమకు మంచి స్పందన వచ్చిందన్నారు. సర్ కోస్ పోల్ అథారిటీ 5.3 లక్షలకు పైగా బూత్‌స్థాయి అధికారులు (బిఎల్‌ఒలు), 10,448 మంది ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, 321 జిల్లా ఎన్నికల అధికారులను రంగంలోకి దింపింది. అంతేకాకుండా, రాజకీయ పార్టీల 7.64 లక్షల బూత్‌స్థాయి ఏజెంట్లు (బిఎల్‌ఏలు) కూడా బిఎల్‌ఒలకు సహాయం చేయడానికి రంగంలోకి దిగారు. డిసెంబర్ 9న ఇసి ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేయనుంది. ఫిబ్రవరి 7న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తుంది. గత ఎన్నికలలో రాహుల్‌గాంధీ అక్రమాలను ఎత్తి చూపారని, అయితే ఓటర్ల జాబితాను శుభ్రపరిచే లక్ష్యంతో ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణను వ్యతిరేకిస్తున్నారని ఎన్నికల కమిషన్ అధికారులు ఇటీవల తెలిపారు. 2024 హర్యానా అసెంబ్లీ ఎన్నికలు దొంగిలించబడ్డాయని గాంధీ పేర్కొన్నారు. 25లక్షల ఓట్లు నకిలీవని, ఎన్నికల కమిషన్ బిజెపి విజయాన్ని నిర్ధారించుకోవడానికి కుట్ర పన్నిందని ఆయన ఓటర్ల జాబితా డేటాను ఉదహరించారు.

## భారీ ఉగ్రదాడులకు కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

నూనెను స్వాధీనం చేసుకుంది. నిందితుల్లో ఒకడైన అహ్మద్ మొహియుద్దీన్ హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి అని గుజరాత్ డిఐజి సునిల్ జోషి తెలిపారు. మరో ఇద్దరు నిందితులు ఆజాద్ సులేమాన్ షేక్, మొహమ్మద్ సుహెల్ సలీం ఖాన్ ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందినవారని పేర్కొన్నారు. అహ్మద్ మొహియుద్దీన్ ఇప్పటికే పలు ఉగ్రకార్యకలాపాల్లో పాల్గొన్నాడని తెలిపారు. అహ్మదాబాద్‌కు అతడు వస్తున్నట్టు సమాచారం అందడంతో నిఘా పెట్టారు. అదాలజ్ టోల్ ప్లాజా సమీపంలో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. 36 ఏళ్ల వయసున్నఅహ్మద్ మొహియుద్దీన్ చైనాలో ఎంబిబిఎస్ చేసినట్టు పోలీసులు తెలిపారు. దేశంలో పెద్ద ఎత్తున నష్టం కలిగించే ఉగ్రదాడి చేయాలని అహ్మద్ మొహియుద్దీన్ భావిస్తున్నట్టు పోలీసులు చెప్పారు. పలువురు విదేశీయులతోనూ టచ్‌లో ఉన్నట్టు గుర్తించారు. టెలిగ్రామ్ ద్వారా ఓ ఉగ్రసంస్థతో అతడు సంబంధాలు కొనసాగిస్తున్నాడు. ఆముదం గింజలను ప్రాసెస్ చేసిన తర్వాత మిగిలిపోయిన వ్యర్థ పదార్థాల నుంచి రైసిన్ అనే విషాన్ని తయారు చేస్తున్నట్టు గుర్తించారు.

### కశ్మీర్‌లోనూ వీరి కదలికలు నమోదు!

గుజరాత్‌లోని కాలోల్ నుంచి ఆయుధాలు తీసుకుని మరో ప్రాంతానికి వెళ్తుండగా అహ్మద్ మొహియుద్దీన్ చిక్కినట్టు పోలీసులు చెప్పారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మరో ఇద్దరు ఉగ్రవాదులను గుజరాత్‌లోని బనస్కాంతలో అరెస్టు చేశారు. ఉగ్రవాదానికి వీరు బాగా ప్రభావితమైనట్లు గుర్తించారు. వీరిద్దరు కూడా విదేశాల్లోని పలువురితో టచ్‌లో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఉగ్రదాడుల కోసం ఇప్పటికే ఢిల్లీ, అహ్మదాబాద్, లక్నోలో రెక్కీ నిర్వహించినట్లు తెలిపారు. కశ్మీర్‌లోనూ వీరి కదలికలు నమోదైనట్లు చెప్పారు. నిందితులతో సంబంధం ఉన్న వారిని సైతం గుజరాత్ ఎటిఎస్ విచారిస్తోంది. ఈ ఏడాది ప్రారంభంలో అల్ ఖైదా ఉగ్రసంస్థతో సంబంధం ఉన్న ఐదుగురిని గుజరాత్ ఎటిఎస్ అరెస్టు చేసింది. నిందితుల్లో బెంగళూరుకు చెందిన ఓ మహిళ సైతం ఉంది. ఆన్‌లైన్ వేదికగా ఆ మహిళ టెర్రర్ మాడ్యూల్‌ను నడుపుతున్నట్టు పోలీసులు గుర్తించారు. పాక్‌లోని ఉగ్ర సంస్థలతో సంబంధాలున్నట్టు తెలిపారు.

## నా కుమారుడి కంపెనీకి ప్రభుత్వ భూమి విక్రయంపై కొనసాగుతోన్న విచారణ

### ప్రజలకు త్వరలోనే నిజం తెలుస్తుంది

### మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్‌పవార్

**పుణే :** ప్రభుత్వ భూమిని పుణేలోని తన కుమారుడి కంపెనీకి అక్రమ విక్రయం జరిపారన్న ఆరోపణపై విచారణ జరుగుతోందని, త్వరలోనే నిజం ప్రజలకు వెల్లడి కానున్నదని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్‌పవార్ అన్నారు. ఆదివారం ఆయన పుణే జిల్లాలోని బారామతి వద్ద విలేకరులతో మాట్లాడారు. తన దగ్గరి సహచరులు లేదా బంధువలు తన పేరుతో నిబంధనలు ఉల్లంఘిస్తూ ఏదైనా ప్రకటనలు చేస్తే సంబంధిత అధికారులు తప్పకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అజిత్‌పవార్ కుమారుడు పార్థ్ పవార్ భాగస్వామిగా ఉన్న కంపెనీకి పుణేలోని ఉన్నత స్థాయి ముంధ్వా ప్రాంతంలోని 40ఎకరాలను రూ.300 కోట్లకు అమ్మడంపై ప్రశ్నలు తలెత్తాయి. ఈ కేసులో రెండు ప్రాథమిక సమాచార నివేదికలు నమోదు చేయబడ్డాయి. అయితే పార్థ్ పవార్ పేరు లేదు. పుణే భూ ఒప్పందం కేసును చట్ట ప్రకారం తీసుకుంటామని, ఎవరినీ రక్షించే ప్రశ్నే ఉత్పన్నం కాదని శనివారం ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారు. భూఒప్పందం అంశం గురించి ఆదివారం నాడు అజిత్ పవార్‌ను ప్రశ్నించగా 'నేను ఇప్పటికే నా వైఖరిని స్పష్టంచేశాను. గత కొద్ది రోజులుగా పలు సమస్యలు తలెత్తుతున్నాయి.

విచారణ ప్రారంభమైనది. ప్రజలకు నిజం త్వరలోనే తెలుసుంది. ఒక్క రూపాయి లావాదేవీ కూడా జరుగకుండా డాక్యుమెంట్ ఎలా రిజిస్టర్డ్ చేయబడిందనేది నాకు ఇప్పటికీ అర్థం కావడంలేదు. ఆ వ్యక్తి ఈ రిజిస్ట్రేషన్‌ను ఎందుకు చేశాడనే విషయం ఒక నెలలో మనకు తెలుస్తుంది' అని ఎన్‌సిపి నాయకుడు అజిత్ పవార్ చెప్పారు. ముఖ్యమంత్రి ఫడ్నవీస్ విచారణ కమిటీని నియమించారని అజిత్‌పవార్ వెల్లడించారు.

## కార్మికుల భారీ ప్రదర్శన

(మొదటి పేజీ తరువాయి)

పెనా (34) మాట్లాడుతూ, అన్యాయమైన పద్ధతులలో మాయోపాయ చర్యలతో కార్మికుల హక్కులు హరించేందుకు ఎత్తుగడ వేశారని వి మర్శించారు. ప్రభుత్వం కపటనాటకం ఆడుతోందని విమర్శించారు. దేశంలో కనీస వేతనాలు దారుణస్థాయికి పడిపోయాయన్నారు.ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికులు నినాదాలు చేశారు. కార్మికులను బెదిరించి వారి హక్కులను కాలరాసి యజమానులకు బానిసలుగా చేయాలని ప్రభు త్వం ప్రయత్నం చేస్తోందని కార్మికులు విమర్శించారు. ప్రతిపాదిత చట్టాలను తక్షణం ఉపసంహరించాలని వారు డిమాండ్ చేశారు. పోర్చుగల్ మతఛాంధసవాద ప్రభుత్వం కార్మికులను అణచివేసే చర్యలకు పాల్పడుతోందని వారు విమర్శించారు. ఉద్యోగులను సులభంగా తొలగించే అవకాశం ఇవ్వడం, ఔట్‌సోర్సింగ్‌కు వీలు కల్పించడం, గర్భస్రావాలతో బాధపడే మహిళలకు అవసరమైన సెలవుల సంఖ్యను తగ్గించడం, కొన్ని కారుణ్య సెలవులు, ఇతర పథకాలను కత్తిరించడంకోసం ఈ కొత్త సవరణలను, చట్టాన్ని తీసుకువస్తున్నారు. పశ్చిమ యూరప్‌తో పేదరికంలో మగ్గుతున్న పోర్చుగల్‌లో ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచేందుకు, ఉత్పాదకతను పెంచేందుకు వీలుగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం వాదిస్తోంది. కానీ దేశంలో ఇంతవరకూ ఏ ప్రభుత్వమూ ఇంత దారుణంగా కార్మికులను అణచివేయాలని ప్రయత్నం చేయలేదని, సంస్కరణల పేరుతో దేశ చరిత్రలో కార్మికులను అణచివేసేందుకు తీసుకున్న అతిపెద్ద చర్యలుగా సిజిపిటి నాయకులు విమర్శించారు. ఈనెల 11న సార్వత్రిక సమ్మెకు నాయకులు పిలుపు ఇచ్చారు.

## సైబర్ నేరగాళ్ల అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

తేలింది. నిందితుల్లో బ్యాంక్ అధికారులు సైతం ఉండడం గమనార్హం.అరెస్టు అయిన వారిలో 74 మంది పురుషులు, ఏడుగురు మహిళలు ఉన్నారు . సైబర్ నేరగాళ్ల ఏరివేత ఆపరేషన్ నిర్వహించడం దేశ చరిత్రలో ఇదే మొదటి సారి కావడం గమనార్హం. కేరళలో 28 మంది, మహారాష్ట్రలో 23 మంది, ఆంధ్రప్రదేశ్‌లో 10 మంది, తమిళనాడులో ఏడుగురు, కర్ణాటకలో 13 మందిని అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో 17 మంది ఏజెంట్లు, 1బ్యాంకుల నుంచి నేరుగా నేరాల్లో పాల్గొన్నవారు 11 మంది, మ్యూల్ అకౌంట్ హోల్డర్లు 53 మంది ఉన్నారు. ఈ 53 మంది తమ అకౌంట్‌లోకి డబ్బులు పడిన వెంటనే నేరగాళ్లకు డ్రా చేసి ఇస్తారు. ఇందుకు ఈ మ్యూల్ అకౌంట్ హోల్డర్లు ఐదు శాతం కమీషన్ తీసుకుంటారు.వీరి నుంచి 84 మొబైల్ ఫోన్లు, 101 సిమ్‌కార్డులు, 89 బ్యాంక్ పాస్‌బుక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో అరెస్టు చేసిన నిందితుల్లో విభిన్న వృత్తుల నుంచి వచ్చిన వారు ఉన్నారు. వీరిలో ఐడిఎఫ్‌సి బ్యాంక్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న నిందితుడు 106 కేసులలో సంబంధాలు కలిగి ఉన్నాడు. ఫెడరల్ బ్యాంక్ ఉద్యోగి, బంధన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్, కంప్యూటర్ ఆపరేటర్ డిప్లమా హోల్డర్‌లు 96 కేసుల్లో, చెన్నై కిల్‌పోక్ ఆడిట్ ఆఫీస్‌లో అకౌంటెంట్ 31 కేసుల్లో, బిబిఎ గ్రాడ్యుయేట్ 45 కేసులలో నిందితులుగా దర్యాప్తులే తేలింది. తన కార్పొరేట్ అకౌంట్‌ను మోసపూరిత లావాదేవీలకు ఉపగించిన ఒక ఎంఎన్‌సి ఉద్యోగి సైతం అరెస్టు అయిన వారిలో ఉన్నాడు. పట్టుబడిన 81 మంది నిందితులు తెలంగాణలోని ఏడు సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లలో 41 నేరాలకు పాల్పడ్డారు. ఈ ఆపరేషన్‌లో ఎస్‌పి బిక్షంరెడ్డి, డిఎస్‌పిలు కెవి సూర్యప్రకాశ్, ఎస్‌వి హరికృష్ణ, కెవిఎం ప్రసాద్, వై.వెంకటేశ్వరరావు, కె.గిరికుమార్, వేణుగోపాలరెడ్డి, బి.అశోక్, ఏ.సుభాష్ చంద్రబోస్, నందిరామ్‌లు పాల్గొన్నారు.

### అప్రమత్తంగా ఉండాలి: టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్

ప్రస్తుతం వెలుగులోకి వస్తున్న కొత్త రకాల సైబర్ మోసాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రేడింగ్, డిజిటల్ అరెస్టు మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. అధిక రాబడి ఇస్తామంటూ చెప్పే ఆన్‌లైన్ స్టాక్, ఫారెక్స్, క్రిప్టో ట్రేడింగ్ యాప్స్, టాస్క్‌బేస్ట్ ఇన్‌కమ్ ఆఫర్లను నమ్మవద్దు. పోలీసు, కస్టమ్స్, కూరియర్ అధికారులు ఎప్పుడు ఆన్‌లైన్‌లో డబ్బు ఆడగరు, వీడియో వెరిఫికేషన్ కోరరు. ఇలాంటి బెదిరింపులు ఎదురైతే వెంటనే ఫిర్యాదు చేయండి. వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు, ఒటిపిలు, క్యూఆర్ కోడ్‌లు అన్యులతో పంచుకోవద్దు. అపరిచిత ఖాతాలకు డబ్బులు పంపవద్దు. సోషల్ మీడియా లింకులను నమ్మవద్దు. అనుమానాస్పదమనిపిస్తే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలి.

## సంఘ్ రక్షణకోసం చెప్పే వక్రభాష్యం

(మొదటి పేజీ తరువాయి)

గుర్తింపు ఉన్నట్టేనని, హిందూ ధర్మానికి గుర్తింపు లేదని, అదేవిధంగా ఆర్‌ఎస్‌ఎస్‌కు కూడా గుర్తింపు అవసరం లేదని మోహన్ భాగవత్ చెప్పడాన్ని డి.రాజా తీవ్రంగా ఖండించారు. సంఘ్ మాటలు మారాయని, కానీ అది ఇక ఎవ్వరినీ మోసం చేయలేదని, దాని మౌలిక లక్షణం, ఆలోచనల్లో ఎలాంటి మార్పులూ ఉండవని, చరిత్రను పునర్లిఖించేందుకు, చట్టాలను రద్దుచేసేందుకు, భారత్‌ను ఒక మతానికి అనుకూలంగా పునర్నిర్మించేందుకు చేస్తున్న సంఘ్ ఆలోచనల్లో ఎలాంటి మార్పూ లేదని విమర్శించారు. భారత కమ్యూనిస్టుపార్టీ కూడా 1925 లోనే ఆవిర్భవించిందని, అనేకసార్లు నిషేధానికి గురైందని, కానీ భారత కమ్యూనిస్టు పార్టీ దేశంలో రిజిస్ట్రేషన్ ఉన్న పార్టీ అనీ, భారత రాజ్యాంగానికి జవాబుదారీ వహిస్తుందని, బాహాటంగా, ఎలాంటి దాపరికాలు లేకుండా తన కార్యకలాపాలను నిర్వహిస్తుందని, అనేక ఇతర సంస్థల తరహాలోనే భారత కమ్యూనిస్టుపార్టీ కూడా వలసవాద పరిపాలనను సవాలు చేసిందని పేర్కొన్నారు. కానీ ఆర్‌ఎస్‌ఎస్ మాత్రం ఆనాడు రహస్య కార్యకలాపాలు నిర్వహించే మార్గం ఎన్నుకుందని, ఈనాటికీ మనుగడ సాగిస్తోందని ప్రకటనలో పేర్కొన్నారు. 'నిషేధానికి గురికావడమే గుర్తింపునకు ఒక అర్హతగా చెప్పుకుంటే అంతకంటే హాస్యాస్పదమైన విషయం మరొకటి ఉండదు, గుర్తింపు లేకుండా రహస్యంగా పనిచేస్తున్న సంస్థలు ఎన్నో ఉన్నాయి, వాటిల్లో కొన్ని సంస్థలు ఉగ్రవాద సంస్థలుగా ముద్ర వేసుకున్నాయి, అలాంటి సంస్థలు నిషేధానికి గురయ్యాయి, మరి ఆర్‌ఎస్‌ఎస్ కూడా అలా నిషేధానికి గురైన జాబితా సంస్థల్లో ఉందని భావిస్తోందా?'' అని డి.రాజా ప్రశ్నించారు. 'గుర్తింపు పొందకుండా, రిజిస్ట్రేషన్ చేయించుకోవడాన్ని నిరాకరించడం దేశభక్తి అనిపించుకోదు, అది కుంటిసాకు, ఎగవేసి తప్పించుకునే మార్గం. రిజిస్ట్రేషన్ పొందితే ఆర్‌ఎస్‌ఎస్ ప్రజలకు జవాబుదారీగా ఉంటుంది, న్యాయపరమైన బాధ్యతతో వ్యవహరిస్తుంది, పన్నులు చెల్లించి బాధ్యతగా ఉంటుంది, చివరకు ఆర్‌ఎస్‌ఎస్ కేంద్ర కార్యాలయం కూడా దానిపేరుతో లేదు. ఆర్‌ఎస్‌ఎస్‌ను హిందూధర్మంతో సమానంగా చూపించి పోల్చుకోవడం మరో మోసమో, మాయాజాలమో గారడీయో అవుతుంది. మన భారతదేశంలో ఏ మతానికి రిజిస్ట్రేషన్ అవసరం లేదు, కానీ ఆర్‌ఎస్‌ఎస్ హిందువులకు ప్రాతినిధ్యం వహించడంలేదు, అది ఒక సిద్ధాంతానికి ప్రాతినిధ్యం వహిస్తోంది. కులం అనేది కేవలం చెప్పుకోవడానికి మనుషుల ఆలోచనల్లోనే ఉంది, దానిని నిర్మూలించడంకోసం మనదేశంలో గురునానక్, కబీర్ దగ్గర నుండి పూలే వరకూ ఎంతోమంది సంస్కర్తలు పోరాటం చేశారు, పెరియార్, అంబేద్కర్‌వంటి సంస్కర్తలు పోరాటం చేశారు, కులం గురించి చెప్పడం సంస్కరణలకోసం పోరాడిన ఈ సంస్కర్తలను అవమానించినట్లే. కులం అనేది చాలా స్పష్టంగా మనుషుల ఆలోచనల్లో మాత్రమే ఉంది, ఈ కుల వ్యవస్థను ఆర్‌ఎస్‌ఎస్ సమర్థిస్తోంది, భారతదేశాన్ని ఒక వర్గానికి అనుకూలంగా పునర్నిర్మించేందుకు సంఘ్ చేస్తున్న ప్రయత్నాలు మారలేదు, దాని మాటలు మాత్రమే మారాయి'' అని డి.రాజా తన ప్రకటనలో విమర్శించారు.

### ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తుల సంఘంగా గుర్తింపు పొందింది: భాగవత్

ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించాలంటూ కాంగ్రెస్ చేసిన వ్యాఖ్యలపై మోహన్ భాగవత్ స్పందిస్తూ, ఆదాయ పన్నుశాఖ, న్యాయస్థానాలు తమ సంఘ్‌ను వ్యక్తుల సమూహంగా గుర్తించి మినహాయింపు ఇచ్చాయన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు ఎలాంటి గుర్తింపూ అవసరం లేదని, హిందూ ధర్మానికి దేశంలో రిజిస్ట్రేషన్ లేదని, అదేవిధంగా ఆర్‌ఎస్‌ఎస్‌కు కూడా రిజిస్ట్రేషన్ అవసరం లేదన్నారు. 'ఆర్‌ఎస్‌ఎస్ 1925లో ఆవిర్భవించిందని, మరి అలాంటప్పుడు బ్రిటిష్ ప్రభుత్వంతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మీరు కోరుకుంటున్నారా?' అని భాగవత్ ప్రశ్నించారు. ఆర్‌ఎస్‌ఎస్ బెంగళూరులో నిర్వహించిన ఒక సమావేశంలో అడిగిన ప్రశ్నకు ఆదివారం భాగవత్ పైవిధంగా సమాధానంచెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా, తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆర్‌ఎస్‌ఎస్‌ను భారత ప్రభుత్వం ఒత్తిడి చేయలేదని అన్నారు. తమను (ఆర్‌ఎస్‌ఎస్‌ను) వ్యక్తుల సమూహంగా చట్టబద్ధమైన వ్యవస్థలు గుర్తించాయని, తమ సంస్థకు గుర్తింపు అవసరం లేదన్నారు. 'మా సంస్థను మూడుసార్లు నిషేధించారు, అంటే దాని అర్థం ప్రభుత్వం మాకు గుర్తింపు ఇచ్చినట్టే కదా? రాజకీయపార్టీలు ఆర్‌ఎస్‌ఎస్‌కు అసలు గుర్తింపే లేదని వాదిస్తున్నాయి, మరి గుర్తింపులేని సంస్థను ప్రభుత్వాలు ఆనాడు ఎలా నిషేధించాయి?'అని భాగవత్ ప్రశ్నించారు. మనదేశంలో రిజిస్ట్రేషన్ లేనివి ఎన్నో ఉన్నాయి, అందులో హిందూ ధర్మం కూడా ఒకటి, అదేవిధంగా హిందూ ధర్మాన్ని పరిరక్షించే ఆర్‌ఎస్‌ఎస్‌కు కూడా రిజిస్ట్రేషన్ అవసరం లేదు' అన్నారు. మేం ఎల్లప్పుడూ దేశ త్రివర్ణ పతాకాన్ని గౌరవిస్తాం అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com